PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 357 | విజయవాడ, మంగళవారం 29 జులై 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 29 July 2025 | Rs

ఖాళీ స్థానిక సంస్థలకు ఎన్నికల నోటిఫికేషన్

- ఆగస్టు 10న సర్పంచ్, 12న ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలు
- రాష్ట్ర ఎన్నికల కమిషన్

2



దివ్య దేశ్‌ముఖ్ సంచలనం

ఫిడే మహిళల ప్రపంచకప్ టైటిల్ కైవసం ● టైబ్రేక్‌లో కోనేరు హంపిపై గెలుపు

బటుమి (జార్జియా): ఫిడే మహిళల ప్రపంచకప్‌ను మహారాష్ట్రకు చెందిన దివ్య దేశ్‌ముఖ్ చేజిక్కించుకొని కొత్త చరిత్ర సృష్టించింది. సీనియర్ గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపితో సుదీర్ఘంగా 72ఎత్తుల పాటు సాగిన టైబ్రేక్‌లో విజయం సాధించింది. దీంతో 19ఏళ్లకే ఫిడే చెస్ ప్రపంచకప్ టైటిల్ గెలిచిన తొలి భారత గ్రాండ్‌మాస్టర్‌గా రికార్డు పుటల్లోకెక్కింది. దివ్య-హంపి మధ్య జరిగిన తొలి రెండు గేమ్‌లు డ్రా కావడంతో టై బ్రేకర్ అనివార్యమైన సంగతి తెలిసిందే. ఇంతకుముందు కోనేరు హంపి రెండుసార్లు ప్రపంచ ర్యాపిడ్ చెస్ టైటిళ్లను కైవసం చేసుకున్నా.. ప్రపంచకప్ రన్నరప్‌గా నిలవడం ఇదే తొలిసారి. ఈ టైటిల్ చేజిక్కించుకోవడం ద్వారా దివ్య గ్రాండ్‌మాస్టర్ హోదాకు కావల్సిన మూడు జిఎంలను సాధించిన ట్లయ్యింది. ఫిడే నిబంధనల ప్రకారం 2500 అంతకంటే ఎక్కువ స్టాండర్డ్(క్లాసికల్) పాయింట్లను సాధించాల్సి ఉంది. దివ్య దేశ్‌ముఖ్ ఏమాత్రం అంచ నాల్లేకుండా బరిలోకి దిగి ఏకంగా టైటిల్‌ను కైవసం చేసుకొని జిఎం హోదాను కావల్సిన పాయింట్లను సాధించింది. అలాగే భారత 88వ గ్రాండ్‌మాస్టర్‌గా నిలిచింది. టైటిల్ విజేత దివ్యకు రూ.43 లక్షలు, రన్నరప్ హంపికి రూ.26 లక్షలు ప్రైజ్ మనీ దక్కింది.

దివ్య దేశ్‌ముఖ్‌కు గవర్నరు అభినందనలు

ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్-2025 ఛాంపియన్ షిప్ ఫైనల్స్‌లో విజేత దివ్య దేశ్‌ముఖ్‌కు, రన్నరప్‌గా నిలిచిన కోనేరు హంపికి ఆంధ్రప్రదేశ్ గవర్నరు అబ్దుల్ నజీర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ 2025 ఫైనల్స్ భారత్ చెస్‌కు ఒక మైలురాయిగా గుర్తుండిపోతుందని పేర్కొన్నారు. సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి ట్విటర్(ఎక్స్)లో దివ్య దేశ్‌ముఖ్‌కు అభినందనలు తెలిపింది. భవిష్యత్తులో మరిన్ని టైటిళ్లు కైవసం చేసుకోవాలని ఆకాంక్షించింది.



పార్లమెంట్‌లో ప్రసంగిస్తున్న కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

ఉగ్రవాదులు ఎలా వచ్చారు?

అమెరికా జోక్యమెందుకు? - పహల్గాం, సిందూర్‌లపై చర్చలో ప్రతిపక్షాల నిలదీత - లక్ష్యాలను సాధించాం : రాజ్‌నాథ్ సింగ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సరిహద్దులు దాటుకుని పెహల్గాంకు పాక్ ఉగ్రవాదులు ఎలా వచ్చారని పార్లమెంటులో ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి, ఉగ్రవాదులు పర్యాటక ప్రాంతానికి ఎలా చేరుకున్నారు? మారణకాండ జరిపి క్షేమంగా వెనక్కి ఎలా వెళ్లగలిగారని నిలదీశాయి. సోమవారం లోక్‌సభలో పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్‌పై చర్చ జరిగింది. ఈ సందర్భంగా దేశ భద్రతా దళాల చర్యలకు మద్దతు తెలిపిన ప్రతిపక్షాలు, ప్రభుత్వం వ్యవహరించిన తీరు, దేశ విదేశాంగ విధానానికి జరుగుతున్న నష్టం, అమెరికా జోక్యం తదితర అంశాలపై ప్రశ్నల వర్షం కురిపించాయి. చర్చను ప్రారంభించిన కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌లో వందకు పైగా ఉగ్రవాదులను మట్టు పెట్టినట్లు చెప్పారు. నిర్దేశించిన లక్ష్యాలను సాధించామని అన్నారు. పాకిస్తాన్ ఓటమి అంగీకరించడంతో ఆపరేషన్‌ను నిలిపివేశామని చెప్పారు. అనంతరం మాట్లాడిన ప్రతిపక్ష సభ్యులు అమెరికా జోక్యంతో పాటు వివిధ అంశాలపై ప్రశ్నల వర్షం కురిపించారు. కాంగ్రెస్ ఎంపి గౌరవ్ గగోయ్ మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ గురించి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ చాలా విషయాలు చెప్పారని, కానీ పెహల్గామ్‌కు ఎలా ఉగ్రవాదులు వచ్చారో చెప్పలేదని అన్నారు. మతం ఆధారంగా ప్రజల్ని టార్గెట్ చేయవద్దని గగోయ్ అన్నారు. పెహల్గాం ఉగ్రదాడికి కేంద్ర మంత్రి అమిత్ షా బాధ్యత వహించాలన్నారు. పాకిస్థాన్, భారత్ మధ్య కాల్పుల విరమణ తన వల్లే జరిగిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటి వరకు 26 సార్లు వెల్లడించారని, దీనిలో నిజం ఏంటో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ రుణం అందకుండా ఇండియా ఎందుకు అడ్డుకోలేదన్నారు. పాకిస్థాన్‌తో ఎందుకు కాల్పుల విరమణకు అంగీకరించారో ప్రధాని మోడీ చెప్పాలని డిమాండ్ చేశారు. సమాజ్‌వాదీ పార్టీ నేత ఎంపి రామశంకర్ రాజ్‌భర్ మాట్లాడుతూ పెహల్గాం ఉగ్రదాడికి కారణమైన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని దేశ ప్రజలు కోరుకున్నారని అన్నారు. మూడు రోజుల్లో చేపట్టాల్సిన మిషన్‌ను ఎందుకు 17 రోజులు ఆలస్యంగా చేపట్టినట్లు ఆయన నిలదీశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో చనిపోయిన వంద మంది ఉగ్రవాదుల్లో.. పెహల్గామ్ ఉగ్రదాడి నిందితులు ఉన్నారా? అని ప్రశ్నించారు. శివసేన (ఠాక్రే) ఎంపి అరవింద్ సావంత్ మాట్లాడుతూ ఎన్నికలు జరగనున్న బీహార్‌కు ప్రధాని మోడీ వెళ్లారని, కానీ పెహల్గాంకు ఎందుకు వెళ్లలేదని ప్రశ్నించారు. మణిపూర్‌కు కూడా ఇంత వరకు ఎందుకు వెళ్లలేదన్నారు.

భద్రతా లోపాలకు బాధ్యత ఎవరిది?
సిపిఎం ఎంపి ఎస్ వెంకటేషన్

పహల్గాం ఉగ్రవాద దాడికి కారణం భద్రతా లోపాలేనని సిపిఎం ఎంపి ఎస్. వెంకటేశన్ అన్నారు. తీవ్రమైన ఆ భద్రతా లోపాలకు ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ఉగ్రవాద దాడి సమయంలో సౌదీ అరేబియా పర్యటనను రద్దు చేసుకున్న ప్రధాని మోడీ పహల్గాంకు వెళ్తారని దేశం భావించినప్పటికీ, ఆయన బీహార్‌కు వెళ్లారని విమర్శించారు. ఈ చర్యతో మోడీ తన మనసులో ఎన్నికలు మాత్రమే ఉన్నాయని స్పష్టం చేశారన్నారు.

ఉగ్రవాద దాడి తరువాత కూడా, ఐఎంఎఫ్ పాకిస్తాన్‌కు భారీ ఆర్థిక సహాయం అందించిందని, కేంద్ర ప్రభుత్వం దానిని ఆపలేకపోయిందని అన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వ దౌత్యపరమైన లోపాల కారణంగానే జరిగిందని చెప్పారు.

ఇండియా-పాకిస్తాన్ మధ్యవర్తిత్వ చర్చలలో తాను జోక్యం చేసుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చెబుతున్నారని, దీనిపై మోడీ సరైన వివరణ కూడా ఇవ్వలేకపోయారని చెప్పారు.

దేశ ఆత్మపై జరిగిన దాడి
: లావు శ్రీ కృష్ణ దేవరాయలు

పహల్గాం దాడి భారతదేశ ఆత్మపై జరిగిన దాడి అని టిడిపి ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. పహల్గామ్ దాడి జమ్మూ కాశ్మీర్ ఆర్థిక వ్యవస్థను పూర్తిగా మార్చివేసిందని అన్నారు. "ఆపరేషన్ సిందూర్ కేవలం ప్రతీకారం మాత్రమే కాదు. అది మిగతా 7లో

శ్రీనగర్‌లో 'ఆపరేషన్ మహాదేవ్'

- ముగ్గురు ఉగ్రవాదులు హతం
- పహల్గాం దాడిలో పాల్గొన్నట్లు అనుమానం

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్‌లోని శ్రీనగర్ శివారు ప్రాంతంలో సోమవారం నిర్వహించిన 'ఆపరేషన్ మహాదేవ్'లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. వారు ఏప్రిల్ 22న పహల్గాం దాడిలో పాల్గొన్నవారిగా అనుమానిస్తున్నారు. 'ఈ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది. ఇప్పటి వరకూ ముగ్గురు ఉగ్రవాదుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నాం. ప్రస్తుతానికి ఎలాంటి వివరాలను వెల్లడించాలనుకోవడం లేదు. వారి గుర్తింపునకు సమయం పడుతుంది' అని కాశ్మీర్ జోన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజిపి) విధి కుమార్ బిర్డి తెలిపారు. శ్రీనగర్ శివారు ప్రాంతమైన దాచిగామ్ అటవీ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ ఎన్‌కౌంటర్ ప్రారంభమైనట్లు భారత సైన్యం తెలిపింది. సంఘటనా స్థలం నుంచి మృతదేహాలతో పాటు అమెరికాలో తయారైన కార్బైన్, ఒక ఎకె 47, 17 రైఫిల్ గ్రెనేడ్లు, ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అడవుల్లో ఉగ్రవాదులు ఆహారం తయారు చేసుకోవడం కోసం ఏర్పాటు చేసుకున్న రహస్య స్థావరాన్ని గుర్తించి, తినుబండారాలను, వంట పాత్రలను స్వాధీనం చేసుకున్నారు. దాచిగామ్ అటవీ ప్రాంతం నుంచి ఒక మార్గం దక్షిణ కాశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో పహల్గాం వైపు విస్తరించిఉంది. మరొక మార్గం గండేర్‌బల్ జిల్లాను కలుపుతుంది.

లూలూకు భూములు కట్టబెట్టే జిఓ 137ను రద్దు చేయాలి

- సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖలో 13.83 ఎకరాల ప్రభుత్వ భూములు, విజయవాడలో 4.15 ఎకరాల ఆర్‌టిసి భూములను బహుళజాతి సంస్థ లులూకి కట్టబెడుతూ ఇచ్చిన జిఓ 137ను తక్షణమే రద్దు చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లులూను ప్రోత్సహించడం అంటే వేలాది మంది చిన్న వ్యాపారులను, లక్షలాది మంది ఉపాధిని దెబ్బతీయడమేనని తెలిపారు. ఆర్‌టిసి, ప్రభుత్వ రంగ ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వమే వాటిని నాశనం చేయడం తగదని పేర్కొన్నారు. ఆర్‌టిసికి చెందిన విలువైన భూములను విజయవాడలోనూ, అలాగే విశాఖలోని ప్రభుత్వ భూములను లులూ మాల్‌కు కేటాయించడం సరికాదని తెలిపారు. నామమాత్రపు లీజుతో 99 సంవత్సరాల పాటు లీజుకు ఇవ్వడం అంటే ఆ విలువైన భూములన ఆయా సంస్థలకు ఉచితంగా కట్టబెట్టడమేనని పేర్కొన్నారు. రిటైల్ వర్తక రంగంలోకి మిగతా 7లో



మిగులు భూముల్లో జెండాలు పాతుతున్న పేదలు, సిపిఎం నేతలు

ఎర్రకాల్వ మిగులు భూములను పేదలకు కేటాయించాలి

- ఏక్‌సాల్ పట్టాలివ్వాలి : వి శ్రీనివాసరావు
- దుక్కి దున్ని, నాట్లు వేసిన పేదలు, సిపిఎం బృందం

ప్రజాశక్తి- జంగారెడ్డిగూడెం

ఏలూరు జిల్లా టి.నర్సాపురం, జంగారెడ్డిగూడెం మండలాల్లోని ఎర్రకాల్వ జలాశయ మిగులు భూములను పేదలకు సాగు కోసం కేటాయించి వారికి ఏక్‌సాల్ పట్టాలు ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరం, టి.నర్సాపురం మండలం పరిధిలోని ఎర్రకాల్వ జలాశయ మిగులు భూముల్లో సోమవారం ఆయన పర్యటించారు. తొలుత ఎ.పోలవరం బైపాస్ నుంచి వందలాది మంది కార్యకర్తలు మోటార్ సైకిళ్లపై ర్యాలీగా ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం పేద సాగుదారులతో కలిసి ర్యాలీగా మిగులు భూముల్లోకి సిపిఎం రాష్ట్ర బృందం వెళ్లింది. అక్కడ తొలుత ముదిగొండ అమరవీరులకు నివాళులర్పించింది. ఆ తర్వాత మిగులు భూముల్లో సిపిఎం జెండాలను పాతి, నాగలితో దుక్కు దున్ని, నాట్లు వేసి సాగు ప్రారంభించారు. సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం, టి.నర్సాపురం మండలాల్లోని ఎర్ర కాలువ జలాశయ మిగులు భూములు వెయ్యి ఎకరాలను సాగు చేసుకుంటున్న పేదలకు ప్రభుత్వం వెంటనే ఏక్‌సాల్ పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. 2,018 నుంచి భూస్వాములను ఎదురొడ్డి ఈ భూముల్లో సుమారు 500 మంది పేదలు సాగు చేస్తూ ధైర్యంగా నిలబ డడం అభినందనీయమన్నారు. పేదలపై భూస్వాములు అక్రమ కేసులు బనాయించి వారిని కోర్టుల చుట్టూ తిప్పుతూ వేధిస్తున్నా అధికారులు పట్టించుకోవట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎర్రకాల్వ ప్రాజెక్టుకు భూములిచ్చిన భూస్వాములకు నష్టపరిహారం ఇచ్చినప్పటికీ, ఆ భూములను వారు తమ ఆధీనంలో ఉంచుకుని సాగు చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. చట్టాన్ని కాపాడాల్సిన అధికారులే భూస్వాములకు తొత్తులుగా వ్యవహరిస్తుండడం సరికాదన్నారు. అధికారులు, ప్రభుత్వం మొద్దునిద్ర వీడి పేదలకు న్యాయం చేయాలని కోరారు. పేదలపై భూస్వాములు పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, ఈ భూముల్లో భూస్వాములు సాగు చేయడాన్ని ఆపాలని, సాగు చేస్తోన్న పేదలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను టిడిపి కూటమి ప్రభుత్వం తక్షణం నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

మత విద్వేషాలు రెచ్చగొడుతున్న పవన్ కల్యాణ్


సనాతన ధర్మం పేరుతో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్రంలో మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారని వి.శ్రీనివాసరావు అన్నారు. సనాతన ధర్మం అంటే అగ్రవర్ణాలు పేదలను అణచివేసే ఒక తంత్రమని వివరించారు. భారతదేశం అంటే అన్ని కులాలు, అన్ని మతాలు గౌరవించే ఒక దేశమని తెలిపారు. పవన్ కల్యాణ్ ఇలానే మత విద్వేషాలు రెచ్చగొడితే వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని మిగతా 7లో

భవిష్యత్ నగరంగా అమరావతి

- సింగపూర్, ఎపి మధ్య సహకారం కొనసాగాలి
- రెండో రోజు పర్యటనలో చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కొత్త ఆలోచనలు, ఆధునిక వసతులతో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని భవిష్యత్ నగరంగా తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సింగపూర్‌లో రెండో రోజుల పర్యటనలో భాగంగా పదివేల కుటుంబాలు ఉండే బిడదారి ఎస్టేట్‌ను సిఎం బృందం పరిశీలిం చింది. అక్కడి అధికారులు ప్రాజెక్టు వివరాలను బృందానికి వివరించారు. ఈ సందర్భంగా అమరావతి నిర్మాణ ఆలోచనలను చంద్రబాబు వారితో పంచుకున్నారు. అమరావతి కోసం సింగపూర్ ప్రభుత్వం ఇప్పటికే ప్లాను ఇచ్చిందని, రాజధాని నిర్మాణంలో ప్రపంచ బ్యాంకు కూడా భాగస్వామి అవుతోందని చెప్పారు. గతంలో జరిగిన కొన్ని ఘటనల వల్ల కొంత ఆలస్య మైందని, తప్పులను సరిదద్దడంతోపాటు పరస్పర సహకారం కోసం సింగపూర్ వచ్చినట్లు వివరిం చారు. బిడదారి ఎస్టేట్ ప్రాధాన్యతలను పరిశీలించిన అనంతరం సింగపూర్ హౌసింగ్ డెవలప్‌మెంట్, అర్బన్ రీడెవలప్‌మెంట్ అథారిటీ, సింగపూర్ కార్పొరేషన్ ఎంటర్‌ప్రైజ్ సహా ప్రపంచ బ్యాంకు అధికారులతో సిఎం సమావేశం అయ్యారు. ఎపిలో చేపట్టనున్న అర్బర్ హౌసింగ్ ప్రాజెక్టుల్లో సింగపూర్ సహకారంపై చర్చించారు. అమరావతిలో నిర్మించే హౌసింగ్ ప్రాజెక్టులో భాగస్వాములు కావాలని వారిని కోరారు.



సింగపూర్ మానవశక్తి, వాణిజ్య, పరిశ్రమల మంత్రి టాన్ సీ లెంగ్‌కు జ్ఞాపికను అందిస్తున్న సిఎం చంద్రబాబు

పోర్టుల అభివృద్ధి కోసం...

ఆసియాలో అతిపెద్ద కంటైనర్ టెర్మినల్ పోర్టుగా నిర్మిస్తున్న టువాస్‌ను సిఎం బృందం పరిశీలించింది. అక్కడ పోర్ట్ ఆఫ్ సింగపూర్ అథారిటీ సిఇఓ విన్సెంట్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. ఏఐ సాంకేతికత అమలు గురించి వివరాలు తెలుసు కున్నారు. రూ.1.70 లక్షల కోట్లతో పోర్టు నిర్మాణం చేపడుతున్నట్లు సిఇఓ రాష్ట్ర బృందానికి తెలిపారు. ప్రతి 50 కిలోమీటర్లకు ఒక పోర్టు నిర్మించాలని ఆలోచన చేస్తున్న ప్రభుత్వం సింగపూర్ మోడల్‌ను అనుసరించే అంశాన్ని కూడా పరిశీలించారు. ఈ బృందంలో సిఎంతోపాటు నారా లోకేష్, టిజి. భరత్, ఉన్నతాధికారులు ఉన్నారు. ప్రముఖ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్ తదితరులతో కలిసి సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్‌ను సిఎం పరిశీలించారు. స్కూల్ ప్రిన్సిపల్ ఓంగ్ కిమ్ సూన్‌తో మాట్లాడారు. కడప, విజయవాడ, విజయనగరంలో క్రీడా పాఠశాలను సింగపూర్ స్పోర్ట్స్ స్కూల్ తరహాలో ఏర్పాటు చేయాలని ఆలోచన చేస్తున్నట్లు వివరించారు.

గ్రీన్ ఎనర్జీ, డేటా సెంటర్లకు సహకరించాలి

గ్రీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్రం భారీ ప్రాజెక్టులు చేపట్టిందని, వీటికి సింగపూర్ నుండి మరింత సహకారాన్ని ఆశిస్తున్నామని సిఎం చంద్రబాబు అన్నారు. సింగపూర్ వాణిజ్య పరిశ్రమలశాఖ మంత్రి టాన్ సీ లాంగ్‌తో జరిగిన భేటీలో సిఎం మాట్లా డుతూ గ్రీన్ హైడ్రోజన్, ట్రాన్స్‌మిషన్, కారిడార్లు, పోర్టుల్లో సింగపూర్ కంపెనీలు భాగస్వామ్యం కావాలని కోరారు. మానవ వనరులు, సైన్స్ అండ్ టెక్నాలజీలోనూ భాగస్వామ్యం అవసరమన్నారు. నవంబరులో జరిగే భాగస్వామ్య సదస్సుకు రావాలని టాన్ సీలాంగ్‌ను ఆహ్వానించారు. గృహ నిర్మాణం, సబ్‌సీ కేబుల్ రంగంలో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగా ఉన్నామని, కలిసి పనిచేస్తామని సింగపూర్ మంత్రి సిఎంకు తెలిపారు.

స్థానిక అభ్యర్థులుగా పరిగణించండి

- ఎన్‌టిఆర్ హెల్త్ వర్సిటీకి హైకోర్టు మధ్యంతర ఆదేశాలు

ప్రజాశక్తి-అమరావతి

మెడికల్ సీట్ల భర్తీకి నిర్వహించే కౌన్సెలింగ్‌లో తమను స్థానికులుగా పరిగణించాలంటూ నీట్ పరీక్ష రాసిన పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. రాష్ట్రంలో పదో తరగతి వరకు చదివి, ఇంటర్ ఇతర రాష్ట్రాల్లో చదువుకున్న విద్యార్థులను స్థానికులుగా పరిగణించాలంటూ దాఖలైన పిటి షన్‌లపై హైకోర్టు సోమవారం విచారణ చేపట్టింది. నీట్ పరీక్ష రాసేనాటికి విద్యార్థులు వరుసగా నాలుగేళ్లు రాష్ట్రంలో చదివి ఉండాలనే నిబంధన వల్ల తీరని అన్యాయం జరుగుతోందని పిటిషన్లు పేర్కొన్నారు. ఈ మేరకు మెడికల్ కౌన్సెలింగ్‌లో తమను రాష్ట్ర స్థానికులుగా పరిగణిం చాలన్న వారి వినతిని ఆమోదించింది. పిటిషనర్లను రాష్ట్రంలో స్థానిక (లోకల్) అభ్యర్థు లుగా పరిగణిం చాలని డాక్టర్ ఎన్‌టిఆర్ ఆరోగ్య, విజ్ఞాన విశ్వ విద్యాలం రిజిస్ట్రార్‌ను ఆదేశించింది. సమగ్ర వివరాల తో కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం సోమవారం మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. అడ్మిషన్లు తుది తీర్పుకు లోబడి ఉంటాయని షరతు విధించింది.

గిన్నిస్ బుక్‌కు మెగా పిటిఎం

- ఉపాధ్యాయులకు అంకితమిచ్చిన మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నిర్వహించిన అతిపెద్ద పేరెంట్-టీచర్-మీటింగ్(మెగా పిటిఎం) గిన్నిస్ బుక్‌లోకి ఎక్కింది. ఈ మేరకు అధికారికంగా సమాచారం అందింది. మెగా పిటిఎంలో 5.34 మిలియన్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్న సంగతి తెలిసిందే. విద్యార్థులు, పూర్వవిద్యార్థులు, పాఠశాల యాజమాన్యం, పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్‌ఎంసి) సభ్యులు ప్రత్యక్షంగా పరోక్షంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ రికార్డును ఉపాధ్యాయులకు అంకితం చేస్తున్నట్లు సింగపూర్ పర్యటనలో ఉన్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ విద్యావిధానం . ప్రభుత్వ పాఠశాలల్లో ప్రపంచ స్థాయి ప్రమాణాలను తీసుకురావడానికి ప్రభుత్వం చేస్తున్న కృషికి ఈ రికార్డు గొప్ప ప్రోత్సాహంగా నిలిచిందని తెలిపారు.

అధిక సంఖ్యలో ఓటర్ల నమోదే లక్ష్యం

- ఎస్‌ఐఆర్‌పై ఇసికి స్పష్టం చేసిన సుప్రీం కోర్టు
- ఈ భూమ్మీద ఏ డాక్యుమెంట్ ఫోర్జరీకైనా అవకాశం ఉందని వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : బీహార్‌లో అమలు జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్)లో గుర్తింపు కార్డులుగా ఆధార్, ఓటర్ కార్డులను ఆమోదించాలని సుప్రీం కోర్టు సోమవారం మరోసారి ఎన్నికల కమిషన్‌కు స్పష్టం చేసింది. ఎన్నికలు జరగనున్న బీహార్‌లో చేపట్టిన ఈ ప్రక్రియ, పెద్ద సంఖ్యలో ఓటర్లను చేర్చుకునేలా వుండాలి కానీ పెద్ద ఎత్తున ఓటర్లను తొలగించేలా వుండకూడదని కోర్టు తేల్చి చెప్పింది. ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించడానికి ఇంకా మూడు రోజులు మాత్రమే గడువు ఉండడంతో కోర్టు సూచనలను ఇసి ప్రతిఘటిస్తోంది. ఆధార్, ఓటర్, రేషన్ కార్డులను సులభంగా ఫోర్జరీ చేయవచ్చని వాదిస్తోంది. దీనిపై సుప్రీం తీవ్రంగా స్పందిస్తూ, ఈ భూమ్మీద ఏ డాక్యుమెంట్‌నైనా ఫోర్జరీ చేయవచ్చని వ్యాఖ్యానించింది. వంద ఓటర్ల కార్డుల్లో బహుశా ఏ ఒక్కటో నిజమైన కార్డు కాకపోవచ్చని పేర్కొంది.



అటువంటి విషయాలను ఏ కేసుకు ఆ కేసుగానే చూడాలి తప్ప అన్నింటికీ వర్తించలేమని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్యా బగ్చిలతో కూడిన బెంచ్ వ్యాఖ్యానించింది. ఆధార్, ఓటర్ కార్డులు సరైనవేననే భావన వుందని జస్టిస్ కాంత్ అన్నారు. ఆధార్ వినియోగంలో వున్నప్పుడు దాన్ని ధ్రువీకరించేందుకు ఒక వ్యవస్థ వుందని అన్నారు. ఓటరు కార్డు అయితే ఎన్నికల కమిషనే ఇచ్చింది. కాబట్టి ఆధార్, ఓటర్ కార్డులను గుర్తింపు కార్డులుగా ఆమోదించవచ్చని అన్నారు. గుర్తింపు కార్డులుగా సూచించిన 11 డాక్యుమెంట్ల జాబితాలో ఏవీ కూడా నిర్ణయాత్మకమైన స్వభావం కలిగినవి కావని, అది నివాస పత్రం కావచ్చు లేదా కుల ధ్రువీకరణ పత్రం కావచ్చని జస్టిస్ బగ్చి పేర్కొన్నారు. 'మీ అభిప్రాయం ప్రకారం, ఆ 11 డాక్యుమెంట్లలో ఏవీ కూడా కచ్చితమైనవి, నిర్ణయాత్మకమైనవి కానపుడు, అవి కేవలం జన గణన ఫారమ్‌లతో పాటూ జత పరిచిన పత్రాలు అనుకున్నపుడు ఎవరైనా ఆధార్‌ను గుర్తింపు కార్డుగా ఇస్తే, వారిని ఓటర్ల జాబితాలో ఎందుకు చేర్చరు?" అని జస్టిస్ బగ్చి ప్రశ్నించారు.

ఈ కేసులో తుది వాదనలు వినడానికి సక్రమ షెడ్యూల్‌ను, ముందస్తు తేదీని 29వ తేదిన ప్రకటిస్తామని కోర్టు పేర్కొంది. ఆగస్టు 1 ముసాయిదా ప్రచురణకు గడువు దగ్గర పడుతోందని ఇసి తరపు న్యాయవాది గోపాల్ శంకర్‌నారాయణన్ ప్రస్తావించారు. అది కేవలం ముసాయిదా మాత్రమేనని, ప్రచురణలపై స్టే ఇవ్వాలని కానీ ఎస్‌ఐఆర్ ప్రక్రియను స్తంభింపచేయాలని కానీ పిటిషనర్లు కోరలేదని జస్టిస్ కాంత్ వ్యాఖ్యానించారు. ముసాయిదా ప్రచురితమైనంత మాత్రాన ఇసి నిర్ణయాన్ని సవరించేందుకు కోర్టుకు గల అధికారాలు తగ్గిపోవని న్యాయమూర్తి పిటిషనర్లకు హామీ ఇచ్చారు. పౌరసత్వపు హోదాను పరిశీలించేందుకే ఇసి ఎస్‌ఐఆర్ చేపట్టిందని మానవ, సామాజిక హక్కుల కార్యకర్తల నుండి రాజకీయ పార్టీల వరకు అనేకమంది తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో ఆ మూడు డాక్యుమెంట్లను గుర్తింపు కార్డులుగా అంగీకరించాల్సిందిగా ఈ నెల 10న సుప్రీం కోర్టు, ఎన్నికల కమిషన్‌ను కోరింది.

ప్రజలు అంగీకరించకపోతే స్మార్ట్ మీటర్లు బిగించొద్దు

- మంత్రి గొట్టిపాటి రవికుమార్
- వ్యవసాయ మోటార్లకూ ఉండవు

అభివృద్ధి పేరుతో భూ సంతర్పణం

- వడ్డే శోభనాద్రీశ్వరరావు, మహదేవ్

2

పారిశుధ్య కార్మికులపై లాఠీఛార్జి

- పలువురికి గాయాలు
- అరెస్టులు, సిఐ తీరుతో ఉద్రిక్తత
- పోలీస్ స్టేషన్ ముందు పెద్ద ఎత్తున ఆందోళన



మున్సిపల్ కార్మికులపై లాఠీఛార్జి చేస్తున్న సిఐ

ప్రజాశక్తి- నెల్లూరు

నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులపై పోలీసులు లాఠీలు ఝుళిపించారు. దీంతో, పలువురికి గాయాలయ్యాయి. అరెస్టులు, సిఐ తీరుతో ఉద్రిక్తత నెలకొంది. పారిశుధ్య పనులను ప్రయివేటు కాంట్రాక్టర్లకు అప్పగించి తమ పొట్టకొట్టొద్దంటూ 14 రోజుల నుంచి ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తున్నారు. అయినా, అధికారులు పట్టించుకోకపోగా సోమవారం పోటీ కార్మికులను దించారు. నిప్పో, అయ్యప్ప గుడి సెంటర్లో వారితో పనిచేయిస్తుండగా మున్సిపల్ కార్మికులు అక్కడికి చేరుకున్నారు. పోటీ కార్మికులను దించి మా పొట్టగొట్టాలని చూడడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. 40 సంవత్సరాలకుపైగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానంలో తాము పని చేస్తున్నామన్నారు. మనమందరమూ పేదలమేనని, దళితులమని, మా పరిస్థితిని అర్థం చేసుకోవాలని పోటీ కార్మికులకు నచ్చజెప్పారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా వేదాయపాలెం సెంటర్‌కు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు అక్కడికి చేసుకొని మున్సిపల్ కార్మికుల పట్ల దురుసుగా వ్యవహరించారు. పత్రికల్లో రాయలేనటువంటి మాటలు మాట్లాడారు. అక్కడే ఉన్న యూనియన్ రూరల్ అధ్యక్షులు దేశమూర్తి దీనిపై పోలీసులను ప్రశ్నించారు. దీంతో, పోలీసులు రెచ్చిపోయారు. ఆయనతోపాటు కొంతమంది పారిశుధ్య కార్మికులను అరెస్టు చేసి వాహనం ఎక్కించడంతో మహిళా కార్మికులు అడ్డుకున్నారు. వారిని సైతం పోలీసులు వేదాయపాలెం స్టేషన్‌కు తరలించారు. అరెస్టును నిరసిస్తూ పెద్ద ఎత్తున మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, నాయకులు పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఆందోళనకు దిగారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని నినాదాలు చేశారు. సిఐటియు రూరల్ అధ్యక్షులు కొండప్రసాద్ పారిశుధ్య కార్మికుల సమస్యలను సిఐ శ్రీనివాసరావు దృష్టికి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. అయినా, సిఐ పట్టించుకోకుండా 'ముందు వీరిని పోలీస్ స్టేషన్లో పడేయండి' అంటూ పోలీసులను ఆదేశించారు. దీంతో, సిఐటియు నాయకుడిపై పాటు మరికొంతమందినీ పోలీసులు స్టేషన్‌లోకి లాక్కెల్లారు. పోలీసుల చర్యను నిరసిస్తూ స్టేషన్ ఎదుట పారిశుధ్య కార్మికులు బైఠాయించి నినాదాలు చేశారు. ఆగ్రహించిన సిఐ శ్రీనివాసరావు నేరుగా రంగంలోకి దిగి వారిపై లాఠీఛార్జి చేశారు. దీంతో, 20 మందికి గాయాలయ్యాయి. ఈ విషయం తెలిసి పోలీసు స్టేషన్ వద్దకు భారీ మున్సిపల్ కార్మికులు చేరుకున్నారు. తమ తోటి కార్మికులను రక్తం కారేలా కొట్టడం, అరెస్టు చేయడంపై నిలదీశారు. అక్కడి నుంచి వెంటనే వెళ్లకపోతే జిల్లాలోని పోలీసు యంత్రాంగాన్ని మొత్తం ఇక్కడకు తీసుకొస్తానంటూ వారిని సిఐ హెచ్చరించారు. అయినా, కార్మికులు భయపడకుండా ఆందోళన కొనసాగించారు. అక్కడికి సిపిఎం నాయకులు చేసుకొని పోలీసు అధికారులతోనూ, సిఐతోనూ మాట్లాడారు. దీంతో, కార్మికులను సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

పోలీసుల తీరు గర్హనీయం

మున్సిపల్ పారిశుధ్య కార్మికులందరూ దళితులు, గిరిజనులని, అటువంటి వారిపై ఇంత అమానుషంగా ప్రవర్తించడం దుర్మార్గమని సిపిఎం, సిఐటియు నాయకులు అన్నారు. మీడియాతో వారు మాట్లాడుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న వారిపై లాఠీఛార్జి చేయడం, గాయపర్చడం గర్హనీయమని తెలిపారు. సమస్యలను పరిష్కరించకపోగా పారిశుధ్య కార్మికులను నిర్బంధించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు, యూనియన్ జిల్లా కార్యదర్శి కె.పెంచల నరసయ్య, సిఐటియు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు సిఐటియు నాయకులు పి. సూర్యనారాయణ, కె.సతీష్, నాగేశ్వర్‌రెడ్డి, కోటేశ్వరరావు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

అమానుషం : సిపిఎం

మున్సిపల్ కార్మికుల పట్ల పోలీసుల అమానుషత్వాన్ని సిపిఎం జిల్లా కమిటీ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించింది.

లాఠీఛార్జి చేయడం, గాయపర్చడం, అరెస్టు చేయడం, మహిళా కార్మికుల పట్ల కూడా దురుసుగా వ్యవహరించడం దుర్మార్గమని జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ప్రజలు అంగీకరించకపోతే
స్మార్ట్ మీటర్లు బిగించొద్దు

- మంత్రి గొట్టిపాటి రవికుమార్
- వ్యవసాయ మోటార్లకూ ఉండవు
- పారిశ్రామిక, వ్యాపార అవసరాలకే వినియోగం

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

ప్రజల అంగీకారం లేకుండా స్మార్ట్ మీటర్లు బిగించొద్దని అధికారులకు ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఇపిడిసిఎల్ పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులతో సోమవారం విశాఖపట్నంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్లను ముందుగా విద్యుత్‌శాఖ అధికారులు, రాజకీయ నాయకుల ఇళ్లకు బిగించి వాళ్లను రోల్ మోడల్‌గా చూపించిన తరువాత స్మార్ట్ మీటర్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పారిశ్రామిక, వ్యాపార వర్గాలు, సంబంధిత అవసరాలకు మాత్రమే ప్రస్తుతం స్మార్ట్ మీటర్లను వినియోగించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు బిగించేది లేదని మరోసారి స్పష్టం చేశారు. ప్రజలపై ఎటువంటి భారం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయం సరఫరా చేయాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. పిఎం సూర్యఘర్ పై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతి నియోజకవర్గంలోనూ 10,000 సోలార్ విద్యుత్ కనెక్షన్లు అందించాలన్న లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఆర్‌డిఎస్‌ఎస్ పనులను వేగవంతం చేయాలని, ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో లో ఓల్టేజ్ సమస్యను పరిష్కరించాలని సిఎండి పృధ్వీతేజను ఆదేశించారు. ఇపిడిసిఎల్ పరిధిలోని 11 జిల్లాల్లోనూ వ్యవసాయానికి నిరంతరాయంగా తొమ్మిది గంటల విద్యుత్‌ను అందిస్తున్నట్లు మంత్రికి అధికారులు వివరించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ సిజిఎంలు, ఎస్‌ఇలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరుతో భూ సంతర్పణం

- వడ్డే శోభనాద్రీశ్వరరావు, మహదేవ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, ఉపాధి పేరుతో భూ సంతర్పణం చేస్తోందని, పేద ప్రజలకు చెందిన భూములను కార్పొరేట్లకు కట్టబెడుతూ అభివృద్ధి మంత్రాన్ని జపిస్తున్నారని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు వైవిఎస్ మహదేవ్ తెలిపారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. అభివృద్ధి చేయాలన్నా, ఉపాధి కల్పించాలన్నా భూములు కేటాయించడమే మార్గమన్నట్లు ప్రస్తుత ప్రభుత్వం వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. ఇప్పటి వరకూ తీసుకున్న భూములకు దిక్కులేదని, వాటిని పొందిన కార్పొరేట్లు మాత్రం బ్యాంకుల్లో కుదవ పెట్టుకుని కోట్లు సంపాదిస్తున్నారని అన్నారు. లక్షలాది ఎకరాలు ప్రభుత్వం వద్ద ఉందని, పనికిరాని భూమి లక్షల ఎకరాల్లో ఉందని, వాటిని కాదని కోట్ల విలువైన భూములనే కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని అన్నారు. విజయవాడ నగరంలో రూ.400 కోట్ల విలువైన భూమిని లూలూకు కేటాయించారని, విశాఖపట్నంలోనూ ఇచ్చారని విమర్శించారు. విశాఖలో భూమి కోస్టర్ రెగ్యులేటరీ జోన్ పరిధిలోకి వస్తుందని, అయినా అక్కడే భూమి కేటాయించడం ఏమిటని ప్రశ్నించారు. అమరావతిలో భూమి ఎస్‌ఆర్‌ఎంకు 100 ఎకరాలు, విట్‌కు 200 ఎకరాలు ఎకరం రూ.50 లక్షలకు ఇచ్చారని, వాటిల్లో స్థానిక రైతుల పిల్లలకు ఫీజులో మినహాయింపు కూడా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వ సంస్థలకు ఎకరం రూ.4 కోట్లకు కేటాయించి, ప్రైవేటు సంస్థలకు రూ.10 లక్షలకు ఇస్తున్నారని, దీనివెనుక అక్రమాలు జరుగుతున్నాయనే అనుమానాలు ఉన్నాయని విమర్శించారు. ఇది చాలదన్నట్లు అదనంగా భూములు సమీకరిస్తామనే ప్రకటనలు చేస్తున్నారని, ఇంతకంటే అన్యాయం మరొకటి లేదని పేర్కొన్నారు. కరేడులో విలువైన పంటలు పండే భూములను ఇండోసోల్ కంపెనీకి ఇస్తున్నారని, ప్రకాశం జిల్లా పరిధిలో పనికిరాని భూములు ఉన్నాయని, వాటిని కేటాయించకుండా విలువైన పంటలు పండే భూములు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. నిమ్జ్‌కు ఇచ్చిన భూములు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఉపాధి కల్పన పేరుతో భూములు ఇవ్వడం వల్ల భవిష్యత్‌లో వ్యవసాయం దెబ్బతింటుందని వారు పేర్కొన్నారు. సాగును కాపాడాల్సిన ప్రభుత్వం విలువైన భూములను దెబ్బతీయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

గవర్నరును కలిసిన జగన్ దంపతులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొంది ఇంటికి వచ్చిన గవర్నరు అబ్దుల్ నజీర్‌ను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దంపతులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మర్యాదపూర్వ కలయికేనని, దీంతో ఇతర అంశాలేవీ లేవని వైసిపి కార్యాలయ వర్గాలు తెలిపాయి.

తూమకుంట ఎస్‌బిఐలో భారీ చోరీ

- గ్యాస్ కట్టర్‌తో స్ట్రాంగ్ రూమ్, సేఫ్టీ లాకర్లను తెరిచిన దొంగలు

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం సమీపంలోని తూమకుంట పారిశ్రామిక వాడలోని ఎస్‌బిఐ బ్యాంకులో ఆదివారం రాత్రి భారీ చోరీ జరిగింది. ఇందుకు సంబంధించి పోలీసులు, బ్యాంకు సిబ్బంది తెలిపిన వివరాల మేరకు... హిందూపురం పారిశ్రామిక వాడలో ఎస్‌బిఐ బ్యాంకు ఉంది. బ్యాంకు వెనుక ఉన్న పెద్ద కిటికీ గ్రిల్స్‌ను దుండగులు గ్యాస్ కట్టర్ సాయంతో తొలగించి లోపలికి వెళ్లారు. అనంతరం బ్యాంకుల్లో ఉన్న సిసి కెమెరాల వైర్లను కత్తిరించారు. స్ట్రాంగ్ రూమ్‌లోకి చొరబడి లాకర్లను గ్యాస్ కట్టర్‌తో తొలగించి, అందులో ఉన్న నగదుతో పాటు ఖాతాదారులు రుణం కోసం కుదువ పెట్టిన బంగారం పాకెట్లను దోచుకెళ్లారు. ఎన్ని లాకర్లు ఓపెన్ చేశారు.? నగదు ఎంత పోయింది.? బంగారం ఎంత ఎత్తుకెళ్లారు.? అన్న వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. సోమవారం ఉదయం బ్యాంకులో దొంగతనం జరిగిన విషయాన్ని సిబ్బంది గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. డిఎస్‌పి మహేష్, సిఐ అబ్దుల్ కరీంలు సిబ్బంది బ్యాంకు వద్దకు చేరుకున్నారు. సిసి ఫుటేజ్‌లను పరిశీలించారు. క్లూస్ టీంతో తనిఖీ చేశారు. పూర్తి స్థాయి తనిఖీల అనంతరం వివరాలను వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

అర్హత ఉన్న కౌలుదారులకూ 'అన్నదాతా సుఖీభవ'

- వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఖరీఫ్ సీజన్‌లో పంట నమోదు చేసుకున్న అనంతరం అర్హతా ప్రమాణాలు ఆధారంగా కౌలు రైతులకు అన్నదాతా సుఖీభవ పథకం అమలు చేయనున్నట్లు వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. కౌలు రైతులకు మొదటి విడత లబ్ధి రూ.10 వేలు అక్టోబరులో అందజేయనున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఇప్పటి వరకూ 5.90 లక్షల కౌలు గుర్తింపు కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. భూమిలేని కౌలు రైతులందరూ ఈ పథకం కింద లబ్ధిపొందడానికి ముందుగా కౌలు గుర్తింపు కార్డును పొంది ఇ-క్రాప్‌లో వారి వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉందన్నారు. పథకం మార్గదర్శకాల ప్రకారం కౌలు రైతులకు లబ్ధి రెండో విడతలో ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు విద్యేతర కార్యక్రమాలు అప్పగించొద్దు

- విద్యాశాఖ ఆదేశాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాల విద్యాశాఖకు సంబంధం లేని కార్యక్రమాలను ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అప్పగించొద్దని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, కెజిబివి, మోడల్, రెసిడెన్షియల్, జిల్లా, మండల, మున్సిపల్ పాఠశాలల్లోని సిబ్బందిని ఉపయోగించొద్దని జిల్లా కలెక్టర్లకు సోమవారం కార్యదర్శి కోన శశిధర్ మెమో జారీ చేశారు.

పాఠశాల విద్యాశాఖ హెచ్‌ఒడి అనుమతి లేకుండా విద్యేతర కార్యక్రమాలను అప్పగించొద్దన్నారు. విద్యా వ్యవస్థకు ఉపయోగపడేలా ఈ ఉత్తర్వులు జారీ చేశారని ఎపిటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి హృదయరాజు, ఎస్ చిరంజీవి తెలిపారు. అనవసరమైన యాప్‌లను కూడా తొలగించేందుకు ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు.

జిఒ 137 కాపీలు దహనం

- విజయవాడలో సిపిఎం శ్రేణులు, పోలీసుల మధ్య తోపులాట



జిఒ కాపీల దహనాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - విజయవాడ : విలువైన ఆర్‌టిసి స్థలాన్ని లూలూ కంపెనీకి ధారాదత్తం చేస్తూ విడుదల చేసిన 137 జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం విజయవాడలో సిపిఎం చేపట్టిన నిరసన కార్యక్రమం పోలీసుల అత్యుత్సాహంతో ఉద్రిక్తతకు దారితీసింది. 137 జిఒను రద్దు చేయాలని, చిరు వ్యాపారుల పొట్టకొట్టొద్దని, లూలూకు ఆర్‌టిసి స్థలాన్ని ఇవ్వొద్దని చేసిన నినాదాలు హోరెత్తాయి. జిఒ కాపీలను దహనం చేసేందుకు సిద్ధమవ్వగా గవర్నర్‌పేట సిఐ అడపా నాగమురళీ తన సిబ్బందితో అడ్డుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. ఈ సమయంలో సిపిఎం శ్రేణులకు, పోలీసులకు మధ్య కొద్దిసేపు తోపులాటలు జరిగాయి. సిఐ ప్రయత్నాలను వమ్ముచేసి నాయకులు, శ్రేణులు వలయాకారంగా నిలబడి జిఒ కాపీలను దహనం చేశారు.

జిఒ రద్దు చేయకపోతే ఉద్యమం ఉధృతం : బాబూరావు

ధర్నాలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ.. లూలూ మాల్‌కు విజయవాడ పాత బస్టాండ్ ఆర్‌టిసి స్థలాన్ని, గవర్నరుపేట, విద్యాధరపురం డిపోల స్థలాలను కట్టబెడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జిఒను రద్దు చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నగరం నడిబొడ్డున ఉన్న నాలుగున్నర ఎకరాల విస్తీర్ణం కలిగిన సుమారు రూ.400 కోట్ల విలువైన పాత బస్టాండ్ స్థలాన్ని, విశాఖలో 13 ఎకరాలను.. ఇలా రూ. వందల కోట్ల విలువైన ప్రభుత్వ, ఆర్‌టిసి స్థలాలను బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి ఎవరు అధికార మిచ్చారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వాల్‌మార్ట్, డి మార్ట్ వంటి సంస్థలు చిన్న, మధ్య తరగతి వ్యాపారుల కడుపుకొట్టాయని, కార్పొరేట్ కంపెనీలకు ఊతమిస్తూ ఇప్పుడు లూలూకు ఎలా స్థలాలను కట్టబెడతారని ప్రశ్నించారు. కాల్వల ఒడ్డున పేదవాడు నివాసం ఉండేందుకు వీలులేదంటున్న ప్రభుత్వం... లూలూకు మాత్రం ఏలా కట్టబెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ.. రూ.వందల కోట్ల విలువైన ఆర్‌టిసి స్థలాలను లూలూకు కట్టబెడుతుంటే... స్వదేశీ జపం చేసే బిజెపికి ఇది కనిపించడం లేదా? అని ప్రశ్నించారు. ప్రశ్నించడం కోసమే పుట్టినట్లుగా మాట్లాడే ఉప ముఖ్యమంత్రి ఈ అంశంపై నోరు విప్పాలని డిమాండ్ చేశారు. ధర్నాకు పార్టీ సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు అధ్యక్షత వహించారు.

లూలూకు భూ కేటాయింపులు చట్టవిరుద్ధం

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఇఎఎస్.శర్మ లేఖ

ప్రజాశక్తి - విశాఖపట్నం

రాష్ట్ర ప్రభుత్వం విశాఖ బీచ్ రోడ్డు హార్బర్ పార్క్ దగ్గర అతి విలువైన 13.74 ఎకరాల భూమిని, విజయవాడ నడిబొడ్డులో ఎపిఎస్‌ఆర్‌టిసికి చెందిన విలువైన 4.15 ఎకరాల భూమిని విదేశీ ప్రయివేటు సంస్థ లూలూకు అతి తక్కువ ధరకు ఏకపక్షంగా ధారాదత్తం చేయడం చట్టవిరుద్ధమని కేంద్ర ప్రభుత్వ పూర్వ కార్యదర్శి ఇఎఎస్.శర్మ తెలిపారు. ఈ భూ కేటాయింపుల నిర్ణయాలు సుప్రీం కోర్టు ఆదేశాలను ధిక్కరించేవిగా, ప్రజల విశ్వాసానికి తూట్లు పొడిచేవిగా ఉన్నాయని పేర్కొన్నారు. వెంటనే ఈ కేటాయింపులపై సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌లతో కేంద్రం దర్యాప్తు చేయాలని కోరారు. పై రెండు నిర్ణయాలనూ వెనక్కు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు సోమవారం ఓ లేఖ రాశారు. విశాఖ బీచ్ రోడ్డులో లూలూకు భూములు కేటాయించొద్దని తాను గతంలో రాసిన లేఖలను గుర్తుచేశారు. లూలూ కంపెనీ పట్ల రాష్ట్ర నేతలకు, అధికారులకు ఉన్న ఆప్యాయత, వ్యామోహం రోజురోజుకూ పెరుగుతున్నాయనడానికి తాజా నిర్ణయాలే నిదర్శనమన్నారు. ఈ నెల 27న రాష్ట్ర పరిశ్రమల శాఖ జారీ చేసిన జిఒఎంఎస్ నెంబర్ 137ను పరిశీలిస్తే ప్రభుత్వం లూలూకు భూములను ఎలా ధారాదత్తం చేసిందో ఇట్టే అర్థమవుతోందని తెలిపారు. సివిల్ అప్పీల్ నెంబర్ 1132/2011 (జగపాల్ సింగ్ వర్సెస్ పంజాబ్ ప్రభుత్వం) కేసులో సుప్రీంకోర్టు 2011 జనవరి 28న ఇచ్చిన ఆదేశాలను శర్మ గుర్తుచేశారు. దాని ప్రకారం.. స్థానిక సంస్థల ఆధీనంలో ప్రజా ప్రయోజనాలకు ఉద్దేశించబడిన ప్రభుత్వ భూములను ప్రైవేట్ కంపెనీలకు ఇవ్వకూడదని తెలిపారు. విశాఖ, విజయవాడల్లో తాజాగా భూములను లులూకు బదలాయించడం కోర్టు ఆదేశాలను ధిక్కరించినట్లు అయిందన్నారు. విశాఖలో లూలూకు కేటాయించిన భూమి సిఆర్‌జడ్ పరిధిలో ఉందని, ఆ ప్రదేశంలో కట్టడాలు, బోరు బావులు నిషేధించబడ్డాయని తెలిపారు. 2012లో రాష్ట్ర ప్రభుత్వ రెవెన్యూ విభాగం జారీ చేసిన జిఒఎంఎస్ నెంబర్ 571 ప్రకారం ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలకు యథేచ్ఛగా బదలాయించకూడదని తెలిపారు. ఒకవేళ ప్రజాప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వ భూమిని ప్రయివేట్ సంస్థకు కేటాయిస్తే ఆ సంస్థ నుంచి భూమి మార్కెట్ ధరపై కనీసం పది శాతం అద్దె విధించాలని ప్రభుత్వం ఆదేశించిన విషయాన్ని గుర్తుచేశారు. లూలూకు కేటాయింపుల విషయంలో ఆ విషయాన్నీ విస్మరించారని వివరించారు. విశాఖ, విజయవాడ భూములను ప్రభుత్వం లూలూకు ఇతర రాయితీలతో, అతి తక్కువ అద్దెకు లీజు మీద ఇస్తే సుప్రీంకోర్టు 2జి స్పెక్ట్రమ్, బొగ్గు కుంభకోణం కేసులలో ఇచ్చిన తీర్పుల ప్రకారం అటువంటి నిర్ణయం అవినీతితో కూడినదిగానే పరిగణించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆ నిర్ణయాల్లో భాగస్వాములైన అధికారులపై ప్రివెన్షన్ ఆఫ్ కరప్షన్ యాక్ట్ 1988 కింద ఆ తీర్పులకు అనుగుణంగా దర్యాప్తు చేయవలసిన అవసరముందని తెలిపారు. విశాఖ తీర ప్రాంతంలో దేశభద్రతకు సంబంధించిన కార్యక్రమాలు నిరంతరం జరుగుతాయని, ఆ నేపథ్యంలో ఒక విదేశీ కంపెనీకి ఆ ప్రాంతంలో అటువంటి భూమిని కేటాయించడం సబబు కాదని వివరించారు. భూ కేటాయింపులు వంటి నిర్ణయాలను ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకోవడం ప్రజాస్వామ్య విధానాలకు వ్యతిరేకమని వివరించారు. ఐదేళ్లకోసారి ఎన్నికలలో రాజకీయ పార్టీలు గెలిచినా ప్రజలకు చెందిన భూముల విషయంలో ప్రభుత్వం కేవలం ప్రజల తరపున ట్రస్టీగా మాత్రమే వ్యవహరించాలేగానీ జమిందారీ వ్యవస్థలోలాగ ఎవరికిబడితే వారికి యథేచ్ఛగా కట్టబెట్టడం ఎంతమాత్రమూ తగదన్నారు. తాను రాసిన ఈ లేఖ ప్రతులను కేంద్ర ప్రభుత్వానికి, సిబిఐకి, ఇడికి పంపినట్టు శర్మ తెలిపారు.

'కరేడు' గిరిజన మహిళలను విడుదల చేయాలి

- ఆదివాసీ, గిరిజన సంఘం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తప్పుడు కేసులు బనాయించి, అక్రమంగా అరెస్టు చేసిన గిరిజన మహిళలను తక్షణమే విడుదల చేయాలని, వారి భూములకు రక్షణ కల్పించాలని ఆదివాసీ, గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గిరిజన సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి ఎంఎం నాయక్‌కు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ అశోక్, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ.. నెల్లూరు జిల్లా కరేడులోని ఇండోసోల్ కంపెనీ కోసం జరుగుతున్న భూ సేకరణను వ్యతిరేకిస్తూ గత నెల రోజుల నుంచి ఆందోళన జరుగుతుందన్నారు. గిరిజన భూమి రక్షణకు ఆందోళన చేస్తున్న మణికల శిరీష, మల్లవరపు లలిత, మణికల సుజాతపై కేసు నమోదు చేయడంతోపాటు అరెస్టు చేసి జైలుకు పంపించారన్నారు. తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకుని అక్రమ కేసులను తొలగించాలని, వారిని విడుదల చేయాలని, వారి భూములకు రక్షణ కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన, దళితుల పక్షాన ఉందని గొప్పలు చెప్పే నాయకులు, ఆచరణలో మాత్రం కేసులు బనాయించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. ఈ సమస్య పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

మెగా డిఎస్‌సి నుంచి ఏజెన్సీ పోస్టుల మినహాయింపునకు టిఎసి తీర్మానం

- ఆదివాసీ రాష్ట్రీయ అధికార్ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు అప్పలనర్స డిమాండ్

ప్రజాశక్తి -పాడేరు (అల్లూరి జిల్లా)

మెగా డిఎస్‌సి నుంచి ఏజెన్సీ పోస్టుల మినహాయింపునకు గిరిజన సలహా మండలి (టిఎసి)లో తీర్మానం చేయాలని ఆదివాసీ రాష్ట్రీయ అధికార్ మంచ్ జాతీయ కార్యవర్గ సభ్యులు పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. ఆదివాసీ డిఎస్‌సి సాధన కమిటీ, ఆదివాసీ నిరుద్యోగుల సంఘం అధ్వర్యాన పాడేరు మోదకొండమ్మ గుడి వద్ద సోమవారం రాష్ట్ర సదస్సు నిర్వహించారు.

ఆదివాసీ నిరుద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ ఎస్.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సదస్సులో పి.అప్పలనర్స మాట్లాడుతూ... స్థానిక ఆదివాసులకే ఉపాధ్యాయ, ఉద్యోగాలు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు గిరిజన సలహా మండలి (టిఎసి)లో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎస్‌టి అభ్యర్థులతో భర్తీ చేయాలన్న ఆదివాసుల కోరిక నెరవేర్చిన తరువాతనే ఏజెన్సీ ప్రాంత టీచర్స్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. దానికనుగుణంగా మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌లో పేర్కొన్న ఏజెన్సీ ప్రాంత టీచర్ పోస్టులు మినహాయింపు ఇవ్వాలని, తదనంతరం ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేశారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు బదిలీల అవకాశం కల్పించండి

- జెఎసి డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నేషనల్ హెల్త్ మిషన్‌లోని అన్ని కేడర్ల ఉద్యోగులకు వన్‌టైం ట్రాన్స్‌ఫర్ల అవకాశం కల్పించాలని ప్రభుత్వాన్ని ఎపి నేషనల్ హెల్త్ మిషన్ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ వీరపాండియన్‌ను జెఎసి గౌరవ ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు, ఛైర్మన్ డి దయామణి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, సింహాచలం సోమవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. వైద్యారోగ్యశాఖలోని నేషనల్ హెల్త్ మిషన్‌లో దాదాపు 22 వేల మంది ఉద్యోగులు 186 కేడర్లలో అనేక ఏళ్లుగా సేవలందిస్తున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. కోవిడ్ కాలంలోనూ సేవలందించారన్నారు. వైద్యారోగ్యశాఖలోని ఇతర రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగులతో సమానంగా వేలాది మంది సీనియర్లుగా సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. వీరంతా గిరిజన, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 15 ఏళ్లుగా ఒకే చోట పని చేస్తున్నారని తెలిపారు. వీరిలో ఎక్కువ మంది కుటుంబాలకు దూరంగా ఉంటూ ఆర్థిక, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని పేర్కొన్నారు. 11వ పిఆర్‌సి వేతనాల పెంపు సమయంలో ఎన్‌హెచ్‌శ్రీం ప్రతినిధులతో చర్చించి వన్‌టైం ట్రాన్స్‌ఫర్స్‌కు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చినా.. ఇప్పటికీ అమలు జరగలేదని తెలిపారు. ఎన్‌హెచ్‌ఎంలో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పిలకు తక్కువ కాలంలోనే రెండు పర్యాయాలు బదిలీలకు అవకాశం కల్పించారని తెలిపారు.

సీనియర్లయిన ఇతర కేడర్లలో ఎవరికీ బదిలీ అవకాశం కల్పించలేదన్నారు. వినతిపత్రాన్ని పరిశీలించిన డైరెక్టర్ వీరపాండియన్ బదిలీల అంశం పరిశీలనలో ఉందని, డిఎ, ఇతర అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ కెప్టెన్లకు వేతన బకాయిలు చెల్లించాలి

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాలకు కెప్టెన్ (డ్రైవర్)లుగా పనిచేస్తున్న ఉద్యోగులకు 4 నెలల వేతన బకాయిలు చెల్లించాలని ప్రభుత్వాన్ని ఎపి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబును యూనియన్ గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, అధ్యక్షులు ఎం బసవరాజు, ప్రధాన కార్యదర్శి దేవిప్రసాద్ సోమవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అరబిందో సంస్థ (ఎఐఎంఎస్) ద్వారా వైద్యారోగ్యశాఖకు సేవలందిస్తున్న 500 మంది కెప్టెన్లకు గత 4 నెలలుగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. గత ఏడేళ్లుగా నెలకు రూ.8,800 వేతనాన్ని మాత్రమే యాజమాన్యం చెల్లిస్తుందన్నారు. సిటిసి పేరిట యజమాని కట్టాల్సిన పిఎఫ్ వాటాను ఉద్యోగుల నుంచే మినహాయిస్తూ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారని, ఆదివారం, వారాంతపు సెలవులు, పండగలు, చట్టప్రకారం అమలు చేయాల్సిన సెలవులు అమలు చేయడం లేదని పేర్కొన్నారు. ఇంక్రిమెంట్లు చెల్లించడం లేదని తెలిపారు. ఈ అంశాలపై గతంలోనే వినతిపత్రాలు సమర్పించినట్లు చెప్పారు. వేతన బకాయిలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని, ఇతర సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. ఈ అంశాలపై వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు.

ఖాళీగా ఉన్న స్థానిక సంస్థలకు ఎన్నికల నోటిఫికేషన్

- ఆగస్టు 10న సర్పంచ్, 12న ఎంపిటిసి, జడ్‌పిటిసి ఎన్నికలు
- రాష్ట్ర ఎన్నికల కమిషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వివిధ కారణాలతో ఎన్నికలు జరగని, ఉప ఎన్నికలు అవసరమైన స్థానిక సంస్థలకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సోమవారం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆయా స్థానాలకు ఆగస్టు 10న గ్రామ సర్పంచ్, 12న జడ్‌పిటిసి, ఎంపిటిసి స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో 2 జడ్‌పిటిసి, 3 ఎంపిటిసి, 2 సర్పంచ్ స్థానాలున్నట్లు ఎస్‌ఇసి పేర్కొంది. ఎన్నికలు జరగనున్న జడ్‌పిటిసి స్థానాల్లో వైఎస్‌ఆర్ కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట ఉన్నాయి. ఎంపిటిసి స్థానాల విషయానికొస్తే.. చిత్తూరు జిల్లా కుప్పం రెవెన్యూ డివిజన్, రామకుప్పం మండలం మనీంద్రం, పల్నాడు జిల్లా గురజాల కారంపూడి మండలం వేపకంపల్లి, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలి రెవెన్యూ డివిజన్ విడవలూరు మండలం, విడవలూరు-1 స్థానాలు ఉన్నాయి. వీటితోపాటు గ్రామ పంచాయతీ సర్పంచుల్లో ప్రకాశం జిల్లా ఒంగోలు రెవెన్యూ డివిజన్, కొండపి మండలం, కొండపి పంచాయతీ సర్పంచ్, మెంబర్లు, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రెవెన్యూ డివిజన్, కడియం మండలం, కడియపు లంక పంచాయతీ సర్పంచ్ ఎన్నికలు జరగనున్నాయి.

ఎన్నికల షెడ్యూల్

నోటిఫికేషన్ విడుదల : 28.07.25, **పబ్లికేషన్ తేదీ :** 30.07.25
నామినేషన్ల స్వీకరణ :30.07.25 నుంచి 01.08.25 వరకు
నామినేషన్ల పరిశీలన :02.08.25,
అప్పీల్స్ : 03.08.25, **అప్పీల్స్ డిస్పోజల్** :04.08.25
నామినేషన్ల ఉపసంహరణ :05.08.25, **తుది జాబితా** : 05.08.25
ఎన్నికలు జరిగే తేదీలు : (గ్రామ పంచాయతీలకు 10వ తేదీన ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు), జడ్‌పిటిసి/ఎంపిటిసిలకు 12వ తేదీన ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు
ఫలితాల ప్రకటన : గ్రామ పంచాయతీలకు 10వ తేదీ మధ్యాహ్నం 2 గంటల తర్వాత, జడ్‌పిటిసి/ఎంపిటిసి 14న ఉదయం 8 గంటల తర్వాత
రీ పోల్ : పంచాయతీలకైతే 12న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు , జడ్‌పిటిసి/ఎంపిటిసిలకైతే 13న ఎన్నికలు, 14న కౌంటింగ్

పొగాకు కొనుగోళ్లలో సమస్యలు

- పరిష్కరించాలని ఎపి రైతు, కౌలురైతు సంఘాల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పొగాకు కొనుగోళ్లలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని ఎపి రైతు, కౌలు రైతు సంఘాల రాష్ట్ర కమిటీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్‌కు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి, కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఎం హరిబాబు, నాయకులు కె అజయ్ కుమార్ వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. పొగాకు రైతులు పంట అమ్ముకునేందుకు నానా అవస్థలు పడుతున్నారని, ముఖ్యంగా బాపట్ల, గుంటూరు, ప్రకాశం, నంద్యాల, కర్నూలు, పల్నాడు జిల్లాల్లో ఈ పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. సాగును ప్రోత్సహించిన ఐటిసి, జిపిఐ, అలయన్స్ సంస్థలు పంట కొనుగోలు చేయకుండా రైతులను నట్టేట ముంచాయని తెలిపారు. రైతులు, రైతు సంఘాల ఒత్తిడితో, అధికారులు చొరవ ఫలితంగా జూన్ 17 నుంచి మార్క్‌ఫెడ్ ఆధ్వర్యాన కొనుగోళ్లు ప్రారంభమైనా, మందకొడిగా సాగు తుందన్నారు. రోజుకు 200 క్వింటాళ్లకు మించి కొనుగోలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.12 వేలు, రూ.9 వేలు చాలా కొద్ది మందికే లభిస్తుందని, అధిక సంఖ్యలో రైతులకు రూ.8 వేలు, రూ.6 వేలు మాత్రమే ధర వస్తుందన్నారు. రైతులు తెచ్చిన పొగాకును రిజెక్ట్ చేయడమే అధికంగా ఉందన్నారు. కొనుగోళ్ల ప్రారంభంలో రాజకీయ పలుకుబడి ఉన్న రైతులు అమ్ముకోగలిగారని, దళితులు, పేద, కౌలు రైతుల వద్ద పొగాకు ఇప్పుడిప్పుడే కొనుగోలు కేంద్రాలకు చేరుతుందన్నారు. వివక్ష లేకుండా పేద, కౌలు రైతులకు ప్రాధాన్యత ఇచ్చి పొగాకును కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరలు చెల్లించాలని కోరారు. నంద్యాల జిల్లాలో 30 వేల ఎకరాల్లో పొగాకు సాగు చేస్తే ఒక్క కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదన్నారు. గుంటూరు జిల్లాలో పొగాకు పండించే ప్రాంతంలో పత్తిపాడు, పెదనందిపాడుల్లో పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ధరల విషయంలో రైతులను మోసం చేస్తున్న దళారులు, పొగాకు కంపెనీలపై చర్యలు తీసుకోవాలని కోరారు. పొగాకు కొనుగోలు కేంద్రాల్లో రోజుకు రూ.500 క్వింటాళ్ల కొనుగోలు చేసే విధంగా లక్ష్యం నిర్దేశించాలన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తే చర్యలు

- పంచగ్రామాల సమస్యకు త్వరలో పరిష్కారం : మంత్రి అనగాని

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

రాష్ట్రంలోని భూ కబ్జాలపై ప్రత్యేక దృష్టి సారించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. విశాఖలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ... విశాఖలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయని, గత ప్రభుత్వంలో కబ్జాకు గురైన భూములకు సంబంధించిన ఫిర్యాదులే అధికంగా వస్తున్నాయని తెలిపారు. విశాఖలో భూ కబ్జాలపై రెవెన్యూ విభాగం ప్రత్యేక రిపోర్ట్ తయారు చేస్తోందన్నారు. పంచ గ్రామాల సమస్యకు త్వరలో పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ప్రయివేటు భూముల 22ఎ లో పెట్టకూడదని సిఎం చంద్రబాబు ఇప్పటికే చెప్పారని గుర్తు చేశారు. భూ సమస్యలకు ప్రత్యేక పాలసీ తీసుకొచ్చి, పరిష్కరించాలని ఆలోచన చేస్తున్నామన్నారు. విశాఖలో మెట్రో పనులు త్వరలో ప్రారంభం కానున్నట్టు తెలిపారు. సిఆర్‌జెడ్ నిబంధనల ప్రకారం సముద్ర తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

విజయవాడ రైల్వే డిఆర్ఎంగా మోహిత్ సోనాకియా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ రైల్వే డిఆర్ఎంగా మోహిత్ సోనాకియా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డిఆర్ఎంగా వ్యవహరించిన నరేంద్ర ఎ పాటిల్‌కు పోస్టింగ్ ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టారు. అయితే మోహిత్ సోనాకియా 1995లో కాన్పూర్ ఐఐటిలో బిటెక్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ చదివారు. అదే కళాశాలలో 1997లో ఎంటెక్ పూర్తి చేశారు. 1998లో నార్తర్న్ రైల్వే గజియాబాద్‌లో అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా బాధ్యతలు స్వీకరించారు. పలు ప్రదేశాల్లో అనేక కీలక బాధ్యతలు నిర్వర్తించారు. సోనాకియా అనేక ల్యాండ్ మార్క్ ప్రాజెక్టుల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అందులో కాన్పూర్ మెట్రో ప్రయారిటీ కారిడార్, వారణాసి డివిజన్‌లోని వాప్రా-గోరఖ్‌పూర్ సెక్షన్ లో పనిచేశారు. రైల్వేలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై యుకెతోపాటు పలు దేశాల్లో పర్యటించిన అనుభవం ఉంది.

తుంగభద్రకు కొనసాగుతున్న వరద

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ
- శ్రీశైలం నాలుగు గేట్లు ఎత్తివేత
- ధవళేశ్వరం నుంచి 6 లక్షల క్యూసెక్కుల నీటి విడుదల



శ్రీశైలం నాలుగు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్రంలోని వివిధ జలశయాలకు వరద ఉధృతి కొనసాగుతోంది. తుంగభద్ర డ్యామ్‌కు ఇన్‌ఫ్లో 96,836 క్యూసెక్కులు రాగా అవుట్‌ఫ్లో 1,06,896 క్యూసెక్కులుగా ఉంది. నదీతీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుంగభద్ర బోర్డు అధికారులు ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. కర్ణాటక రాష్ట్రం శృంగేరి, వర్నాడు, శివమొగ్గ తదితర ప్రాంతాల్లో గత వారం రోజులుగా అధిక వర్షాలు కురుస్తుండడంతో 96,896 క్యూసెక్కుల నీరు తుంగభద్రకు వచ్చి చేరుతోంది. డ్యామ్ 27 గేట్లను ఎత్తి దిగువకు 1,06,896 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. నీటి నిలువ సామర్థ్యం 105 టిఎంసిలు కాగా ప్రస్తుతం 76 టిఎంసిలు నమోదైంది.

శ్రీశైలం నాలుగు గేట్లు ఎత్తివేత

కృష్ణ ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి భారీగా వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. సోమవారం సాయంత్రం ఆరుగంటల సమయానికి ఎగువ జూరాల నుంచి 1,48,279 క్యూసెక్కులు, సుంకేసుల ద్వారా 94,445 క్యూసెక్కులు కలిపి 2,42,724 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయానికి చేరుతుంది. దీంతో నాలుగు గేట్లను పది అడుగుల మేర ఎత్తి దిగువ నాగార్జునసాగర్‌కు 1,08,260 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి పోతిరెడ్డిపాడుకు 31 వేల క్యూసెక్కులు, హంద్రీ నీవా సృజల స్రవంతికి 2,401, మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

భద్రాచలం వద్ద 35.3 అడుగులు

గోదావరికి స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద సోమవారం నాటికి 10.90 అడుగుల నీటిమట్టం నమోదైంది. ఇన్‌ఫ్లో 6,11,104 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో బ్యారేజీ 175 గేట్లను పైకి ఎత్తి 6.01 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. సాగు, తాగునీటి అవసరాల నిమిత్తం 9,250 క్యూసెక్కుల నీటిని తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా కాలువలకు వదులుతున్నారు. భద్రాచలం వద్ద నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం భద్రాచలం వద్ద 35.3 అడుగుల నీటి మట్టం నమోదైంది. ఎగువ నుంచి 6,15,420 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. వరద ప్రవాహం పెరగడంతో నదీ తీరప్రాంత గ్రామాలు, లంక గ్రామాల్లో ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. మళ్లీ అల్పపీడనం హెచ్చరికల నేపథ్యంలో ఎగువన వర్షాలు కురిస్తే వరద మరింత పెరిగే అవకావం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు.



పోర్టు హాస్పిటల్ ఎదురుగా రోడ్డుపై మానవహారం నిర్మించిన పోర్టు అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

విశాఖ పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ ఆపాలి

- 300వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి-సీతమ్మధార (విశాఖపట్నం)

విశాఖ పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన ఆస్పత్రి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 300వ రోజుకు చేరుకున్నాయి. పోర్టు హాస్పిటల్ ఎదురుగా రోడ్డుపై మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు పద్మనాభరాజు మాట్లాడుతూ మన పోరాటం వల్ల గోల్డెన్ జూబ్లీ హాస్పిటల్ టెండర్‌కు ఎవరూ ముందుకు రాలేదన్నారు. హాస్పిటల్ అభివృద్ధి కోసం చైర్మన్ కమిటీ వేశారని తెలిపారు. సుమారు 40 వేలమంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రయివేటుకు అప్పగించడం తగదన్నారు. విశాఖ అభివృద్ధిలో విశాఖ పోర్టు కీలకమని, ఏటా మున్సిపల్ కార్పొరేషన్‌కి సగటున రూ.65 కోట్లు పన్నులు కడుతోందని వివరించారు. పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్ ఫండ్లు, వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ, హాస్పిటల్ ప్రయివేటీకరణకు నిర్ణయం తీసుకోడం అన్యాయమన్నారు. వెంటనే ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని, పోర్టు సొంత నిధులతో ఆస్పత్రిని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణ కొనసాగితే కార్మికులు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు కలిసి పెద్ద ఎత్తున ఉద్యమించేందుకు సిద్ధమని హెచ్చరించారు. హాస్పిటల్ ప్రయివేటీకరణపై రాష్ట్రంలో ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ పోరాటానికి భెల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జిటిపి ప్రకాష్, డాక్‌యార్డు యూనియన్ నాయకులు గణేష్ సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె సత్యనారాయణ, జె సత్యనారాయణ, బి జగన్, గణేష్, శంకరరావు, నర్సింగరావు, త్రినాధరావు, ఈశ్వరరావు, రాఘవులు, కార్మికులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో 6 నుంచి ఫ్రెషర్స్ డే వేడుకలు

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వసతి గృహాల్లో విద్యార్థుల మధ్య స్నేహపూర్వక వాతావరణం కల్పించేందుకు ఆగస్టు 6 నుంచి మూడు రోజులపాటు ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించనున్నట్లు బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని బిసి సంక్షేమ వసతి గృహాల్లో ఈ వేడుకలు నిర్వహించనున్నట్లు మంత్రి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరానికి ఇప్పటికే బిసి వసతి గృహాల్లో అడ్మిషన్ల ప్రక్రియ చివరి దశకు చేరుకుందని తెలిపారు. ఆగస్టు 5వ తేదీలోగా అడ్మిషన్లు ముగించాలని ఈ సందర్భంగా ఆ శాఖ అధికారులను ఆదేశించారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే 6 నుంచి 8వ తేదీ వరకూ ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించాలని సూచించారు. అన్ని తరగతుల విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు, విద్యా కమిటీ సభ్యులు, ప్రజా ప్రతినిధులు ఈ ఫ్రెషర్స్ డే వేడుకల్లో పాల్గొనేలా చర్యలు తీసుకుంటామన్నారు. వీరితోపాటు జిల్లా కలెక్టరు, జెసి, సబ్ కలెక్టర్, ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు అన్ని స్థాయిల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

పి-4లో నిర్బంధం తగదు

- రిజిస్ట్రేషన్‌ల బహిష్కరణకు ఉపాధ్యాయ సంఘాల పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జిరో పావర్టీ (పి-4) కార్యక్రమంలో ఉపాధ్యాయులను నిర్బంధం చేయడం తగదని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) తెలిపింది. ప్రతి ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడు కొన్ని కుటుంబాలను కచ్చితంగా దత్తత తీసుకోవాలని, ఆ కుటుంబాలను బంగారు కుటుంబాల పేరుతో వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని ఒత్తిడి చేయడం తగదని సమాఖ్య ఛైర్మన్ ఎల్ సాయిశ్రీనివాస్, సెక్రటరీ జనరల్ ఎస్ చిరంజీవి సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. దత్తత తీసుకునే అంశం ఐచ్ఛికంగా ఉండాలని, నిర్బంధం చేయడం తగదని సూచించారు. ఈ నిర్బంధాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేయాల్సిన అవసరం లేదని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి సోమవారం సాయంత్రంలోపు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తిచేయాలని హుకుం జారీ చేయడాన్ని తీవ్రంగా విమర్శించారు. పి-4 కార్యక్రమం ఆర్థికంగా శ్రీమంతులైన వ్యక్తులకు సంబంధించిన వ్యవహారమని తెలిపారు. మధ్యతరగతి శ్రేణిలో ఉన్న ఉపాధ్యాయులు, ఉద్యోగులు వేరే కుటుంబాలను దత్తత తీసుకొని ఆర్థికంగా సహాయం చేసే పరిస్థితి ఉండదనే నిజం ప్రభుత్వ పెద్దలు తెలుసుకోవాలని వివరించారు. ఒకవేళ ఎవరైనా ఐచ్ఛికంగా దత్తత తీసుకుంటే స్వాగతిస్తామని, ఆ విషయం అంతవరకే పరిమితం కావాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయవర్గం ఇప్పటికే బోధనేతర పనులతో బోధనకు దూరమవుతున్న పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. యాప్‌లో 70 రకాలకు పైగా ఉన్న టూల్స్ రద్దు చేసి బోధనా స్వేచ్ఛ కల్పించాలని కోరారు. పేద, బడుగు, బలహీనవర్గాలకు విద్యను దూరం చేయకుండా చర్యలు తీసుకుంటే అదే అసలైన అభివృద్ధి అని తెలిపారు.



తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

ఆర్ఆర్ ప్యాకేజీ రూ.25 లక్షలివ్వాలి

- వంటా - వార్పుతో భూ నిర్వాసితుల నిరసన

ప్రజాశక్తి -నక్కపల్లి (అనకాపల్లి జిల్లా)

ఆర్ఆర్ ప్యాకేజీ రూ.25 లక్షలు ఇవ్వాలని, తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అనకాపల్లి జిల్లా నక్కపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులు వంటా వార్పు కార్యక్రమం చేపట్టారు. భూపోరాట కమిటీ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపట్టారు. నక్కపల్లి మండలంలోని అమలాపురం పంచాయతీ మూలపర్ర, పాటిమీద, చందనాడ పంచాయతీ తుమ్మలపేట, తమ్మయ్యపేట, బుచ్చిరాజుపేట, కొత్తూరు, డిఎల్.పురం గ్రామాలకు చెందిన నిర్వాసితులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నిర్వాసితులకు సిపిఎం, వైసిపి, కాంగ్రెస్ పార్టీ నేతలు సంఘీభావం తెలుపుతూ వంటా- వార్పులో పాల్గొన్నారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ నరసింహామూర్తికి నిర్వాసితులు, నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, వైసిపి నాయకులు వీసం రామకృష్ణ, భూ పోరాట కమిటీ నాయకులు తళ్ల భార్గవ్, గంటా తిరుపతిరావు, సూరకాసుల గోవింద్ మాట్లాడారు. నిర్వాసితులకు న్యాయం చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పరిశ్రమల ఏర్పాటులో భాగంగా ఇళ్లు కోల్పోతున్న వారి కుటుంబాల్లో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ రూ.25 లక్షలు ఆర్ఆర్ ప్యాకేజీ చెల్లించి, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చట్ట ప్రకారం సంప్రదింపుల కమిటీ వేసి నిర్వాసితులతో అధికారులు చర్చలు జరిపి ప్యాకేజీ నిర్ణయించాలని, కానీ జిల్లా అధికారులు నిర్వాసితులతో చర్చలు జరపకుండా ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకొని కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. సర్వం కోల్పోయిన నిర్వాసితులను ఈ విధంగా మోసగించడం భావ్యం కాదన్నారు.



ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

ఎయిడెడ్ విద్యాసంస్థలను పరిరక్షించాలి

- విద్యార్థుల మహాధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

ప్రభుత్వ ఎయిడెడ్ విద్యాసంస్థలను నిర్వీర్యం చేసే ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ వద్ద సోమవారం విద్యార్థులు మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు నగరంలోని ఎంఎస్ఎన్ ఎయిడెడ్, సిబిఎం ఎయిడెడ్, పెద్దాపురం ఎంఆర్ ఎయిడెడ్, అన్నవరం సత్యదేవ ఎయిడెడ్ జూనియర్ కళాశాలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి రామ్మోహన్ మాట్లాడుతూ ఎన్నికల ముందు యువగళం యాత్రలో ప్రభుత్వ ఎయిడెడ్ విద్యాసంస్థలను కాపాడుతామని టిడిపి నాయకులు హామీ ఇచ్చారన్నారు. నేడు అధికారంలోకి వచ్చాక ఎయిడెడ్ విద్యాసంస్థలను పూర్తిగా పట్టించుకోవడంలేదని తెలిపారు. ఎయిడెడ్ విద్యాసంస్థలను నిర్వీర్యం చేయడానికి టిడిపి కూటమి సర్కారు కుట్రలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది నుంచి విద్యార్థులకు కనీసం పాఠ్యపుస్తకాలైనా అందించడంలేదన్నారు. ఇది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడడమేనని పేర్కొన్నారు. ఎయిడెడ్ జూనియర్ కళాశాలల విద్యార్థులకు తక్షణమే పాఠ్యపుస్తకాలను అందించాలని, ఎయిడెడ్ కళాశాలలలో మధ్యాహ్న భోజన పథకాన్ని వెంటనే అమలు చేయాలని, జిఒ 35 ప్రకారం ఎయిడెడ్ కళాశాలలలో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్ఎఫ్ఐ కాకినాడ జిల్లా కార్యదర్శి ఎం గంగాసూరిబాబు మాట్లాడుతూ వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఆసరాగా నిలుస్తున్న ఎయిడెడ్ కళాశాలలను ప్రభుత్వ కళాశాలలుగా గుర్తించాలని కోరారు. ఎయిడెడ్ విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్ సగిలికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కాకినాడ నగర అధ్యక్ష, కార్యదర్శులు వాసుదేవ, సాహిత్, ఉపాధ్యక్షులు రాజేష్, గమ్మివేలు, ఉపాధ్యక్షురాలు భువనేశ్వరి, నగర కమిటీ నాయకులు గుణశ్రీ, సత్యవతి, ప్రసన్న, కన్నా, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యభిచార ముఠాలు, వాటి ప్రోత్సాహకులపై ప్రత్యేక విచారణ

- అత్యాచార వ్యతిరేక పోరాట ఐక్య వేదిక డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కాకినాడ జిల్లా, పెద్దాపురంలో వ్యభిచార గృహం నడుపుతున్న భారతిని తక్షణమే అరెస్టు చేయాలని అత్యాచార వ్యతిరేక పోరాట ఐక్య వేదిక డిమాండ్ చేసింది. యువతులను సెక్స్ వ్యాపారంలోకి దించుతున్న ముఠాలకు, పోలీసులు, నేతలతో ఉన్న సంబంధాలను ఛేదించి ఈ వృత్తిని ప్రోత్సహిస్తున్న వారిపై చర్యలు చేపట్టేందుకు వీలుగా ప్రత్యేక విచారణ చేపట్టాలని పేర్కొంది. విజయవాడలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఐక్య వేదిక నాయకులు డి రమాదేవి, దుర్గా భవాని, పద్మ, గంగాభవాని, దుర్గాంబ, అమల మాట్లాడారు. పెద్దాపురం, పరిసర ప్రాంతాల్లో వ్యభిచార గృహాలపై దాడులు చేసి మూడు కేసులు ఫైల్ చేయడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. వ్యభిచార గృహ నిర్వాహకులు భారతిని నేటి ఇప్పటి వరకు అరెస్టు చేయకపోవడానికి కారణాలేంటని ప్రశ్నించారు. బాధిత మహిళలకు రక్షణ, పునరావాసం, నష్టపరిహారం, నివాస గృహాలు, ఉద్యోగం లేదా ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే ఆదివారం ధర్నాలో మాట్లాడుతూ.. ఈ విషయాలను వెలుగులోకి తెచ్చిన తులసి చందుపై చర్యలు తీసుకోవాలని కోరడాన్ని వారు ఖండించారు. సూర్యబలిజ సంఘం కోరినట్లు వ్యభిచారాన్ని నిర్వహిస్తున్న 10 కుటుంబాలపై చర్యలు చేపట్టాలని ఐక్యవేదిక నేతలు డిమాండ్ చేశారు.



బాధితుడితో మాట్లాడుతున్న రాంభూపాల్, సిపిఎం నాయకులు

వడ్డీ వ్యాపారులను కఠినంగా శిక్షించాలి : సిపిఎం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

అధిక వడ్డీ వసూలు చేస్తోన్న, డబ్బులు ఇవ్వకపోతే భౌతిక దాడులకు పాల్పడుతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన ఓ చేనేత కార్మికుని కుటుంబంపై వడ్డీ వ్యాపారులు దాడి చేసిన ఘటన తీవ్ర సంచలనం అయ్యింది. ఈ నేపథ్యంలో దాడికి గురైన బాధితుడి కుటుంబాన్ని సిపిఎం నాయకులు సోమవారం పరామర్శించారు. అధిక వడ్డీ, కంతుల చెల్లింపు, దాడికి సంబంధించిన అన్ని వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాధితుడు మాట్లాడుతూ.. చేనేత వృత్తి తప్ప మరో పని తెలియకపోవడంతో అప్పులు చేసి మరీ ఈ వృత్తిని కొనసాగించాల్సి వస్తోందన్నారు. అందులో భాగంగానే రాజ అనే వ్యక్తి వద్ద గత సంవత్సరం రూ.రెండు లక్షలు అప్పు తీసుకున్నాని, ఆ తరువాత ఓ మిత్రునికి నాలుగు లక్షలు అప్పు ఇప్పించి, మొత్తం ఆరు లక్షల రూపాయలకు రూ.15.30 లక్షలు వడ్డీ కట్టానని వివరించారు. ఆదాయం లేని కారణంగా వడ్డీ కట్టలేనని, అసలు మాత్రం చెల్లిస్తానని చెప్పగా అందుకు ఒప్పుకోకపోగా తన ఇంటికొచ్చి తీవ్రంగా దాడి చేశారంటూ బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ... రూ.ఆరు లక్షలకు రూ.15 లక్షలు వడ్డీ చెల్లించిన వ్యక్తి... ఆర్థిక స్థోమత లేక ఇక చెల్లించలేనని చెప్పగా వడ్డీ వ్యాపారులు మూకుమ్మడిగా దాడి చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. అధిక వడ్డీ వసూలు చేస్తోన్న వారందరిని చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. వడ్డీలు కట్టలేని అనేక కుటుంబాలను ఆదుకునే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్మవరానికి ప్రాతినిధ్యం వహిస్తోన్న మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఈ ఘటనపై వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, ఎస్‌హెచ్.బాషా, పట్టణ కార్యదర్శి ఎ.మారుతి తెలిపారు.

పి-4 కోసం సి-4

తెరపైకి మరో ప్రయోగం

ప్రజశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పి-4 (పబ్లిక్- ప్రయివేటు- పీపుల్- పార్టనర్‌షిప్) కార్యక్రమం అమలు చేస్తున్న ప్రభుత్వం దానిని విజయవంతంగా కొనసాగించేందుకు సి-4 అనే కొత్త విధానాన్ని జత చేయాలని భావిస్తోంది. తాజాగా ముఖ్యమంత్రి అధ్యక్షతన ఏర్పడిన టాస్క్‌ఫోర్స్ కమిటీ కూడా ఈ అంశాన్ని తన నివేదికలో పొందుపరిచింది. కన్వర్జెన్స్, కాంపిటేటింగ్, కొలాబరేషన్, కంటిన్యూటీలను కలిపి సి-4గా నామకరణం చేశారు. టాస్క్‌ఫోర్స్ నివేదికలోని ఈ అంశాన్ని కూడా ప్రభుత్వం ప్రాథమికంగా అంగీకరించినట్లు తెలిసింది. కార్పొరేట్లు, ధనవంతుల ద్వారా నిరుపేదలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేసేందుకు పి-4ను అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకుగాను వచ్చే నెల 15వ తేదీ నాటికి 15 లక్షల మంది మార్గదర్శులను గుర్తించాలని లక్ష్యాలను కూడా నిర్దేశించారు. అయితే ఈ ప్రక్రియను సజావుగా కొనసాగించేందుకు రాష్ట్ర, కేంద్ర పథకాలను సమన్వయం చేసుకుంటూ రెండు ప్రభుత్వాల పాలసీలను ఉపయోగించుకోవడం (కన్వర్జెన్స్), ఇతర రాష్ట్రాలు, రాష్ట్రంలోని జిల్లాల మధ్య పోటీతత్వం పెరిగేలా చూడడం (కాంపిటేషన్), రాష్ట్రం, దేశంలోని పరిశ్రమలు, ఇతర సంస్థల నుంచి సహకారం తీసుకోవడం (కొలాబరేషన్), అనుకున్న కార్యక్రమాన్ని సజావుగా కొనసాగించడం (కంటిన్యుటీ)ను నాలుగు విధానాలను పి-4లో చేర్చనున్నారు. దీనికోసం త్వరలో మార్గదర్శకాలను విడుదల చేయనున్నట్లు ఒక సీనియర్ అధికారి తెలిపారు.

రేషన్‌లో రాగులు

- ఆగస్టులో బియ్యం బదులుగా కేజీ పంపిణీ



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

చౌక ధరల దుకాణాల ద్వారా ఆగస్టులో రాగులు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని చౌక ధరల దుకాణాల కార్డు ఒక్కంటికీ కిలో రాగుల పంపిణీకి ఏర్పాట్లు చేసింది. కిలో రాగులు తీసుకున్న వారికి కిలో బియ్యం తగ్గించనుంది. గత వైసిపి ప్రభుత్వం 2,023 నుంచి ఏడాది పాటు రాగి పిండిని అందించింది. గతేడాది ఫిబ్రవరి నుంచి ఆపేసింది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చౌక ధరల దుకాణాల ద్వారా కేవలం బియ్యం, పంచదార మాత్రమే అందిస్తోంది. గతేడాది డిసెంబరు, ఈ ఏడాది జనవరిలో మాత్రం కందిపప్పు ఇచ్చింది. ఇప్పుడు బియ్యం, పంచదారతోపాటు రాగులు అందించాలని నిర్ణయించింది. వైసిపి ప్రభుత్వంలో ఇచ్చిన రాగి పిండి నాణ్యతగా లేకపోవడంతో దీనిని తీసుకోవడానికి లబ్ధిదారులు ఆసక్తి చూపలేదు. దీంతో, డిపోల్లో నిల్వ చేసిన రాగి పిండి పాడైపోయింది. ఈ దృష్ట్యా తమకు రాగులు కావాలని డీలర్‌కు చెప్తే డిపోలకు ఆ మేరకు రాగులను ఇవ్వాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా 29,796 చౌక ధరల దుకాణాల పరిధిలో 1,45,97,486 రేషన్ కార్డులు ఉన్నాయి. ఇందులో 4,29,79,897 మంది లబ్ధిదారులుగా ఉన్నారు. కార్డుదారులకు రాగులు అందించేందుకు ప్రభుత్వం 23,353 టన్నుల రాగులను కేటాయించాలని నిర్ణయించింది. అందులో ఇప్పటివరకు 1,774 టన్నులు విడుదల చేసింది. జిల్లాలకు 1,439 టన్నుల వరకు చేరింది. వీటిలో 1,343 టన్నులు ఎంఎల్ఎస్ (మండల లెవల్ స్టాక్ పాయింట్లు)కు చేరాయి. రాగులు అధికంగా పండించే శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో సరిపడా నిల్వలు ఉండడంతో వాటినే లబ్ధిదారులకు అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. మిగిలిన జిల్లాలకు ప్రభుత్వమే సేకరించి పంపిస్తోంది.

ఆగస్టులోనూ కందిపప్పు లేనట్టే!

రేషన్ దుకాణాల ద్వారా ఆగస్టులో కూడా లేనట్టేనని సమాచారం. కందిపప్పు ఎప్పుడు ఇస్తారో, ఏ నెల అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 డిసెంబర్‌లో 50 శాతం కుటుంబాలకు, 2025 జనవరిలో కార్డుదారులందరికీ దీనిని పంపిణీ చేసింది. ఆ తర్వాత నుంచి రేషన్‌లో కందిపప్పు ఇవ్వలేదు. ప్రజాపంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా ఆరు నెలలుగా కందిపప్పు పంపిణీ నిలిచిపోవడంతో కార్డుదారులు బయట మార్కెట్లో అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. బహిరంగ మార్కెట్లో కేజీ కందిపప్పు రూ.110 నుంచి రూ.135 ఉంది. ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా రాయితీపై కేజీ రూ.67కే అందించేది. రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం కందిపప్పు పంపిణీ ఆపేసిన తర్వాత బహిరంగ మార్కెట్లో ధరలను దృష్టిలో పెట్టుకుని జిల్లా అధికారులు స్థానికంగా ఉన్న రైతుబజార్ల ద్వారా గతంలో కందిపప్పు అందించేవారు. ఇప్పుడు అదీ ఆపెయ్యడంతో బయట మార్కెట్లోనే అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది.

భారత్‌లో స్టార్‌లింక్‌కు 20 లక్షల కనెక్షన్లు

కేంద్రమంత్రి పెమ్మసాని వెల్లడి

న్యూఢిల్లీ : అమెరికాకు చెందిన స్టార్‌లింక్‌కు భారత్‌లో గరిష్టంగా 20 లక్షల కనెక్షన్లకు మాత్రమే సేవలందించగలదని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఇది గరిష్ఠంగా 200 ఎంబిపిఎస్ స్పీడ్‌ను అందించగలదని తెలిపారు. బిఎస్ఎన్ఎల్ సహా ఇతర టెలికాం సంస్థలపై స్టార్‌లింక్ ప్రభావం తక్కువగానే ఉంటుందన్నారు. నెలవారీ ఛార్జీలు సుమారు రూ.3,000 వరకు ఉండొచ్చని అంచనా వేశారు.

సామ్‌సంగ్‌తో ఎలన్ మస్క్ భారీ ఒప్పందం

వాషింగ్టన్ : టెస్లా సిఇఒ ఎలన్ మస్క్ దిగ్గజ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల కంపెనీ సామ్‌సంగ్‌తో కీలక ఒప్పందం కుదుర్చుకున్నారు. తన కార్లకు కావాల్సిన చిప్స్ కోసం 16.5 బిలియన్ డాలర్ల ఒప్పందంపై సంతకాలు చేశారు. ఇది నష్టాల్లో ఉన్న దక్షిణ కొరియా టెక్ దిగ్గజం సామ్‌సంగ్ తయారీ వ్యాపారానికి మద్దతును అందించనుంది. ఈ ఒప్పందంలో కొత్త టెక్సాస్ ఫ్యాబ్ టెస్లాకు చెందిన ఎఐ6 చిప్‌ను తయారు చేసి సామ్‌సంగ్ ఇవ్వనుంది. ఈ ఒప్పందం 2033 వరకు కొనసాగనుంది.



విజయనగరంలో రాష్ట్ర మహాసభలు

- జెవివి అధ్యక్షులు గేయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జన విజ్ఞాన వేదిక (జెవివి) 18వ రాష్ట్ర మహాసభ సెప్టెంబరు 13 నుంచి రెండు రోజులపాటు విజయనగరంలో నిర్వహించాలని రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. గత మూడు రోజులుగా విజయవాడలోని జరిగిన జెవివి రాష్ట్ర కమిటీ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను జెవివి అధ్యక్షులు గేయానంద్ సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. జెవివి మహాసభను ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్వర్క్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆశా మిశ్రా ప్రారంభించనున్నారని, ప్రఖ్యాత రాజకీయ విశ్లేషకులు ప్రొఫెసర్ కె నాగేశ్వర్ కీలకోపన్యాసం చేస్తారని తెలిపారు. గత నెలరోజులుగా జెవివి విజయనగరం శాఖ రాష్ట్ర మహాసభల ఏర్పాట్లలో నిమగ్నమై ఉన్నట్లు చెప్పారు. ఇప్పటికే విద్యార్థి, యువజన, విద్యా సదస్సులు, అభివృద్ధి-పర్యావరణం తదితర సెమినార్లు నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమాలకు అత్యధిక సంఖ్యలో ప్రజానీకం, సైన్స్ అభిమానులు హాజరయ్యారని తెలిపారు. 29వ తేదీన 'నేనెవర్ని?' అనే అంశంపై మానవ పరిణామం గురించి సైన్స్ సెమినార్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐటిపై మరో రెండు సెమినార్లు జరుగుతాయని చెప్పారు. ఆ సెమినార్లకు ప్రధాన వక్తలుగా నెల్లూరు వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కాలేషా, కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ శ్రీపతిరాయ్ హాజరుకానున్నట్లు తెలిపారు. మహాసభకు అన్ని జిల్లాల నుంచి 400 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని, మాజీ ఎమ్మెల్సీలు వి బాలసుబ్రమణ్యం, ఎంవిఎస్ శర్మ, కెఎస్ లక్ష్మణరావు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా 18వ మహాసభ పోస్టరును ఆయన ఆవిష్కరించారు. ఉత్తరాంధ్ర యావత్ ప్రజానీకం మహాసభల జయప్రదానికి సహకరించాలని గేయానంద్ కోరారు.

సంపాదకీయం


నిర్బంధ పి-4

రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు టిడిపి కూటమి ప్రభుత్వం 'వినూత్నం'గా ముందుకు తీసుకొచ్చిన పి-4 విధానం బూంరాంగ్ అయినట్లే కనిపిస్తోంది. సమాజంలో ఆర్థికంగా అట్టడుగున కడు దరిద్రంలో మగ్గుతున్న కుటుంబాలను అక్కున చేర్చుకొని వారిని పేదరికం నుంచి బయట పడేయాలన్న సర్కార్ పిలుపుపై కార్పొరేట్ల, సంపన్నుల నుంచి స్పందన నామమాత్రంగా ఉంది. ఏదొక విధంగా పరువు నిలుపుకునేందుకు ప్రభుత్వం ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు బలవంతంగా దత్తత టార్గెట్లు ఫిక్స్ చేస్తూ సర్క్యులర్లు, మెమోలు, ఆదేశాలు జారీ చేస్తుండటంతో ఒక్కసారిగా కలకలం బయలుదేరింది. ఒక్కో ప్రధానోపాధ్యాయుడు కనీసం ఐదు పేద కుటుంబాలను, ఒక ఉపాధ్యాయుడు రెండు కుటుంబాలను, గ్రామ, వార్డు సచివాలయ కార్యదర్శి రెండు కుటుంబాలను దత్తత తీసుకోవాలని నిర్దేశించడంతో పాటు రెండు రోజుల్లో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌లు పూర్తి కావాలని ఉన్నతాధికారుల నుంచి హుకుం జారీ అయింది. ఈ హఠత్పరిణామంతో ప్రభుత్వ యంత్రాంగంలో నిరసనలు పెల్లుబుకుతున్నాయి. డిఎలు, బకాయిలు, సంబంధం లేని విధులే కాకుండా తమపై ఈ అదనపు భారమేంటన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. నష్ట నివారణా చర్యగా పి-4 వైస్ ఛైర్మన్ సోమవారం హుటాహుటిన జోక్యం చేసుకొని దత్తత బలవంతం కాదు, స్వచ్ఛందమేనని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది.

టిడిపి కూటమి పీఠమెక్కాక ప్రకటించిన 'స్వర్ణాంధ్ర విజన్ 2047' పత్రంలో పి-4ను ప్రముఖంగా చేర్చారు. సమాజంలో ఆర్థికంగా ఉన్నతంగా పై స్థాయిలో ఉన్న పది శాతం మంది సంపన్నులు, ఆర్థికంగా దిగువనున్న 20 శాతం పేద ప్రజలకు చేయూతనిచ్చి దరిద్రం నుంచి విముక్తులను చేసే కార్యక్రమమే పి-4. పేదలను బంగారు కుటుంబాలని, సంపన్నులను మార్గదర్శకులని పేర్కొన్నారు. బంగారు కుటుంబాల గుర్తింపునకు ప్రత్యేక సర్వేలు సైతం నిర్వహించారు. కొన్ని నెలలైనా బంగారు కుటుంబాలను దత్తత తీసుకొనేందుకు మార్గదర్శకుల్లో ఆసక్తి కానరాకపోవడంతో ముఖ్యమంత్రే స్వయంగా, తాను, తన కుటుంబం కలిసి కొన్ని బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటామని ప్రకటించినా మార్గదర్శకుల్లో కదలిక కనిపించలేదు. మంత్రులు, అధికార కూటమి ఎంఎల్‌ఎలు, ఎంపిలు, ఎంఎల్‌సిలు సైతం ముఖం తిప్పుకుంటున్నారు. పి-4 విషయంలో వైఫల్యం మూటగట్టుకోక తప్పదని గ్రహించారో ఏమో, ఉద్యోగులు, ఉపాధ్యాయులపై పడ్డారు. ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాల దత్తత పూర్తి కావాలన్న లక్ష్యం నెరవేరేందుకు ప్రభుత్వ శాఖాధిపతులను సర్కారు రంగంలోకి దించింది. ప్రతి ఉద్యోగికి బంగారు కుటుంబాల దత్తత టార్గెట్లు ప్రభుత్వ నిర్బంధం కిందికొస్తుంది.

పి-4 పాలసీ ప్రభుత్వం ప్రజా సంక్షేమం పట్ల తన బాధ్యతల నుంచి తప్పించుకునే ప్రయత్నం. పేదరిక నిర్మూలన జరగాలంటే ప్రజలకు ఉద్యోగ, ఉపాధి కల్పన, ఆదాయాల వృద్ధికి పటిష్టమైన చర్యలు చేపట్టకుండా జీరో పావర్టీ అసాధ్యం. భూపంపిణీ, నిజ వేతనాల పెంపు ప్రజల్లో కొనుగోలు శక్తిని పెంచుతాయి. అధిక ధరలు ప్రజలను తిండికి సైతం దూరం చేస్తున్నాయి. విద్య, వైద్యం వంటి ప్రాథమిక అవసరాలు ప్రభుత్వరంగంలో అందుబాటులో ఉంటే కొత్తగా పేదలు పుట్టుకొచ్చే అవకాశం ఉండదు. ఇటువంటి మౌలిక అంశాలను వదిలేసి 2029 నాటికి జీరో పావర్టీ నినాదం మభ్యపెట్టేందుకే. ప్రభుత్వానికి వేల కోట్ల రూపాయల పన్నులు ఎగ్గొడుతున్న, శ్రామికులకు కనీస వేతనాలు కూడా చెల్లించని కార్పొరేట్లు, సంపన్నులు మార్గదర్శకులెలా కాగలుగుతారు? భూములను, సహజ వనరులను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్న ప్రభుత్వం, ఆ కార్పొరేట్లతో బంగారు కుటుంబాలను దత్తత తీసుకోమనడం వారి దోపిడీకి ప్రాయశ్చిత్తమే అవుతుంది. ప్రజలను దానాలు స్వీకరించే బిచ్చగాళ్లుగా మారుస్తుంది. కార్పొరేట్ల సామాజిక బాధ్యత అనేది కూడా ట్యాక్స్‌లు ఎగ్గొట్టే ఎత్తు తప్ప అందులో నిజమైన సామాజిక బాధ్యత లేదు. కార్పొరేట్లు, సంపన్నులు ఎగ్గొట్టే పన్నులను వసూలు చేసి, వారికి ఇచ్చే అపరిమితమైన రాయితీలను పేదలకు మళ్లించి ఖర్చు చేస్తే పేదలకు మార్గదర్శకుల అవసరం ఉండదు. సెర్ప్, మెప్మా వంటివి కొన్ని దశాబ్దాలుగా అమల్లో ఉన్నా పేదరికం తగ్గింది లేదు. పేదరిక నిర్మూలనకు ప్రభుత్వానికి కావాల్సింది ఆచరణాత్మక చిత్తశుద్ధి.

మహనీయుల మాట



ప్రజలు వాస్తవమైన ఆనందం ఏమిటో గ్రహించిన రోజున, ఆ ఆనందాన్ని పొందడం సాధ్యమేనని తెలుసుకున్న రోజున మతం అదృశ్యమౌతుంది. అయితే పాలకవర్గాలు తమ ప్రయోజనాల రీత్యా, ప్రజలు ఆ విషయం తెలుసుకోకుండా అడ్డుపడుతుంటారు. తమ ఆధిపత్యాన్ని కాపాడుకోవడానికి మతాన్ని ఉపయోగించుకుంటుంటారు.

- ఆగస్ట్ బెబెల్,
జర్మన్ సోషలిస్ట్ రాజకీయవేత్త, రచయిత, వక్త.

'మా భూములు వదులుకోం' ఉద్యమ విజయం

టి. యశ్వంత



ఇప్పటి వరకు జరిగిన భూసేకరణ వ్యతిరేక పోరాటాలు పరిహారం పెంపు లక్ష్యంగా కొనసాగాయి. కానీ చెన్నరాయపట్న రైతాంగం 'మా భూములు వదులుకోం' అన్న నినాదంతో ఉద్యమించి చివరి వరకు, తుది విజయం సాధించే వరకూ అదే 'డిమాండు'కు కట్టుబడి ఉన్నారు. ఇవి సారవంతమైన భూములనే కారణం కన్నా...గతంలో భూములు కోల్పోయిన రైతాంగ కుటుంబాల జీవితాలు ఎంతలా అస్తవ్యస్తం అయిపోయాయన్న సజీవ అనుభవాలు...చెన్నరాయపట్న రైతాంగంలో తమ భూములు ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోరాదనే కృతనిశ్చయం కలిగేందుకు దోహదం చేశాయి. రైతాంగంలో నెలకొన్న గరిష్ఠ ఐక్యతకు తోడు వివిధ ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు అందించిన సంఘీభావం ఉద్యమ విజయానికి కీలకంగా నిలిచాయి.

నిర్బంధపు భూ సేకరణకు వ్యతిరేకంగా...బెంగళూరు రూరల్ జిల్లాలోని దేవనహళ్లి తాలూకా చెన్నరాయపట్న హోబ్లికి చెందిన పదమూడు గ్రామాల రైతులు (2022 ఏప్రిల్ 4వ తేదీన) చేపట్టిన 1198 రోజుల పోరాటం ఎట్టకేలకు విజయవంతంగా ముగిసింది. చెన్నరాయపట్న భూసేకరణ వ్యతిరేక పోరాట కమిటీ, సంయుక్త పోరాట కర్ణాటక కమిటీ ప్రతినిధి వర్గంతో కర్ణాటక ముఖ్యమంత్రి (2025 జులై 15న) జరిపిన చర్చల అనంతరం ప్రభుత్వం తలపెట్టిన 1,777 ఎకరాల వ్యవసాయ భూముల సేకరణ ప్రతిపాదనను విరమించుకుంటున్నట్లు ప్రకటించారు.

కర్ణాటక పారిశ్రామిక ప్రాంతాభివృద్ధి చట్టం 1966ను అనుసరించి తొలుత ఈ భూముల సేకరణకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ చట్టం కర్ణాటక పారిశ్రామికాభివృద్ధి బోర్డుకు అపరిమిత అధికారాలను కట్టబెట్టింది. రైతులను వాళ్ల వ్యవసాయ భూముల నుండి బేదఖలు చేయడానికి, చట్టపరంగా రైతులకు ఉన్న ప్రజాస్వామిక హక్కులను తృణీకరిస్తూ, నిరంకుశ పద్ధతులలో వారి నుండి నిర్బంధ పూరితంగా భూములు లాక్కోవడానికి ఈ బోర్డు పేరుమోసింది. కాలక్రమేణా నయా ఉదారవాద విధానాల అమలు నేపథ్యంలో ఈ బోర్డు రియల్ ఎస్టేట్ రంగానికి దళారిగా వ్యవహరించసాగింది. 2022లో ఇచ్చిన నోటిఫికేషన్‌లో 5 కిలోమీటర్ల పరిధిలో ఉన్న 13 గ్రామాల రైతుల నుండి భూసేకరణ చెయ్యాలని తలపెట్టారు. 2018-19 సంవత్సరాలలో ఏరో స్పేస్, డిఫెన్స్ పార్క్ ఫేజ్-2 నిర్మాణం కోసం ఈ గ్రామాల సరిహద్దులలో ఉన్న 1300 ఎకరాల భూమిని సేకరించారు. ఫేజ్-1 దశలో ఇవే కంపెనీల కోసం, బెంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయం కోసం హోబ్లి ప్రాంతంలో 6,000 ఎకరాల భూమిని సేకరించారు. తద్వారా ఈ ప్రాంత నివాసయోగ్య భూమి వేగంగా కృశించిపోతూ వచ్చింది.

2022లో అప్పటి బిజెపి రాష్ట్ర ప్రభుత్వం మరో విడత భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ విడత నోటిఫికేషన్‌లో భూములు కోల్పోవాల్సిన రైతులలో 2018-19, అంతకు ముందు జరిగిన భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులు ఉన్నారు. అలాగే అప్పట్లో భూములు కోల్పోయిన రైతుల బంధువులు, స్నేహితులు, ఇరుగు పొరుగువారు ఉన్నారు. పై రెండు విడతలలో భూములు కోల్పోయిన రైతులు జీవనాధారానికి దూరమై దివాళా తీసిన చేదు అనుభవాలు 13 గ్రామాల రైతుల దృష్టిలో ఉన్నాయి.

2023లో కర్ణాటక శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఆ నాటికి ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ తమకు అధికారం ఇస్తే ఈ నోటిఫికేషన్ రద్దు చేస్తామని హామీ ఇచ్చింది. తీరా ఎన్నికలలో గెలిచి అధికారం చేపట్టిన కాంగ్రెస్ ఈ వాగ్దానాన్ని తుంగలో తొక్కి భూసేకరణను వేగవంతం చేయడానికి తుది నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ భూములన్నీ సారవంతమైనవి, ఆహార ధాన్యాలతో పాటు, కూరగాయలు, ద్రాక్ష, మామిడి పండిస్తుంటారు. పశుపోషణతో పాటు పట్టు పురుగుల పెంపకం, పూల తోటల సాగు కూడా చేస్తున్నారు. ఈ పదమూడు గ్రామాల ప్రజలకు ఈ భూములే జీవనాధారం. అందుకే తమ భూములను కాపాడుకోవడానికి చెన్నరాయపట్న రైతులందరూ కలిసి భూసేకరణ వ్యతిరేక పోరాట కమిటీగా ఏర్పడి హోబ్లి రెవిన్యూ ఉపకార్యాలయం ఎదుట నిరవధిక నిరసన కార్యక్రమానికి దిగారు. ఆల్ ఇండియా కిసాన్ సభకు అనుబంధంగా ఉన్న 'కర్ణాటక రైతు సంఘం' మద్దతును అభ్యర్థించారు. ప్రారంభం నుండి ఈ ఉద్యమంలో కీలక పాత్ర పోషించింది. నాటి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.సి.బయ్యారెడ్డి ఈ ఉద్యమానికి శ్రీకారం చుట్టి 2025 జనవరి 4న ఆయన అకాల మరణం చెందే వరకూ ఉద్యమానికి మార్గ నిర్దేశనం, నాయకత్వం అందించారు. బయ్యారెడ్డి మరణానంతరం నాయకత్వ లోటును అధిగమించడానికి 'సంయుక్త పోరాట కర్ణాటక' సంఘం చురుకైన, సమరశీలమైన మద్దతు ఎంతగానో తోడ్పడింది. 'సంయుక్త పోరాట కర్ణాటక'లో భాగస్వాములుగా ఉన్న ఎ.ఐ.కె.యస్, సి.ఐ.టి.యు, ఐద్వా, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర శాఖలు, బడగలపుర నాగేంద్ర, హెచ్.ఆర్. బసవరాజప్ప, చుక్కి నంజుండ స్వామిల నాయకత్వాన ఉన్న వివిధ రైతు సంఘాలు, దళిత, యువజన, విద్యార్థి సంఘాలు చెన్నరాయపట్నం రైతాంగ ఉద్యమానికి అండగా నిలబడడంతో ఈ సమస్య జాతీయ ప్రాధాన్యతను సంతరించుకున్నది.

2025 మే నెలలో రాష్ట్ర స్థాయిలో జరిగిన జనాగ్రహ సదస్సులో చెన్నరాయపట్నం రైతాంగ పోరాటానికి మద్దతుగా 2025 జూన్ 25న ఛలో దేవనహళ్లి, జైల్ భరో కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించారు. రైతు పోరాటాన్ని పలుచన చేసి చూపడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన 'సాధన సమావేశం' (విజయోత్సవ సదస్సు) నైతికతను పౌర సమాజం తీవ్రంగా ప్రశ్నించింది. ప్రభుత్వ వైఖరిని ఎండగట్టడానికి నిరసన ప్రదర్శనకు పిలుపునిచ్చింది. చెన్నరాయపట్నం రైతాంగ ఉద్యమానికి మద్దతుగా కార్మికులు, మహిళలు దళితులు, విద్యార్థులు, యువజనులు పెద్ద ఎత్తున ఈ నిరసన ప్రదర్శనలో పాలు పంచుకున్నారు. పోలీసులు సృష్టించిన అవరోధాలను లెక్కచెయ్యలేదు. ప్రముఖ సినీనటుడు ప్రకాష్‌రాజ్ కూడా ఈ నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ నిరసన ప్రదర్శనకు పోలీసు యంత్రాంగం అనుమతి నిరాకరించడమే కాకుండా శాంతియుతంగా సాగుతున్న నిరసన ప్రదర్శనపై విరుచుకుపడి బలప్రయోగానికి దిగింది. నిరసనకారులను ఈడ్చిపారెయ్యడంతో పాటు వందలాది మందిని అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించింది. స్వంత పూచీకత్తుపై నాయకులను విడుదల చేస్తామని పోలీసు యంత్రాంగం ప్రతిపాదించినా నాయకత్వం అందుకు అంగీకరించలేదు. 'అయితే జైల్లో పెట్టండి, లేదంటే బలవంతపు భూసేకరణను రద్దు చెయ్యండి' అని భీష్మించుకోవడంతో గత్యంతరం లేక పోలీసులు వారిని బేషరతుగా విడుదల చేశారు. ప్రభుత్వం మీద ఒత్తిడి పెంచడానికి ఉద్యమకారులు 'జైల్ భరో' కార్యక్రమానికి బదులుగా బెంగళూరులో నిరవధిక ధర్నాకు పూనుకున్నారు. ఈ నిరసనల ఒత్తిడికి తలొగ్గి రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య జులై 4న చర్చలకు రావాల్సిందిగా ఉద్యమ నాయకత్వాన్ని ఆహ్వానించారు.

మరోపక్కన చెన్నరాయపట్నం రైతాంగ ఉద్యమానికి నానాటికీ మద్దతు పెరుగుతూ వచ్చింది. సామాజిక ఉద్యమకారులు ప్రభాయన్, బెలవంగళ, చంద్ర తేజస్వి, నరసింహమూర్తి, హరీంద్ర వంటి వారితో పాటు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి గోపాల గౌడ, వ్యవసాయ ఉత్పత్తుల ధరల నిర్ణాయక కమిషన్ మాజీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ ప్రకాష్ కమ్మర్ది వంటి వారితో పాటు ఎ.ఐ.కె.యస్ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి బి. వెంకట్, రాకేష్ తికాయత్, దర్శన్ పాల్, సునీలమ్, యుధ్‌వీర్ సింగ్ వంటి రైతు ఉద్యమ హేమాహేమీ నాయకులు బెంగళూరులో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

2026 జులై 4న కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఉద్యమ నాయకులతో చర్చలు జరిపి సమస్య పరిష్కారానికి పది రోజుల గడువు కోరారు. అయితే ఈ కాలంలో కొందరు మంత్రుల అండతో స్థానిక రాజకీయ నాయకులు రైతు ఉద్యమంలో చీలికలు సృష్టించడానికి ప్రయత్నించారు. కొందరు రైతులు స్వచ్ఛందంగా భూములు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారంటూ మీడియా సమావేశం నిర్వహించారు. అయితే వారంతా రియల్ ఎస్టేట్ ఏజెంట్లని, అసలైన రైతులు ఎవరూ లేరని చెన్నరాయపట్నం రైతాంగ ఉద్యమం బట్టబయలు చేసింది.


ఎట్టకేలకు 2025 జులై 15న రైతాంగ ఉద్యమ ప్రతినిధులతో జరిపిన సమావేశం సందర్భంగా ముఖ్యమంత్రి సిద్దరామయ్య భూసేకరణ నోటిఫికేషన్లు అన్నింటిని వాపసు తీసుకుంటున్నట్లు ప్రకటించడంతో 1198 రోజుల పాటు సుదీర్ఘంగా సాగిన చెన్నరాయపట్న రైతాంగ ఉద్యమం విజయం సాధించింది.

చెన్నరాయపట్న రైతాంగ ఉద్యమానికి ఈ విజయం ఆషామాషీగా దక్కింది కాదు. రైతాంగ ఉద్యమకారులపై అక్రమ కేసులు బనాయించారు. విభజించి పాలించే కుయుక్తులకు పాల్పడ్డారు. ఐనప్పటికీ రైతాంగం తిరుగులేని ఐక్యతకు కట్టుబడి, మొక్కవోని దీక్షతో ఉద్యమ స్ఫూర్తిని ప్రదర్శిస్తూ సమాజంలోని వివిధ తరగతుల ప్రజానీకం మద్దతు కూడగట్టుకోవడం ద్వారా ఈ విజయాన్ని సాధించుకున్నది. సైద్ధాంతిక, రాజకీయ విభేదాలను పక్కనపెట్టి ఏకోన్ముఖంగా సాగించిన ఈ పోరాటం కర్ణాటక రాష్ట్ర చరిత్రలో ఒక కొత్త అధ్యాయానికి తెర తీసింది. చరిత్ర సృష్టించింది. దోపిడికి గురైన ప్రజానీకానికి ఆశా కిరణంగా నిలిచింది. సి.పి.ఐ(యం), వామపక్షాలు ఈ ఉద్యమానికి నిరంతర తోడ్పాటు ఇవ్వడం మూలంగా చెన్నరాయపట్న రైతాంగ ఉద్యమం చారిత్రక విజయాన్ని సాధించింది. దేశ వ్యాప్తంగా నిర్బంధపు భూసేకరణకు బలి అవుతున్న రైతాంగానికి చెన్నరాయపట్న రైతాంగ ఉద్యమ విజయం ఒక ప్రేరణగా, ఆదర్శ నమూనాగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

సుదీర్ఘ కాలం పాటు చెన్నరాయపట్నం రైతాంగం చేసిన పోరాటం సరికొత్త చరిత్రను సృష్టించింది. ఇప్పటి వరకు జరిగిన భూసేకరణ వ్యతిరేక పోరాటాలు పరిహారం పెంపు లక్ష్యంగా కొనసాగాయి. కానీ చెన్నరాయపట్న రైతాంగం 'మా భూములు వదులుకోం' అన్న నినాదంతో ఉద్యమించి చివరి వరకు, తుది విజయం సాధించే వరకూ అదే 'డిమాండు'కు కట్టుబడి ఉన్నారు. ఇవి సారవంతమైన భూములనే కారణం కన్నా...గతంలో భూములు కోల్పోయిన రైతాంగ కుటుంబాల జీవితాలు ఎంతలా అస్తవ్యస్తం అయిపోయాయన్న సజీవ అనుభవాలు...చెన్నరాయపట్న రైతాంగంలో తమ భూములు ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోరాదనే కృతనిశ్చయం కలిగేందుకు దోహదం చేశాయి. రైతాంగంలో నెలకొన్న గరిష్ఠ ఐక్యతకు తోడు వివిధ ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలు అందించిన సంఘీభావం ఉద్యమ విజయానికి కీలకంగా నిలిచాయి. స్థానిక రైతాంగ పోరాటాన్ని విశాల ప్రాతిపదికన విస్తృతం కావించడం ద్వారా కర్ణాటక రాజకీయ, సామాజిక యవనికపై సరికొత్త చారిత్రక విజయ కేతనాన్ని ఎగురవేశారు.

'జనతకు చైతన్యం పుడితే గమ్యమెంత దూరం
చిటికెలోన పులుముతారు చరితకు సిందూరం' ★

సామ్రాజ్యవాదం - ఖనిజాలు



ప్రభాత్ పట్నాయక్



ప్రపంచంలో పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం ప్రారంభం కావడానికి తెర తీసిన పారిశ్రామిక విప్లవం బ్రిటన్‌లో జౌళి మిల్లులలో మొదలైంది. ఐతే బ్రిటన్ కాని, యూరప్ ఖండం ఉత్తర భాగంలో ఉన్న తక్కిన దేశాలలో గాని ముడి పత్తి పండదు. అంటే, పారిశ్రామిక పెట్టుబడిదారీ విధానం పుట్టుక నుండే ముడిసరుకులు ప్రపంచంలో ఎక్కడెక్కడ లభిస్తాయో వాటినల్లా సంపన్న దేశాలు చేజిక్కించుకోవడం మీద ఆధారపడి కొనసాగింది. ఇన్ని శతాబ్దాల తర్వాత కూడా ఈ పరిస్థితిలో ఇసుమంతైనా మార్పు లేదు. కాలం గడుస్తున్న కొద్దీ సంపన్న పెట్టుబడిదారీ దేశాల్లో ఉత్పత్తి చేసే సరుకులు మారి కొత్త కొత్తవి వచ్చాయి. వాటికి కావలసిన ముడిసరుకులు కూడా మారుతూవచ్చాయి. ఈ ముడిసరుకులలో చాలా గణనీయమైన భాగం ఈ సంపన్న పెట్టుబడిదారీ దేశాలకు వెలుపలి నుండే నిరంతరాయంగా సరఫరా ఔతున్నాయి. వాటి సరఫరా ఎటువంటి ఒడిదుడుకులూ లేకుండా కొనసాగడం అనేది సంపన్న పెట్టుబడిదారీ దేశాలకు చాలా ముఖ్యం. ఆ విధంగా నిరాటంకంగా ముడిసరుకుల సరఫరా కొనసాగాలంటే బైట ప్రపంచం మీద సంపన్న పెట్టుబడిదారీ దేశాల ఆధిపత్యం కొనసాగించడం వాటికి అవసరం.

ఈ విధంగా సంపన్న పెట్టుబడిదారీ దేశాలకు వెలుపలి ప్రపంచం నుండి ముడి సరుకు సరఫరా సాధారణ సరుకుల మారకం పద్ధతిలోనే జరుగుతుందని సాంప్రదాయ బూర్జువా అర్థశాస్త్ర పండితులు భావిస్తారు. ఇంకోలా చెప్పాలంటే, ఈ ముడిసరుకులన్నీ అప్పటికే సరుకులుగా ఉత్పత్తి ఔతున్నట్టు, అవి తగినంత పరిమాణాల్లో మార్కెట్‌లో లభిస్తున్నట్టు, మార్కెట్‌లో మామూలుగా ఉండే ధరల హెచ్చుతగ్గులకు తగ్గట్టు ఈ ముడిసరుకుల ధరలు కూడా నిర్ణయించబడుతున్నట్టు, అందుచేత వాటి మీద సామ్రాజ్యవాదం ఎటువంటి నియంత్రణనూ చెలాయించవలసిన అవసరం లేదన్నట్టు వారు భావిస్తారు. అంతేగాక అన్ని ముడిసరుకులూ అప్పటికే పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాల పరిధిలోనే ఉత్పత్తి ఔతున్నట్టు వారు పరిగణిస్తారు. ఈ వాదన ద్వారా బూర్జువా ఆర్థికవేత్తలు అసలు సామ్రాజ్యవాదం అనేదే ఎక్కడా ఉనికిలో లేదని, ఉన్నదంతా సాధారణ బూర్జువా మార్కెట్ విధానమేనని చెప్పదలచుకున్నారు. వారు చెప్పేది చూస్తే ఇప్పటికే ప్రపంచం యావత్తూ పెట్టుబడిదారీ ప్రపంచంగా మారిపోయినట్టు, అంతా సంపన్న పెట్టుబడిదారీ దేశాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నట్టు అనుకోవాలి. అంతకన్నా విడ్డూరం వేరే ఏమీ లేదు.

పెట్టుబడిదారీ వ్యవస్థకి సామ్రాజ్యవాద లక్షణం అనేది లేనే లేదని చెప్పడానికి వారు మరొక వాదన కూడా ముందుకు తెస్తారు. సంపన్న పెట్టుబడిదారీ దేశాలు చేసే మొత్తం ఉత్పత్తిలో వారు ఉపయోగించే ముడిసరుకు మొత్తం విలువ చాలా తక్కువ శాతమే ఉంటుందని, అందుచేత అంత స్వల్ప విలువ కల ముడిసరుకు కోసం పెట్టుబడిదారీ వ్యవస్థ ఏకంగా ప్రపంచం మొత్తాన్ని తన ఆధిపత్యం కిందకు తెచ్చుకునే పెద్ద ప్రయత్నాన్ని అసాధారణ రీతిలో ఎందుకు చేస్తుందని వారు అడుగుతారు.

హారీ మెగ్‌డాఫ్ తన 'ఏజ్ ఆఫ్ ఇంపీరియలిజం' అన్న గ్రంథంలో ఈ వాదనకు సమాధానం ఇచ్చారు. ముడిసరుకులను ఉపయోగించకుండా ఏ సరుకునూ ఉత్పత్తి చేయడం జరగదని, అలా ఉపయోగించే ముడిసరుకు మారకపు విలువ ఎంత తక్కువ అయినా దాని ఉపయోగపు విలువ మాత్రం చాలా ఎక్కువని అతడు వివరించాడు. మారకపు విలువలు సామాజికంగా నిర్ణయించబడతాయి కనుక సంపన్న పెట్టుబడిదారీ దేశాలు ఆ ముడిసరుకుల విలువలను దాదాపు సున్నా స్థాయికి దిగ్గోస్తారని తెలిపాడు. ఐతే, ఆ ముడిసరుకుల వాస్తవ ఉపయోగం సహజంగా నిర్ణయించబడుతుంది కనుక అవి లేకుండా సరుకుల ఉత్పత్తి చేయడం అసాధ్యం ఔతుంది. ఆ కారణంగా వాటిని బైట నుండి ఎలాగైనా తెచ్చుకోవడం సంపన్న పెట్టుబడిదారీ దేశాలకు తప్పనిసరి ఔతుంది. అందుచేత ముడిసరుకుల మారకపు విలువ చాలా స్వల్పం కనుక వాటిని పొందడం కోసం చేసే ప్రయత్నానికి పెద్ద ప్రాధాన్యత ఉండదన్న బూర్జువా పండితుల వాదనలు చాలా పొరపాటు.

వ్యవసాయం ద్వారా లభించే ముడిసరుకులు, ఆహార పంటలు సంపన్న పెట్టుబడిదారీ దేశాలకు ముఖ్యమైన అవసరాలు. వాటి కోసం అవి ప్రపంచం మొత్తంగా భూ వినియోగం తమ అవసరాలకు అనుగుణంగా ఉండేలా చూసుకుంటాయి. ఆ భూ వినియోగం తీరుని వాళ్ళే అదుపు చేయడానికి ప్రయత్నిస్తారు. ఐతే ఇక్కడ ప్రధానంగా ఖనిజాల గురించి చర్చిస్తాను. సంపన్న దేశాలకు బైటనుండి ముడి ఖనిజాల దిగుమతి ఎంత కీలకమో ఇటీవల అమెరికా అరుదైన మూలకాల (రేర్ ఎర్త్స్) గురించి ఎంతగా ఆరాటపడుతోందో చూస్తే స్పష్టమౌతుంది.

నూతన పరిస్థితుల్లో మూడవ ప్రపంచ దేశాల్లో సామ్రాజ్యవాదానికి ప్రతిఘటన రానురాను బలపడుతోంది. ఖనిజాలతో సహా తమ దేశాలకు చెందిన ముడిసరుకుల మీద తమ ఆధిపత్యాన్ని తిరిగి నెలకొల్పుకోవడం కోసం మూడవ ప్రపంచ దేశాలలో మొదలైన ప్రయత్నం రానున్న రోజుల్లో బలమైన ఉద్యమంగా మారుతుంది.

చైనా నుండి వచ్చే దిగుమతుల మీద సుంకాలనను పెంచుతామంటూ ట్రంప్ బెదిరిస్తే, దానికి జవాబుగా చైనా ప్రభుత్వం అమెరికాకు తన వద్ద నుండి కొన్ని అరుదైన మూలకాల ఎగుమతిపై తాత్కాలికంగా నిషేధం ప్రకటించింది. ప్రపంచంలో మొత్తంగా ఉత్పత్తి అవుతున్న అరుదైన మూలకాలలో దాదాపు 70 శాతం చైనా నుండే జరుగుతున్నాయి. వాటిని ప్రాసెస్ చేసే సామర్థ్యం కూడా ప్రపంచం మొత్తం మీద 90 శాతం చైనా వద్దే ఉంది. చైనా ప్రకటించిన నిషేధంతో అమెరికా ఇరుకున పడింది. చైనాకు బదులుగా వేరే దేశాలనుండి ఆ అరుదైన మూలకాలను దిగుమతి చేసుకోడానికి ప్రయత్నించినా తక్కిన దేశాలేవీ చైనా నుండి వచ్చేంత ఎక్కువ పరిమాణంలో సరఫరా చేయగలిగిన శక్తి కలిగిలేవు. దాంతో అరుదైన మూలకాల సరఫరా అమెరికాకు కొనసాగించేలా చైనాను ఒప్పించడం కోసం తప్పనిసరి పరిస్థితిలో సుంకాల విషయంలో అమెరికా సంప్రదింపులకు దిగివచ్చింది.

ఇక్కడ గమనించవలసిన విషయం ఒకటుంది. 2024లో అమెరికా దిగుమతి చేసుకున్న మొత్తం అరుదైన మూలకాల విలువ కేవలం 17 కోట్ల డాలర్లు. అదే ఏడాదిలో అమెరికా మొత్తం దిగుమతుల (వస్తువులు, సేవలు కలిపి) విలువ 4 లక్షల 11 వేల కోట్ల డాలర్లు! అందులో అరుదైన మూలకాలు కేవలం 0.004 శాతం మాత్రమే. ముడిసరుకుల ఉపయోగపు విలువకు, వాటి మారకపు విలువకు మధ్య ఉన్న తేడా ఎంత ఎక్కువో దీనిని బట్టి తెలుస్తుంది. మొత్తం దిగుమతుల్లో కేవలం 0.004 శాతం మాత్రమే ఉన్న అరుదైన మూలకాలు ఎలక్ట్రానిక్స్, వాహన తయారీ, విండ్ టర్బైన్లు, అత్యున్నత స్థాయి సామర్థ్యం కల అయస్కాంతాలు, వైద్య పరికరాలు వంటి పలు విలువైన ఉత్పత్తుల తయారీలో కీలకంగా ఉన్నాయి. అందుచేత వాటి సరఫరా తాత్కాలికంగానైనా నిలిచిపోతే అది సంపన్న దేశాలకు పెద్ద సంకటంగా మారుతుంది.

అందుకనే సామ్రాజ్యవాదులు వాటి సరఫరాపై తమ పూర్తి నియంత్రణ సాధించడానికి ఎంతవరకైనా పోవడానికి తయారౌతారు.

ఈ ముడిసరుకులలో చాలా గణనీయమైన భాగం ఈ సంపన్న పెట్టుబడిదారీ దేశాలకు వెలుపలి నుండే నిరంతరాయంగా సరఫరా ఔతున్నాయి. వాటి సరఫరా ఎటువంటి ఒడిదుడుకులూ లేకుండా కొనసాగడం అనేది సంపన్న పెట్టుబడిదారీ దేశాలకు చాలా ముఖ్యం. ఆ విధంగా నిరాటంకంగా ముడిసరుకుల సరఫరా కొనసాగాలంటే బైట ప్రపంచం మీద సంపన్న పెట్టుబడిదారీ దేశాల ఆధిపత్యం కొనసాగించడం వాటికి అవసరం.

చైనా మీద ఆధారపడడాన్ని తగ్గించుకోవడం కోసం అమెరికా ఇతర వనరులను వెతుక్కుంటోంది. గ్రీన్‌ల్యాండ్ మీద తనకు ఆధిపత్యం కావాలని కోరుకుంటున్నది ఇందుకే. గ్రీన్‌ల్యాండ్ లో అరుదైన మూలకాలతోబాటు వివిధ రకాలైన ఇతర ఖనిజాలను కూడా పొందడానికి అమెరికా ప్రయత్నిస్తోంది. చైనా తన సరఫరాను తాత్కాలికంగానైనా నిలిపివేయడంతో గ్రీన్‌ల్యాండ్ విషయంలో అమెరికా అంత ఆరాటాన్ని ప్రదర్శిస్తోంది. ఐతే ఈ ప్రత్యామ్నాయాలేవీ చైనానుండి వచ్చే సరఫరాతో సరితూగలేవు. ఎందుకంటే ప్రపంచ నిల్వల్లో సగానికి పైగానే అరుదైన మూలకాల నిల్వలు చైనా భూభాగంలో ఉన్నాయి. అమెరికా ఆరాటం అంతా వాటికోసమే.

సామ్రాజ్యవాదం తక్కిన ప్రపంచం మీద ఆధిపత్యాన్ని చెలాయించడానికి ప్రయత్నించడం వెనుక మరొక కారణం కూడా ఉంది. రోజా లక్సెంబర్గ్ ఆ విషయాన్ని చక్కగా నొక్కి చెప్పారు. సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో పెట్టుబడి పోగుబడడం అనేది దీర్ఘ కాలం కొనసాగేలా జరగాలంటే అవి తమ దేశాలకు వెలుపల ఉన్న పెట్టుబడిదారీ-పూర్వ సమాజాల మార్కెట్లలోకి చొరబడడం చాలా అవసరం. పెట్టుబడిదారీ వ్యవస్థలున్న దేశాల్లో కూడా మార్కెట్లు ఉన్నాయి. వాటి మీద పెత్తనం కోసం కూడా సంపన్న పెట్టుబడిదారీ దేశాలు ప్రయత్నిస్తాయి. ఐతే ప్రపంచీకరణ అమలౌతున్న ఈ కాలంలో మార్కెట్లు కూడా ప్రపంచీకరించబడ్డాయి. అందుచేత ప్రత్యేకంగా సంపన్న పెట్టుబడిదారీ దేశాలు ఈ మార్కెట్ల మీద తమ ఆధిపత్యం కోసం ప్రయత్నం ఏదీ చేయనవసరం లేదు. ఎటొచ్చీ వాటికి అవసరమైన ముడి సరుకుల విషయంలో మాత్రం సంపన్న పెట్టుబడిదారీ దేశాలకు మొత్తం ప్రపంచం మీద ఆధిపత్యం చెలాయించడం తప్ప వేరే మార్గం లేదు.

వలసపాలన కాలం ముగిసిన అనంతరం కొత్తగా స్వాతంత్ర్యం పొందిన దేశాలు (మూడవ ప్రపంచ దేశాలు), ఆర్థికంగా సామ్రాజ్యవాదం పట్టు నుండి బైట పడడం కోసం తమ సహజ వనరులమీద సర్వాధికారాలూ తమకే ఉండాలని ప్రయత్నించాయి. ఇటువంటి ప్రయత్నాలకు పూనుకున్నందున సామ్రాజ్యవాదం ఆ యా దేశాలలో ప్రభుత్వాలను కూల్చివేసేందుకు కుట్రలు పన్నింది. ఇరాన్ లో మొస్సాదే ప్రభుత్వాన్ని, గ్వాటెమాలా లో ఆర్బెంజ్ ప్రభుత్వాన్ని, చిలీ లో అలెండీ ప్రభుత్వాన్ని, కాంగోలో లుముంబా ప్రభుత్వాన్ని ఆ కారణంగానే కూలదోశాయి. ఆ ప్రభుత్వాలు తమ ఖనిజ సంపదను జాతీయం చేయడానికి పూనుకోవడమే దీని వెనుక ప్రధాన కారణం.

మూడవ ప్రపంచ దేశాల మీద ప్రపంచీకరణను రుద్దడంతో, చాలా దేశాల నుండి ముడి సరుకుల సరఫరా సంపన్న పెట్టుబడిదారీ దేశాలకు నిరాటంకంగా సాగిపోవడం మొదలైంది. ఎటువంటి కుట్రలూ అవసరం లేకుండానే ప్రపంచీకరణ విధానం సామ్రాజ్యవాదుల అవసరాలను నెరవేర్చుతోంది. ఎవరు ప్రభుత్వం లోకి వచ్చినా, అక్కడ జరిగిన వ్యవస్థీకృత మార్పులు (ప్రైవేటీకరణ వగైరా) సంపన్న పెట్టుబడిదారీ దేశాలకు ఎటువంటి ఇబ్బందులూ రాకుండా గ్యారంటీ చేస్తున్నాయి. ఐతే ఇప్పుడు ఆ నయా ఉదారవాద విధానమే సంక్షోభంలో పడింది. ఈ సంక్షోభం నుండి బైట పడడానికి అమెరికా ఏకపక్షంగా తనదే పైచేయిగా ఉండాలన్న విధానంతో మూడవ ప్రపంచ దేశాల మీద తన షరతులను రుద్దుతోంది. అప్పటినుంచీ పరిస్థితులు మారుతున్నాయి. నూతన పరిస్థితుల్లో మూడవ ప్రపంచ దేశాల్లో సామ్రాజ్యవాదానికి ప్రతిఘటన రానురాను బలపడుతోంది. ఖనిజాలతో సహా తమ దేశాలకు చెందిన ముడిసరుకుల మీద తమ ఆధిపత్యాన్ని తిరిగి నెలకొల్పుకోవడం కోసం మూడవ ప్రపంచ దేశాలలో మొదలైన ప్రయత్నం రానున్న రోజుల్లో బలమైన ఉద్యమంగా మారుతుంది. ఆ విధంగా పెట్టుబడిదారీ సంక్షోభం సామ్రాజ్యవాదాన్ని మరింత బలహీనపరుస్తుంది. బలహీనపడుతున్నకొద్దీ సామ్రాజ్యవాదం మరింత దుర్మార్గంగా వ్యవహరిస్తుంది.

(స్వేచ్ఛానుసరణ)

పి-4 పేరుతో ఉద్యోగులపై వేధింపులు

- వైసిపి నేత చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బంగారు కుటుంబాల దత్తత పేరుతో ప్రభుత్వ ఉద్యోగులపై కూటమి ప్రభుత్వం వేధింపులకు పాల్పడుతోందని వైసిపి ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ రాష్ట్ర అధ్యక్షులు నలమారు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. హామీల అమల్లో విఫలమైన కూటమి ప్రభుత్వం, ప్రజల దృష్టి మరల్చడానికి రకరకాల డైవర్షన్ కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. అందులో భాగంగానే పి-4 తీసుకొచ్చారని, పేదవారిని సంపన్నులు దత్తత తీసుకోవడం సంప్రదాయమని అన్నారు. కానీ ఉద్యోగ, ఉపాధ్యాయులు దత్తత తీసుకోవాలని బలవంతంగా కలెక్టర్లతో ఉత్తర్వులు ఇప్పించడం అన్యాయమన్నారు. ఇదెక్కడి సంప్రదాయమని ప్రశ్నించారు.

'పి-4'లో చేరడం స్వచ్ఛందమే..

- వైస్ ఛైర్మన్ కుటుంబరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వం చేపట్టిన పి-4 కార్యక్రమంలో మార్గదర్శకులుగా చేరేందుకు ఎటువంటి బలవంతం లేదని, ఎవరైనా బలవంతం చేస్తే సంబంధిత అధికారులకు, ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలని స్వర్ణాంధ్ర పి-4 ఫౌండేషన్ వైస్ ఛైర్మన్ సి కుటుంబరావు తెలిపారు. పి-4 కార్యక్రమం మార్గదర్శకులు చేరడం స్వచ్ఛందమే తప్ప బలవంతం లేదని సోమవారం ఒక ప్రటనలో పేర్కొన్నారు. ఇప్పటికే 50 వేల మందికిపైగా మార్గదర్శకులు స్వచ్ఛందంగా నమోదయ్యారని, 6 లక్షల బంగారు కుటుంబాలను గుర్తించామని తెలిపారు. మార్గదర్శకులు వారిని దత్తత తీసుకున్నట్లు వెల్లడించారు.

టిసిఐ లాభాల్లో 17 శాతం వృద్ధి

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26 జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (టిసిఐ) నికర లాభాలు 17 శాతం పెరిగి రూ.107.2 కోట్లకు చేరాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.91.6 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.1,056 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ1లో 9 శాతం పెరిగి రూ.1,150 కోట్లకు చేరింది. గడిచిన త్రైమాసికంలో లాజిస్టిక్ పోర్టుపోలియోలో తమ సంస్థ బలమైన ఆర్థిక ఫలితాలను సాధించగలిగిందని టిసిఐ మేనేజింగ్ డైరెక్టర్ వినీత్ అగర్వాల్ పేర్కొన్నారు.

గవర్నరును ఎందుకు కలిశారు?

- వైఎస్ జగన్‌కు వర్ల రామయ్య ప్రశ్న

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర గవర్నరును మాజీ సిఎం వైఎస్ జగన్ ఎందుకు కలిశారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య ప్రశ్నించారు. టిడిపి కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజకీయ పార్టీ అధ్యక్షులుగా గవర్నరును కలిసి మాట్లాడిన విషయం బయట ప్రపంచానికి ఎందుకు తెలియజేయలేదన్నారు. జగన్ పాలనలో మద్యం తాగి 90,385 మంది కిడ్నీ రోగాలతో, 29,369 మంది కాలేయ సమస్యతో, 12,663 మంది నరాల బలహీనతతో కొట్టుమిట్టాడుతున్నారని తెలిపారు. సిఎం చంద్రబాబును చూసి పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వస్తుంటే.. వైసిపి నేతలకు కడుపుమంటగా ఉందని బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్ విమర్శించారు. సౌకర్యాలు కల్పించి పరిశ్రమలు నెలకొల్పేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే వైసిపి నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు.

గుండెపోటుతో రుయా వైద్యుడు మృతి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

గుండెపోటుతో రుయా వైద్యుడు మృతి చెందిన ఘటన సోమవారం తిరుపతిలో చోటు చేసుకుంది. పేద రోగులకి చికిత్స అందించేందుకు హడావిడిగా వెళుతున్న ఓ ప్రొఫెసర్ ఉన్నపళంగా నడిరోడ్డుపై కుప్పకూలి పడిపోయాడు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గానికి చెందిన డాక్టర్ నరేంద్ర (53) తిరుపతి రుయా ఆసుపత్రి జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ గా పని చేస్తున్నారు. రుయా ఆసుపత్రికి బదిలీపై వచ్చారు. విధి నిర్వహణలో భాగంగా సోమవారం రుయా అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్ ఎదుట నడుచుకుంటూ వెళుతుండగా ప్రొఫెసర్‌కు గుండెపోటు రావడంతో కుప్పకూలి ప్రాణాలు కోల్పోయాడు.

పలు విద్యుత్ ప్రాజెక్టులకు అనుమతి

- ఉత్తర్వులు విడుదల చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులిచ్చింది. అదే విధంగా అదానికి చెందిన రెండు పంప్డ్ హైడ్రో ప్రాజెక్టులను రద్దు చేసింది. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ సోమవారం విడివిడిగా విడుదల చేశారు. కడప జిల్లాలోని సున్నపురాళ్లపల్లెలో 400 మెగావాట్ల సోలార్ ప్లాంటు ఏర్పాటుకు జెఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ కంపెనీకి అనుమతినిచ్చింది. గతంలో సత్యసాయి జిల్లాలోని ముదిగుబ్బలో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేసేందుకు అవసరమైన 2,400 ఎకరాల ప్రభుత్వ భూమి లేకపోవడంతో మరోచోట ఏర్పాటుకు జెఎస్‌డబ్ల్యూ.. రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. ఎపి పునరుత్పాదక విద్యుత్ ఎక్స్‌పోర్ట్ పాలసీ-2020లో ఈ ప్రాజెక్టు కోసం ల్యాండ్ కన్వర్షన్ ఛార్జీలకు ప్రభుత్వం మినహాయింపు ఇవ్వలేదు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన ఎపి ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024 ప్రకారం కన్వర్షన్ ఛార్జీలకు మినహాయింపు ఇచ్చింది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని డోన్ పశ్చిమ ప్రాంతంలో 600 మెగావాట్లు, 300 మెగావాట్ల ప్రాజెక్టులను ఏర్పాటు చేసేందుకు రిన్యూ విక్రమ్‌శక్తి కంపెనీకి అనుమతులకు ఉత్తర్వులు విడుదల చేసింది. విజయనగరం జిల్లాలోని అర్సాడా గ్రామంలో పివిఎస్ గ్రూప్‌కు, శ్రీకాకుళం జిల్లాలోని సంతవురిటి గ్రామంలో పివిఎస్ రామ్మోహన్ ఇండస్ట్రీస్‌కు కంప్రెస్డ్ బయోగ్యాస్ (సిబిజి) ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు అనుమతినిచ్చింది. రాష్ట్రంలో బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టంకు అనుమతులిచ్చింది. పార్వతీపురం మన్యం జిల్లాలో కురుకుట్టి గ్రామంలో 1,200 మెగావాట్లు, కర్రివలస గ్రామంలో 1000 మెగావాట్ల పంప్డ్ హైడ్రో స్టోరేజ్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు అదాని గ్రూప్‌కు ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తూ జిఓ 55 విడుదల చేశారు. ఒడిశా రాష్ట్రంతో నెలకొన్న సరిహద్దు వివాదం నేపథ్యంలో ఈ రెండు ప్రాజెక్టులను రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అదాని గ్రూప్ కోరగా.. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశం దీనిని ఆమోదించింది.

జల విద్యుదుత్పత్తిలో పెరుగుదల

- విద్యుత్ ప్లాంట్ల పనితీరును మెరుగుపరచాలి
- సమీక్షలో సిఎస్ విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జల విద్యుదుత్పత్తిలో 95 శాతం వృద్ధి నమోదైందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఉత్పత్తి కొనసాగించేలా సమర్థవంతమైన ప్రణాళిక, సమయపాలనలో ప్లాంట్ల నిర్వహణ చేయాలని అధికారులను ఆదేశించారు. జెన్‌కో ప్రాజెక్టుల పురోగతి, పనితీరుపై విజయవాడలోని విద్యుత్ సౌధలో సోమవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి విద్యుత్ ఉత్పత్తి కేంద్రం అత్యధికంగా ఉత్పత్తి చేసిన స్థాయిని బెంచ్ మార్కుగా తీసుకోవాలని, అలాంటి రికార్డును కొనసాగించేందుకు కృషి చేయాలని సూచించారు. జెన్‌కో థర్మల్ విద్యుదుత్పత్తిలో 10 శాతం వృద్ధిని నమోదు చేశాయని చెప్పారు. గతేడాది 32,219 మిలియన్ యూనిట్ల (ఎంయు) ఉత్పత్తి సాధించగా, ప్రస్తుతం 35,547 ఎంయులకు చేరిందని తెలిపారు. బొగ్గు నిల్వల నిర్వహణ కీలకమని, ప్లాంటు స్థాయి బొగ్గు సమీక్ష కమిటీ పనితీరు మెరుగుపరచాలని చెప్పారు. సరఫరా పరిమాణం, నాణ్యత, పనితీరు అంశాలపై పర్యవేక్షణ అవసరమని తెలిపారు. పోలవరం, లోయర్ సీలేరులోని 6 పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల కోసం డిపిఆర్‌లు సిద్ధం చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో జెఎమ్‌డి కీర్తి చెకూరి, జెన్‌కో డైరెక్టర్లు పి అశోక్‌కుమార్ రెడ్డి, ఎం సుజయ్ కుమార్, ట్రాన్స్‌కో డైరెక్టర్లు ఎకెవి భాస్కర్, జెవి రావు పాల్గొన్నారు.

'పోలవరం-బనకచర్ల'పై అందిన తెలంగాణ అభ్యంతరాలు

- బేసిన్‌లో రాష్ట్రాలతో చర్చించాకే ముందుకెళ్తాం
- రాజ్యసభలో కేంద్ర జలశక్తిశాఖ సహాయ మంత్రి రాజ్ భూషన్ చౌదరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన 'పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్ట్' విషయంలో తెలంగాణ ప్రభుత్వం నుంచి అభ్యంతరాలు, ఆందోళనలు అందినట్లు కేంద్ర జలశక్తిశాఖ వెల్లడించింది. అయితే.. ఈ విషయంలో గోదావరి బేసిన్‌లోని తెలంగాణతో సహా భాగస్వామ్య రాష్ట్రాలు-అధికారులను సంప్రదించిన తర్వాతే ఈ లింక్ ప్రాజెక్టుకు సంబంధించి సాంకేతిక-ఆర్థిక అంచనాపై ముందుకెళ్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు సోమవారం రాజ్యసభలో ఎంపి అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషన్ చౌదరి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. 'పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్ట్'కు సంబంధించిన సాంకేతిక-ఆర్థిక అంచనాల కోసం ఎపి ప్రభుత్వం కేంద్ర జలశక్తి శాఖను అభ్యర్థించినట్లు తెలిపింది. ఇందులో భాగంగా కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి)కి ప్రిలిమినరీ ప్రీఫిజిబిలిటి రిపోర్ట్ (పిఎఫ్ఆర్)ను అందజేసినట్లు మంత్రి వెల్లడించారు. అయితే.. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి ఎలాంటి పనులను ఇంకా చేపట్టలేదని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం తెలిపినట్లు సమాధానంలో పొందుపరిచారు.

డిగ్రీ కాలేజీలో ప్రవేశాలు కల్పించాలి

- పార్వతీపురం, పాలకొండ, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో పీజీ సెంటర్ ఏర్పాటు చేయాలి
- ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి : ఎస్ఎఫ్ఐ



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - సీతంపేట

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన విద్యార్థులు సీతంపేటలో ర్యాలీ నిర్వహించి మానవహారం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.అనిల్, టి.అఖిల్ మాట్లాడుతూ డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలు కల్పించాలని, పార్వతీపురం, పాలకొండ, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో పీజీ సెంటర్లు ఏర్పాటు చేయాలని, ఫీజు రీయంబర్స్‌మెంట్ వెంటనే విడదలు చేయాలని కోరుతూ ఈనెల 28 నుంచి 29 వరకు మండలాల్లో ధర్నాలు, ఆగస్టు 1నుంచి 4 వరకు కలెక్టరేట్ వద్ద దీక్షలు, ఆగస్టు 5న చలో కలెక్టరేట్ పిలుపునివ్వడం జరిగింది అని చెప్పారు. అలాగే విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని, ఏదైతే పెండింగ్‌లో రూ.ఉన్న 6400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, అలాగే డిగ్రీలో మేజర్, మైనర్ ఆన్సర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యార్థులకు ఫలితాలు విడుదలై నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించకపోవడం అన్యాయమని, వెంటనే డిగ్రీ అడ్మిషన్లు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, ఎఎన్ఎంల పోస్టులను భర్తీ చేయాలని, అలాగే ఖాళీగా ఉన్న సంక్షేమ హాస్టల్లో వార్డెన్లను, వర్కర్లను వెంటనే నియమించాలి, ధరలకు అనుగుణంగా మెస్‌ఛార్జీలు రూ.3000కు పెంచాలని డిమాండ్ చేశారు. బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. అలాగే తల్లికి వందనం, పూర్తి ఫీజు రీయంబర్స్మెంట్ అమలుపై స్పష్టత ఇవ్వాలి ఎస్సీ, బీసీ,పోస్టుమెట్రిక్ హాస్టల్లకు సొంత భవనాలు, గిరిజన పోస్ట్ మెట్రిక్ హాస్టల్లో అదనపు భవనాల నిర్మిం చాలని ఈ ధర్నాలో విద్యార్థులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు రాజేష్, అభి, సుమంత్, విద్యార్థులు పాల్గొన్నారు

సీతానగరం : మండల కేంద్రంలో బాలురకు, బాలికలకు కళాశాల హాస్టల్ వేరేగా ఏర్పాటు చేయాలని, మిగిలిన విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కోశాధికారి కె.డేవిడ్ డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, వార్డెన్ల పోస్టులను భర్తీ చేయాలని, ఇతర విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు దిలీప్, కళాశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


బారులు తీరిన రైతులు

యూరియా కోసం క్యూకట్టిన రైతులు

ప్రజాశక్తి - వీరఘట్టం

యూరియా కోసం రైతులు క్యూ కట్టారు. పంపిణీ జరిగినచోట ఎటువంటి అవాంఛనీయ ఘటన జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యలుగా పోలీస్ ఆధ్వర్యంలో సజావుగా యూరియా పంపిణీ చేసిశారు. ఈ మేరకు మండల వ్యవసాయాధికారి జక్కువ సౌజన్య మాట్లాడుతూ స్థానిక మార్కెట్ యార్డులోనే సోమవారం 20 మెట్రిక్ టన్నుల యూరియాను పంపిణీ చేసినట్లు తెలిపారు. మండల కేంద్రంలోని నాలుగు రైతు సేవా కేంద్రాల పరిధిలో గల రైతులకు యూరియా పంపిణీ చేసినట్లు తెలిపారు.

సాగునీందక రైతుల ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

వారం రోజుల క్రితం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పెదంకలాం ప్రాజెక్టు నుంచి సాగునీటిని విడుదల చేశారు. సుమారు 12 గ్రామాలకు సంబంధించిన 8వేల ఎకరాల ఆయకట్టుకు ఈ ప్రాజెక్టు ద్వారా నీటిని ఆయన విడుదల చేశారు. అయితే నేటికీ ఆయకట్టు భూములకు దరికి సాగునీరు చేరలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. రెండు, మూడు రోజుల్లో ఉబాలకు వెళ్లాల్సిన తరుణంలో సాగునీరు లేకపోవడంతో రైతులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, రైతు సంఘం నాయకులు గేదెల సత్యనారాయణ, బంటు దాసు, రైతు కూలీ సంఘం నాయకులు ఎం.సింహాద్రి నాయుడు, జనసేన నాయకులు పైల ప్రసాదరావు ఆధ్వర్యాన ఆయకట్టు రైతులు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ పెదంకలాం ప్రాజెక్టు ద్వారా నిర్వహణ లోపభూయిష్టంగా వుండడం, గ్రోయిన్, షట్టర్లు పాడైనా మరమ్మతు, కాలువల్లో పూడికతీత పనులు చేయక పోవడంతో నీరు ఆయకట్టు భూములకు చేరలేదన్నారు. నిధులు ఖర్చు చేసినట్లు అధికారులు చూపుతున్నా పనులు జరగలేదని విమర్శించారు. సింహాద్రి నాయుడు మాట్లాడుతూ ప్రాజెక్టు ఆధునీకరణకు మంజూరైన జైకా నిధులు దుర్వినియోగమయ్యాయని, పనులు జరగకపోవడంతో ఆయకట్టు భూములకు సాగునీరుందే పరిస్థితి లేదని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అక్కడే ఉన్న పెదంకలాం ప్రాజెక్టు డిఇ పి.నారాయణను రైతులతో మాట్లాడాలని కలెక్టర్ పంపించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి డిఇ మాట్లాడుతూ ప్రాజెక్టు నుంచి పదమాయవలస వరకు నీరు చేరిందని, మిగిలిన గ్రామాలకు నీరందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు డిఇ చుట్టుముట్టి నిలదీశారు. కాలువల్లో పూడికతీత పనులు చేయకుండా నీరు ఎలా చేరుతుందని రైతులు ప్రశ్నించారు. దీంతో డిఇ నీళ్లు నమిలారు. రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక మౌనం వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతుల ఆందోళనపై నారాయణ మాట్లాడుతూ 2020లో పెదంకలాం ప్రాజెక్టు ఆధునీకరణకు రూ.14 కోట్లు జైకా నిధులు మంజూరయ్యాయని, ఇంతవరకు 5శాతం పనులు జరిగాయని చెప్పారు.


అధ్యక్షులు వెంకటయ్య


కార్యదర్శి దయాకర్

వడ్డెర రాష్ట్ర అధ్యక్షులుగా వెంకటయ్య

- నూతనంగా ఎన్నికైన కమిటీ
- ముగిసిన మహాసభ

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా చల్లా వెంకటయ్య, గుంజి దయాకర్ ఎన్నికయ్యారు. రెండు రోజుల పాటు నగరంలోని సుంద రరామిరెడ్డి ఆడిటోరియంలో నిర్వహించిన ప్రథమ రాష్ట్ర మహాసభ సోమవారం ముగిసింది. అంతకుముందు కార్యదర్శి నివేదికను గుంజి దయాకర్ ప్రవేశపెట్టారు. ఈ నివేదికపై అన్ని జిల్లాల నుంచి వచ్చిన 150 మంది ప్రతినిధులు చర్చించి, ఆమోదించారు. ఎస్‌సి, ఎస్‌టిల మాదిరిగా వడ్డెర్లకు సామాజిక రక్షణ చట్టం చేయాలని, ప్రతి వడ్డెర కుటుంబానికి ఇళ్ల స్థలాలు ఇచ్చి పక్కా ఇల్లు నిర్మించాలని, రెండు ఎకరాల సాగు భూమి ఇవ్వడం ద్వారా వలసలను అరికట్టాలని, 50 సంవత్సరాలు నిండిన వారికి పెన్షన్ ఇవ్వాలని ప్రతినిధుల సభ తీర్మానించింది. క్వారీలు, గ్రావెల్, ఎర్రమట్టి కొండలపైన 50 శాతం హక్కు కల్పించాలని, క్వారీలలో పనిచేస్తున్న వృత్తిదారులకు సీనరేజ్ ఛార్జీలు మినహాయించాలని, వడ్డెర సొసైటీలకు కాంట్రాక్ట్ వర్కులు ఇఎండి లేకుండా అనుమతించాలని, 20 శాతం వర్కులను వడ్డెర సొసైటీలకు ఇచ్చి వడ్డెర యువతకు జీవనోపాధి కల్పించాలని, వడ్డెర కార్పొరేషన్ బడ్జెట్‌లో రూ. 1000 కోట్లు నిధులు కేటాయించి విధి విధానాలు ప్రకటించి ఆ నిధులను వడ్డెరుల సంక్షేమానికి ఖర్చు చేయాలని తీర్మానించింది.

నూతన కమిటీ ఎన్నిక

ఆంధ్రప్రదేశ్ వడ్డెర వృత్తిదారుల సంఘం కోశాధికారిగా చంద్రగిరి శివ నాగమల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బెల్లంకొండ బాల వెంకటేశ్వర్లు, మోహన్, సహాయ కార్యదర్శిగా తన్నీరు శ్రీరాములు, డేరంగుల పద్మనాభ రాజు ఎన్నుకోబడ్డారు. కమిటీ సభ్యులుగా కోటకొండ వెంకటేష్ , బత్తుల రత్నయ్య, మళ్లీ నాగార్జున్ తమ్మిశెట్టి, నాగ గండికోట శంకర్, విరగదండ్ల రమణ, బత్తుల గంగయ్య ఎంపికయ్యారు.

ఎపి మిథున్‌రెడ్డిని కలిసిన తల్లి స్వర్ణలత

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

లిక్కర్ స్కాములో అరెస్టయి రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న వైసిపి ఎంపి మిథున్‌రెడ్డితో ఆయన తల్లి స్వర్ణలత సోమవారం ములాఖత్ అయ్యారు. కుటుంబ సభ్యులతో కలిసి నగరానికి వచ్చిన ఆమె జైలులో ఉన్న తన తనయుడ్ని చూసి తీవ్ర భావోద్వేగాలకు లోనయ్యారు. ములాఖత్ అనంతరం బయటకు వచ్చి మీడియాతో మాట్లాడారు. తన కుమారుడి పరిస్థితి వివరిస్తూ కంటతడిపెట్టారు. జైలులో తన బిడ్డకు తగిన సౌకర్యాలు కల్పించడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన కుమారుడు ఉగ్రవాదా? అంటూ ఆక్రోశించారు.

రాజీలేని పోరాట యోధుడు

- అచ్యుతానందన్‌కు సిపిఎం అండమాన్, నికోబార్ కమిటీ ఘన నివాళి

పోర్ట్ బ్లెయిర్ : సిపిఎం సీనియర్ నాయకులు, కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్‌కు పార్టీ అండమాన్, నికోబార్ శాఖ ఆర్గనైజింగ్ కమిటీ ఘనంగా నివాళు ర్పించింది. పోర్ట్‌బ్లెయిర్ అనార్కలిలోని షహీద్ భవన్‌లోని సిపిఎం రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన అచ్యుతానందన్ సంతాప సభకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి డి అయ్యప్పన్ అధ్యక్షత వహించారు. సంతాప తీర్మానాన్ని చదివి వినిపించారు. అచ్యుతానందన్ రాజీలేని పోరాట యోధుడు అని, సమాజంలోని అన్ని రకాల అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారని చెప్పారు. అణగారిన వర్గాల కోసం పోరాడిన విజేతగా గుర్తుండిపోతారని చెప్పారు. రాష్ట్ర మాజీ కార్యదర్శి కెజి దాస్ మాట్లాడుతూ ఎనిమిది దశాబ్దాలుగా అచ్యుతానందన్ నిర్వహించిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి లక్ష్మణ్‌రావు, బి.చంద్రచూడన్, డాక్టర్ గౌరంగ మార్ఖీ ప్రసంగించారు. ఈ సమావేశానికి పోర్ట్‌బ్లెయిర్‌లోని పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు హాజరయ్యారు.



నిమిష ప్రియ ఉరిశిక్ష రద్దు

తిరువనంతపురం : కేరళ నర్సు నిమిషప్రియ మరణ శిక్షను యెమెన్ ప్రభుత్వం రద్దు చేసింది. సోమవారం అర్ధరాత్రి ఈ నిర్ణయం వెలువడింది. భారత గ్రాండ్ ముఫ్తీ, సున్నీ లీడర్ అబూబకర్ ముస్లియార్ కార్యాలయం ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. యెమెన్‌లోని సూఫీ మత పెద్ద షేక్ హబీబ్ ఓమర్ బిన్ హఫీజ్ నేతృత్వంలో బృందాన్ని చర్చల కోసం నియమించారు. అబుబాకర్ ముస్లియార్ ఉత్తర యెమెన్ ప్రభుత్వంతోపాటు అంతర్జాతీయంగా మధ్యవర్తిత్వం జరిపారు. చర్చలు ఫలించడంతో ఆమె ఉరిశిక్ష రద్దుకు యెమెన్ అంగీకరించింది. అబుబాకర్ ప్రకటనను యెమెన్‌లోని యాక్షన్ కౌన్సిల్ ఫర్ తలాల్ మహదీస్ జస్టిస్ ప్రతినిధి సర్హాన్ షంశాన్ అల్ విశ్వాబి ధ్రువీకరించారు. మత పెద్దల చొరవతోనే నిమిష ప్రియ ఉరిశిక్ష రద్దు అయినట్లు పేర్కొన్నారు. నిమిష ప్రియ జైలు నుంచి విడుదలవుతారా, లేక జీవిత ఖైదుగా శిక్షను మార్పు చేస్తారా అనే విషయం తెలియదని వివరించారు. మరణించిన తలాల్ అబ్దో మహదీ కుటుంబ సభ్యులతో చర్చల అనంతరం తదుపరి నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. హత్య కేసులో నిమిష ప్రియకు యెమెన్ కోర్టు ఉరిశిక్ష విధించిన సంగతి తెలిసిందే.

'సృష్టి' ఆస్పత్రికి తాళాలు

- అందుబాటులోలేని వైద్య సిబ్బంది
- రికార్డులు మాయం
- విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం : డిఎం అండ్ హెచ్‌ఒ

ప్రజాశక్తి- విజయవాడ అర్బన్

హైదరాబాద్‌లోని సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ (ఆస్పత్రి)పై పోలీసుల విచారణ సాగుతున్న నేపథ్యంలో విజయవాడలో యూనివర్సల్ సృష్టి సంతాన సాఫల్య కేంద్రం పేరుతో నడుస్తోన్న ఆస్పత్రికి సిబ్బంది తాళాలు వేసి అందుబాటులో లేకుండా పోయారు. పోలీసులు వచ్చిన సమయంలో ఆస్పత్రి గేటుకు తాళాలు వేసి ఉండడంతో బయట నుండి చూసి వెళ్లిపోయారు. ఈ కేంద్రాన్ని ఎన్‌టిఆర్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని సోమవారం పరిశీలించారు. ఆస్పత్రి గేటుకు తాళాలు వేసి ఉండడంతో సిబ్బందికి ఫోన్ చేశారు. కిషోర్ అనే వ్యక్తి వచ్చి తాళాలు తీశారు. అయితే, ఆస్పత్రిలో రికార్డులు లేవు. యూనివర్సల్ పేరుతో ఆస్పత్రిని నడుపుతున్నారని, సృష్టితో సంబంధం లేదని సిబ్బంది చెబుతున్నారు. అయితే, సష్టి పేరుతో ఉన్న రికార్డులను ఎందుకు మాయం చేశారని, ఆస్పత్రికి ఎందుకు తాళాలు వేశారని సిబ్బందిని డిఎం అండ్ హెచ్‌ఒ సుహాసిని ప్రశ్నించారు. యూనివర్సల్ సృష్టి పేరుతో నడుస్తున్న ఆస్పత్రిపై తమకు ఫిర్యాదులు రాలేదని ఆమె తెలిపారు. అయితే, ఆస్పత్రికి తాళాలు వేయడం, రికార్డులు మాయం చేయడంపై సమగ్ర విచారణ జరిపి కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని చెప్పారు. తమ విచారణలో అక్రమాలు జరిగాయని తెలిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



విజయవాడ బెంజిసర్కిల్‌లో 'యూనివర్సల్ సృష్టి' ఆస్పత్రిని పరిశీలిస్తున్న డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎం.సుహాసిని

పేరే వేరు... అంతా 'సృష్టి'

ఐదేళ్ల క్రితం సృష్టి పేరుతోనే నిర్వహించిన కేంద్రాన్నే యూనివర్సల్ సృష్టి అంటూ బోర్డు మార్చారు. అయితే, గతంలో సృష్టి పేరుతో ఉన్న సిబ్బందే వ్యవహారం అంతా నడిపిస్తున్నారు. ఆ కేంద్రం వైద్యులు డాక్టర్ నమ్రతపై నిషేధం ఉండటంతోపాటు పలు ఆరోపణలూ ఉన్నాయి. దీంతో, ప్రస్తుతం విజయవాడ సెంటర్‌ను డాక్టర్ కరుణ, వైశాలి పేరుతో నడుపుతున్నారు. వీరిద్దరూ కూడా ప్రస్తుతం అందుబాటులో లేదు. విజయవాడ సూర్యారావుపేటలో సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ పేరుతో ఆస్పత్రి ఉండేది. దీనిపై అనేక ఆరోపణలు రావడంతో అప్పట్లోనే వైద్యురాలు నమ్రతపై కేసు కూడా నమోదైంది.

కొంతకాలం తర్వాత మళ్లీ విజయవాడ బెంజిసర్కిల్ రామచంద్రనగర్ కంచుకోట వీధిలో యూనివర్సల్ సృష్టి సంతాన సాఫల్య కేంద్రాన్ని ప్రారంభించారు. వాస్తవానికి రిజిస్ట్రేషన్ యూనివర్సల్ పేరు ఉన్నా కార్యకలాపాలన్నీ సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ పేరుతోనే డాక్టర్ నమ్రత ఆధ్వర్యంలో నడుస్తున్నాయి.

క్షమాపణ చెప్పేదేలే!

- పాలస్తీనా ఉద్యమనేత అబ్దుల్లా గుండెనిబ్బరం
- 40 ఏళ్ల తర్వాత జైలు నుంచి విడుదల
- ప్రజా ఉద్యమాలకు తలొంచిన అమెరికా, ఇజ్రాయిల్, ఫ్రాన్స్ దేశాలు

ప్రజాశక్తి - హైదరాబాద్‌బ్యూరో

"మీకు క్షమాపణ చెప్పి రాజకీయ ఆత్మహత్యాసదృశ్యమైన విడుదల కోసం ఎన్నటికీ అంగీకరించే ప్రసక్తే లేదు. అలాచేసి నా పాలస్తీనా జాతికి కళంకం తేలేను. క్షమాపణలతో విడుదల అయ్యే కంటే, శేష జీవితాన్ని జైల్లో గడపడాన్నే పాలస్తీనా జాతి ఆత్మ గౌరవ పరిరక్షణగా భావిస్తాను" అని రొమ్ము విరుచుకొని ధైర్యంగా నిలబడిన పాలస్తీనా ఉద్యమ విప్లవ నేత జార్జెస్ ఇబ్రహీం అబ్దుల్లా 40 ఏళ్ల తర్వాత బేషరతుగా జైలు నుంచి విడుదల అయ్యారు. ఆయన్ని కారాగారంలోనే బంధించాలని అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఎన్ని కుట్రలు పన్నినా, ఫ్రాన్స్‌పై ఎన్ని వత్తిళ్లు తెచ్చినా, అవన్నీ ప్రజాందోళనల ముందు నిలువలేకపోయాయి. ఆయన విడుదల అంతర్జాతీయంగా పాలస్తీనా సంఘీభావ ఉద్యమ చరిత్రలో ఓ ప్రేరణాత్మక సంఘటనగా నిలిచింది.

ఇదీ నేపథ్యం


జార్జెస్ ఇబ్రహీం అబ్దుల్లా ... లెబనాన్‌లో పాఠశాల టీచర్‌గా ఉద్యోగం చేస్తూ 1970లో కమ్యూనిస్టు సిద్ధాంతానికి ప్రభావితుడై పాలస్తీనా జాతీయ విమోచనా పోరాటంలో భాగస్వామి అయ్యారు. ఉద్యోగానికి రాజీనామా చేసి, ఉద్యమానికి జీవితాన్ని అంకితం చేశారు. పాలస్తీనాలో అమెరికా అండతో ఇజ్రాయిల్ చేస్తున్న మారణకాండను సాయుధపోరాటం ద్వారా ఎదిరించారు. దీనితో అరబ్ సమాజంలో గొప్ప ప్రజాదరణ కలిగిన నేతగా గుర్తింపు పొందారు. 1982లో అమెరికా, ఇజ్రాయిల్ దౌత్యవేత్తల హత్యలు జరిగాయి. ఈ కేసులో 1984లో అరెస్టు అయ్యారు. 1987లో ఫ్రాన్స్ కోర్టు జైలుశిక్ష విధించింది.

ఫ్రాన్స్‌పై అమెరికా, ఇజ్రాయిల్ ఒత్తిళ్లు

ఫ్రాన్స్ న్యాయసూత్రాల ప్రకారం పాతికేళ్లు జైలు జీవితం గడిపాక, విడుదల కోసం పిటిషన్ దాఖలు చేసే అర్హత లభిస్తుంది. ఇలాంటి పిటీషన్లు 11 సార్లు దాఖలయ్యాయి. అబ్దుల్లాను విడుదల చేయొద్దని ఫ్రాన్స్ సర్కార్‌పై అమెరికా, ఇజ్రాయెల్ ఒత్తిళ్లు తెచ్చాయి.

మిన్నంటిన నిరసనలు

ఫ్రాన్స్‌లో అబ్దుల్లా విముక్తి కోసం ప్రజాందోళనలు మిన్నంటాయి. అరబ్ దేశాల్లోను నిరసనలు హోరెత్తాయి. లెబనాన్‌లో ఆందోళనలు పతాకస్థాయికి చేరాయి. దీనితో ఫ్రాన్స్ పునరాలోచనలో పడక తప్పలేదు. ఈ సమయంలో కూడా అబ్దుల్లా క్షమాపణలు చెప్తే, జైలు నుంచి విడుదల చేస్తామని ప్రకటించాలని అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఫ్రాన్స్‌ను కట్టడి చేసే ప్రయత్నం చేశాయి. క్షమాపణలు చెప్పేందుకు అబ్దుల్లా నిరాకరించారు. చనిపోయేదాకా జైల్లోనే ఉంటాను తప్ప, తలొంచేది లేదని తెగేసి చెప్పారు. దీతో చట్టానికి వ్యతిరేకంగా అబ్దుల్లాను ఇంకా జైలులోనే నిర్బంధిస్తే, పరిస్థితులు చేయిదాటతాయని భావించిన



ఫ్రాన్స్‌లోని ప్యారిస్ కోర్టు ఎట్టకేలకు అబ్దుల్లాను విడుదల చేస్తున్నట్టు ప్రకటించింది. ఆయన లెబనాన్‌కే వెళ్లాలనీ, జీవితకాలంలో తిరిగి ఫ్రాన్స్‌కు రావద్దనే షరతును కోర్టు విధించింది.

ఇజ్రాయిల్‌పై ఇరాన్ ప్రతిఘటన తర్వాత మారిన పరిస్థితులు

అబ్దుల్లా విడుదల కోసం ఫ్రాన్స్‌లో ఆయన్ని బంధించిన జైలు ఎదుట భారీ ఆందోళనలు జరిగాయి. గాజా విధ్వంసం తర్వాత ఈ ఆందోళనలు మరింత ముమ్మరం అయ్యాయి. ఇప్పటివరకు తిరుగులేని సైనిక రాజ్యంగా చెప్పుకొనే ఇజ్రాయిల్‌కు ఇరాన్ యుద్ధం ద్వారా గట్టిగా బుద్ధి చెప్పడంతో వెస్ట్ ఆసియా రాజకీయ వాతావరణం పూర్తిగా మారిపోయింది. అరబ్ ప్రపంచంలో కొత్త ఉత్సాహం వెల్లువెత్తింది. అది అబ్దుల్లా విడుదల కోసం జరిగే ఆందోళనలకి మరింత బలాన్ని ఇచ్చింది. యుద్ధోన్మాద దేశాలకు గుబులు పుట్టించింది.

అబ్దుల్లాకు ఘనస్వాగతం

అబ్దుల్లా ఈ నెల 25న జైలు నుంచి విడుదల అయ్యారు. ఈ సందర్భంగా ఫ్రాన్స్‌లో పాలస్తీనా సంఘీభావ బృందాలు ఆయనకు ఘనంగా స్వాగత ఏర్పాట్లు చేశాయి. 40 ఏళ్ల తర్వాత అబ్దుల్లా తిరిగి తన మాతృదేశంలోకి అడుగుపెట్టారు. యువకుడిగా ఉన్నప్పుడు జైలుకు వెళ్లిన అబ్దుల్లా వయసు ఇప్పుడు 74 ఏళ్లు. ఇప్పటికీ ఆయన అదే ఉక్కు సంకల్పంతో ఉన్నారు.

ఎఐతో ముప్పు ఎక్కువే..

- తక్కువ చేసి చూపిస్తున్న టెక్ కంపెనీలు
- పొంచి ఉన్న దుర్వినియోగ ప్రమాదాలు
- ఎఐ పితామహుడు జెఫ్రీ హింటన్



న్యూఢిల్లీ : కృత్రిమ మేధా (ఎఐ) ముప్పు ఎక్కువేనని ఎఐ పితామహుడు జెఫ్రీ హింటన్ అన్నారు. దీన్ని టెక్ దిగ్గజాలు తక్కువగా చేసి చూపుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఎఐతో తలెత్తే ప్రమాదాలను టెక్నాలజీ కంపెనీలు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కీలక శాస్త్రవేత్తలు ఎఐ ముప్పును తక్కువ చేసి చూపిస్తున్నారని అభిప్రాయపడ్డారు. డీప్‌మైండ్ సంస్థ సిఇఒ డెమిస్ హస్సాబిస్ వంటివారు ఈ ముప్పును అర్థం చేసుకొని, దానిని ఎదుర్కొనేందుకు పని చేయాలనుకుంటున్నారన్నారు. తొలినాళ్లలో ఈ ప్రమాదాన్ని గుర్తించనందుకు తాను బాధపడుతున్నానని తెలిపారు. ఎఐ వల్ల ఉద్యోగాలు కోల్పోవడం కంటే దాని దుర్వినియోగమే అత్యంత ప్రమాదకరమని హస్సాబిస్ అన్నారు. ఒకవేళ అలా జరిగితే వినాశకర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అలాంటి వారికి వీటి యాక్సెస్‌ను పరిమితం చేయాలని హస్సాబిస్ సూచించారు.

గూగుల్‌లో దశాబ్దం పాటు సేవలు అందించి 2023లో హింటన్ ఆ సంస్థను వీడారు. ఎఐని విస్తృతంగా వినియోగంలోకి తీసుకురావడానికి గూగుల్ చేస్తోన్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఆయన వెళ్లిపోయారని వచ్చిన ఆరోపణలు కొట్టిపారేశారు. అప్పటికి తన వయసు 75 ఏళ్లకు చేరడంతో ఆశించినమేర పని చేయలేకపోవడం వల్లే ఆ సంస్థ నుంచి బయటికి వచ్చానన్నారు. కాగా.. తాను ఎఐ ముప్పు గురించి ఇప్పుడు స్వేచ్ఛగా మాట్లాడగలనని అన్నారు. ఆర్టిఫీషియల్ న్యూరల్ నెట్‌వర్క్స్‌లో చేసిన కృషికి గానూ హింటన్‌కు 2024లో ఫిజిక్స్ విభాగంలో నోబెల్ వరించింది. ఆ రంగంలో దశాబ్దకాలం పాటు ఆయన చేసిన కృషి ఫలితమే ఇప్పుడు ఏఐ విప్లవానికి దోహదం చేసింది. ఇటీవల ఎఐ వల్ల అనేక టెక్ కంపెనీలు వేలాది మంది ఉద్యోగులపై వేటు వేస్తున్నాయి. భవిష్యత్తులో ఇది మరింత ప్రమాదకరంగా ఉండొచ్చనే ఆందోళనలు నెలకొన్న విషయం తెలిసిందే.

పోలీసు కాల్పుల్లో మరణించిన యువకుడి కుటుంబానికి ఒమర్ అబ్దుల్లా పరామర్శ

- ఎన్‌కౌంటర్‌పై విచారణకు డిమాండ్

జమ్మూ : ఇటీవల పోలీసు కాల్పుల్లో మరణించిన గుజ్జర్ యువకుడు కుటుంబాన్ని జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సోమవారం పరామర్శించారు. కాల్పుల ఘటనపై దర్యాప్తు నిర్వహించాలని డిమాండ్ చేశారు. యువకుడి కుటుంబాన్ని పరామర్శించడం కోసం శ్రీనగర్ నుంచి జమ్మూకు నేరుగా విమానంలో ఒమర్ చేరుకున్నారు. ముఖ్యమంత్రి వెంట మంత్రి జావేద్ రాణా, సలహాదారు నాసిర్ అస్లాం వాని కూడా ఉన్నారు. ముఖ్యమంత్రి పర్యటన గురించి నేషనల్ కాన్ఫరెన్స్ ప్రావిన్షియల్ కార్యదర్శి షేక్ బషీర్ అహ్మద్ విలేకరులకు వివరించారు. 'జమ్మూకాశ్మీర్‌లో పోలీసు వ్యవహారాలను పర్యవేక్షించే లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వైపు ప్రజలు చూస్తున్నారు' అని అన్నారు. ఈ నెల 24న జమ్మూలోని నిక్కీ తావి ప్రాంతానికి చెందిన 21 ఏళ్ల పర్వేజ్ అహ్మద్ పోలీసు కాల్పుల్లో మరణించాడు. ఇసుక పనులు చేసుకునే పర్వేజ్‌ను డ్రగ్స్ వ్యాపారిగా భావించి సత్వారీ ప్రాంతంలో పోలీసులు కాల్చిచంపారు. మందులు కొనుగోలు కోసం బయటకు వచ్చిన పర్వేజ్ తిరిగి ఇంటికి వెళ్లనేలేదు. జమ్మూలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో పర్వేజ్ మృతదేహాన్ని గుర్తించడానికి కుటుంబ సభ్యులను పోలీసులు పిలవడంతో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. పర్వేజ్‌కు రెండు నెలల క్రితమే వివాహమైంది. ఈ ఘటనపై జమ్మూకాశ్మీర్ వ్యాప్తంగా నిరసన వ్యక్తమవుతోంది. బాధిత కుటుంబాన్ని ఆదివారం జమ్మూకాశ్మీర్ ఉపముఖ్యమంత్రి సురీందర్ చౌదరి పరామర్శించారు. ఎన్‌కౌంటర్ ఘటనపై నిష్పాక్షికంగా విచారణ జరపాలని డిమాండ్ చేశారు.



హత్యకు గురైన కవిన్ సెల్వగణేష్ తల్లిని ఓదారుస్తున్న బంధువులు, (ఇన్‌సెట్‌లో కవిన్)

తమిళనాడులో కులదురహంకార హత్య

- దళిత యువకుడిని హత్య చేసిన యువతి సోదరుడు

మధురై : తమిళనాడు తిరునెల్వేలిలో ఓ దళిత యువకుడు కులదురహంకారానికి బలయ్యాడు. నగరంలోని కెటిసి నగర్‌లో 27 ఏళ్ల కవిన్ సెల్వగణేష్‌ను ఆదివారం దారుణంగా హత్య చేశారు. చెన్నైలో ఒక ప్రముఖ టెక్ సంస్థలో పని చేస్తున్న కవిన్ గత కొన్నేళ్ల నుంచి ఇష్టపడుతున్న ఒక యువతిని వివాహం చేసుకోవడానికి ఆసక్తి చూపడంతో ఆమె సోదరుడు సూర్జిత్ కవిన్‌పై దాడి చేసి దారుణంగా హత్య చేశాడు.

కవిన్ చాలా తెలివైన విద్యార్థి అని, తాను మంచి మార్కులు తెచ్చుకోవడమేకాకుండా, ఇతర విద్యార్థులకు ముఖ్యంగా గణితం, సైన్స్‌ల్లో కవిన్ సహాయం చేసేవాడని అతనికి పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు తెలిపారు. ఇంజనీరింగ్ కోర్సు పూర్తి చేసిన తరువాత టెక్ సంస్థలో ఉద్యోగం సంపాదించుకున్నాడని చెప్పారు. కవిన్ తల్లి తూత్తుకుడిలోని పంచాయితీ యూనియన్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. తండ్రి ఒక వ్యవసాయ కార్మికుడు. కవిన్ తమ్ముడు, 25 ఏళ్ల ప్రవీణ్ కూడా ఒక ప్రముఖ టెక్ సంస్థలో ఉద్యోగం నిర్వహిస్తున్నాడు. కవిన్ హత్యపై పోలీసులు ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. యువతి తల్లిదండ్రులు పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్లుగా పని చేస్తుండటంతో సిబిఐకి కేసు బదిలీ చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

2017 నుంచి 65 కులదురహంకార హత్యలు!

కవిన్ హత్యపై మధురైకు చెందిన ఎవిడెన్స్ అనే ఎన్‌జిఒకు చెందిన ఎ.కతిర్ మాట్లాడుతూ కులదురహంకార హత్యలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సి) ప్రయత్నాలు చేయాలని తెలిపారు. తమిళనాడులో 2017 నుంచి ఇప్పటి వరకూ 65 కులదురహంకార హత్యలు జరిగాయని చెప్పారు. ప్రభుత్వం మాత్రం 2015 నుంచి 2021 వరకూ మూడు హత్యలే జరిగాయని చెబుతోందని విమర్శించారు. తాము ప్రతి కేసును నమోదు చేసినట్లు చెప్పారు.

బీహార్‌లో 65 లక్షల ఓట్లు గల్లంతు

- పత్రాలు సమర్పించిన 91.6 శాతం ఓటర్లు
- వెల్లడించిన ఇసి
- ప్రతిపక్షాల ఆగ్రహం
- సవరణ ప్రక్రియను ఆపాలని డిమాండ్

న్యూఢిల్లీ : అనుకున్నంతా అయింది. ప్రతిపక్షాల ఆరోపణలు వాస్తవమేనని తేలింది. బీహార్‌లో ఓ పథకం ప్రకారం పెద్ద ఎత్తున ఓటర్లను తొలగించేందుకే ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను చేపట్టారంటూ వస్తున్న విమర్శలకు ఊతమిస్తూ ఆ రాష్ట్రంలోని 65 లక్షల మంది ఓటర్ల ఓటు హక్కును తొలగిస్తున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది. గడువు ముగిసే సమయానికి 91.6 శాతం మంది ఓటర్లు తమ ఎన్యూమరేషన్ పత్రాలు సమర్పించారని తెలిపింది. రాష్ట్రంలో 7.8 కోట్ల మంది ఓటర్లు ఉండగా వారిలో 7.2 కోట్ల మంది అవసరమైన పత్రాలు అందజేశారని చెప్పింది. దీంతో జూలై జాబితాలలో పేరున్న 65 లక్షల మంది ఓటర్లను ఆగస్ట్ 1న ప్రచురించే ముసాయిదా జాబితాల నుంచి తొలగిస్తామని స్పష్టం చేసింది. 2.8 శాతం ఓటర్లు (22 లక్షలు) చనిపోయారని, 4.5 శాతం ఓటర్లు (26 లక్షలు) శాశ్వతంగా వెళ్లిపోయారని, 0.8 శాతం ఓటర్ల (ఏడు లక్షలు) పేర్లు ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదై ఉన్నదని తెలియజేసింది.

ఇసి ఏమంటోంది?

ఓటర్లు అందజేసిన పత్రాలను ఎలక్టొరల్ రిజిస్ట్రేషన్ అధికారులు లేదా అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు పరిశీలించాల్సి ఉంది. ఈ పని ఆగస్ట్ 1వ తేదీతో పూర్తయిన తర్వాత 65 లక్షల మంది ఓటర్ల వాస్తవ పరిస్థితి ఏమిటన్నది తెలుస్తుందని ఇసి ఒక ప్రకటనలో పేర్కొంది. ఆగస్ట్ 1 నుంచి సెప్టెంబర్ 1వ తేదీ వరకూ క్లెయిములు, అభ్యంతరాలు స్వీకరిస్తామని, ఆ సమయంలో నిజమైన ఓటర్లు తిరిగి ఎన్నికల జాబితాలో పేర్లు నమోదు చేసుకోవచ్చునని తెలిపింది. బీహార్ నుంచి వలస వెళ్లిన కార్మికులను ఓటర్ల జాబితాల నుంచి తొలగించబోమని, ఇప్పటికే 246 వార్తా పత్రికలలో హిందీలో ప్రకటనలు ఇచ్చామని, వలసదారులను గుర్తించాలంటూ అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కోరామని వివరించింది. 16 లక్షల మంది వలస కార్మికులు ఆన్‌లైన్‌లో ఎన్యూమరేషన్ పత్రాలు పూర్తి చేశారని, 13 లక్షల మంది పత్రాలను డౌన్‌లోడ్ చేసుకున్నారని చెప్పింది.

ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేసుకునేందుకు అర్హులైన వారికి నెల రోజుల సమయం ఇస్తున్నామని, అలాంటప్పుడు ఆందోళన చెందాల్సిన అవసరం ఏముందని ఎన్నికల కమిషన్ ప్రశ్నించింది. అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్లను (బిఎల్ఎలు) నియమించుకున్నాయని, వాస్తవానికి వారి సంఖ్య 16 శాతం పెరిగిందని తెలిపింది.

ఈ నిబంధనలు పూర్తి చేస్తేనే ఓటు

బీహార్‌లో ఎన్నికల జాబితాల సవరణపై ఇసి జూన్ 24న ప్రకటన జారీ చేసింది. దీని ప్రకారం 2003 జాబితాలో పేరు లేని వారు తమ అర్హతకు సంబంధించిన రుజువును సమర్పించాల్సి ఉంటుంది. 1987 జూలై 1వ తేదీకి ముందు జన్మించిన వారు తాము పుట్టిన ప్రదేశం, తేదీకి సంబంధించిన రుజువు చూపాలి. 1987 జూలై 1, 2004 డిసెంబర్ 2 తేదీల మధ్య జన్మించిన వారు తమ తల్లిదండ్రులలో ఒకరి జన్మస్థలాన్ని, తేదీని కూడా అందజేయాలి. 2004 డిసెంబర్ 2వ తేదీ తర్వాత పుట్టిన వారు తమ పుట్టిన తేదీతో పాటు తల్లిదండ్రులు ఇద్దరి పుట్టిన తేదీలకు సంబంధించి రుజువులు చూపాల్సి ఉంటుంది. అందజేసిన వివరాలతో అధికారులు సంతృప్తి చెందితే కొత్త ఓటరు జాబితాలో వారి పేర్లను తిరిగి చేరుస్తారు. లేకుంటే తొలగిస్తారు. ఆగస్ట్ 1న ముసాయిదా ఓటర్ల జాబితాను, సెప్టెంబర్ 30న తుది జాబితాను ప్రచురిస్తారు. అక్టోబర్ లేదా నవంబరులో బీహార్ శాసనసభకు ఎన్నికలు జరుగుతాయి.



బీహార్‌లోని అరరియా జిల్లాలో జోగ్‌భని వద్ద ఎస్ఐఆర్ నిర్వహిస్తున్న బూత్ లెవల్ అధికారి

ఏం జరిగింది?

గడువులోగా సంబంధిత పత్రాలు సమర్పించలేని ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తే వారు పెద్ద సంఖ్యలో ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉన్నదంటూ ఈ నెల 2వ తేదీన ఇండియా వేదికలోని 11 పార్టీల ప్రతినిధులు ఇసికి విన్నవించారు.

ఈ ఆందోళనలను ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తోసిపుచ్చారు. ప్రస్తుత ఓటర్ల జాబితాపై ఎవరూ సంతృప్తి వ్యక్తం చేయనందునే ప్రత్యేక సమగ్ర సవరణ చేపట్టామంటూ తమ చర్యను సమర్థించుకున్నారు. ఓటర్ల జాబితా సవరణలో ఆధార్ కార్డు, ఓటర్ ఐడి కార్డు, రేషన్ కార్డును పరిగణనలోకి తీసుకోవాలని ఈ నెల 10న సుప్రీంకోర్టు ఈసీకి సూచించింది. అయితే వాటిని చెల్లుబాటయ్యే పత్రాలలో చేర్చలేమని ఈ నెల 21న సుప్రీంకోర్టుకు ఇసి తెలియజేసింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు సోమవారం ఆగ్రహం వ్యక్తం చేసి, అన్ని పత్రాల్లోనూ ఫోర్జరీ చేయవచ్చునని వ్యాఖ్యానించింది.

ప్రత్యేక సవరణ ఆపండి : ప్రతిపక్షాల డిమాండ్

ఓటర్ల జాబితా తొలి దశ సవరణలో 65 లక్షల మంది ఓటర్ల పేర్లు గల్లంతు అవుతుండడంపై ఇండియా వేదిక ఆందోళన వ్యక్తం చేసింది. సవరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని ఎన్నికల కమిషన్‌ను డిమాండ్ చేసింది. ఇసి డేటా సమగ్రతపై అనుమానాలు వ్యక్తం చేస్తూ అందులో విధానపరమైన అస్పష్టత కన్పిస్తోందని తెలిపింది. ఆర్‌జెడి, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) నేతలు పాట్నాలో విలేకరులతో మాట్లాడుతూ ఈసీపై తీవ్ర ఆరోపణలు సంధించారు. ఇసి కసరత్తు యావత్తూ అస్పష్టత పైనే ఆధారపడిందని అంటూ దానిని 'సంస్థాగత అహంకారం'గా అభివర్ణించారు. చనిపోయిన, ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఓటర్ల సమాచారాన్ని పార్టీలకు అందజేశామంటూ ఇసి చేసిన వాదనను వారు తోసిపుచ్చారు.

'మా భయాందోళనలు నిజమయ్యాయి. సుమారు రెండు లక్షల మందిని ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తారని మేము ముందుగానే హెచ్చరించాం. తప్పుడు పత్రాల ఆధారంగా రూపొందించిన డేటాను తీసుకొని ఓటర్లను తొలగిస్తున్నారు. పరిశీలన ఇంకా పూర్తి కాలేదు. రాబోయే నెలలో మరిన్ని తొలగింపులు జరగవచ్చు. ఈ విషయంపై మేము ప్రజల వద్దకు వెళతాం. తమ ఓట్లు కూడా గల్లంతయ్యాయని ఎన్‌డిఎ సైతం చెబుతోంది' అని ఆయా పార్టీల నేతలు ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు.

ఇసి కసరత్తులో పారదర్శకత, కచ్చితత్వం లోపించాయని కాంగ్రెస్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు అభిషేక్ మను సింఘ్వి విలేకరుల సమావేశంలో తెలిపారు. ఇసి ప్రక్రియలో స్పష్టత లేదని, అసమానతలు కన్పిస్తున్నాయని ఆయన చెప్పారు. ఇది ఓటర్ల జాబితాను సరిచేయడం కాదని, పరిశీలన పేరుతో తొలగింపులు చేసే కసరత్తు అని విమర్శించారు.

కోర్టు సహనాన్ని పరీక్షిస్తున్నారు

మంత్రి విజయ్‌షాపై సుప్రీం ఆగ్రహం

న్యూఢిల్లీ : మధ్యప్రదేశ్ మంత్రి కున్వర్ విజయ్‌షా కోర్టు సహనాన్ని పరీక్షిస్తున్నారని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. భారత ఆర్మీ అధికారి కల్నల్ సోఫియా ఖురేషిపై చేసిన వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణ చెప్పక పోవడంపై సుప్రీంకోర్టు సోమవారం తీవ్రంగా మందలించింది. ఆయన కోర్టు సహనాన్ని పరీక్షిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసింది. మంత్రి అభిప్రాయం, విశ్వసనీయతను అనుమానించేలా ఆయన ప్రవర్తన ఉందని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చిలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఆగస్టు 13లోగా నివేదికను సమర్పించాల్సిందిగా మంత్రి వ్యాఖ్యలపై దర్యాప్తు చేపట్టేందుకు నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఆదేశించింది. సిట్ 87మందిని విచారించిందని, ప్రస్తుతం వారి వాంగ్మూలాలను పరిశీలిస్తున్నట్లు సుప్రీంకోర్టు గుర్తించింది. విజయ్‌షా మంత్రి పదవికి రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ నేత జయతాకూర్ దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించేందుకు ధర్మాసనం నిరాకరించింది. అయితే గత సంఘటనల గురించి రిట్ పిటిషన్‌లో చేసిన కొన్ని ఆరోపణలను సిట్ పరిశీలిస్తోందని ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణను సుప్రీంకోర్టు ఆగస్ట్ 18కి వాయిదా వేసింది.

అప్పుల ఊబిలో బీహార్

- రూ.70 వేల కోట్ల ఆర్థిక అవకతవకలు
- నితీశ్ పాలనపై కాగ్ నివేదిక

పాట్నా : బీహార్‌లో నితీశ్ కుమార్ నేతృత్వంలోని డబుల్ ఇంజన్ ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున ఆర్థిక అవకతవకలు జరిగాయని కాగ్ ఎత్తిచూపింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీహార్ ఫైనాన్సెస్‌పై రాష్ట్ర శాసనసభకు కాగ్ సమర్పించిన నివేదిక ప్రకారం గత సంవత్సరం మార్చి 31 నాటికి రూ.70,877.61 కోట్ల విలువ కలిగిన 49,649 యుటిలైజేషన్ సర్టిఫికెట్లు అపరిష్కృతంగా ఉన్నాయి. ప్రభుత్వ శాఖ పూర్తి చేసిన పనిని యుటిలైజేషన్ సర్టిఫికెట్ తెలియజేస్తుంది. అలా పూర్తి చేసిన పనులు ఉపయోగానికి అనువుగా ఉంటాయి. గత సంవత్సరం మార్చి 31 నాటికి రూ.184.52 కోట్ల తాత్కాలిక అడ్వాన్సులు, రూ.25.46 కోట్ల అడ్వాన్సులను సర్దుబాటు చేయలేదని కూడా కాగ్ తెలిపింది. వివిధ శాఖల కింద సర్దుబాటు చేయని మొత్తాలను సర్దుబాటు చేసి, వాటిని సంబంధిత ట్రెజరీలో జమ చేయాల్సి ఉంటుందని పేర్కొంది.

పంచాయతీ రాజ్, విద్య, పట్టణాభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖలు ట్రెజరీలో నిధులను జమ చేయడంలో విఫలమయ్యాయని కాగ్ వేలెత్తి చూపింది. డిపాజిట్లపై తీసుకున్న రుణానికి సంబంధించి చెల్లించాల్సిన రూ.144.29 కోట్ల వడ్డీని కూడా ప్రభుత్వం చెల్లించలేదని చెప్పింది. అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే 2023-24లో రాష్ట్ర అప్పులు 12.34 శాతం పెరిగాయని తెలిపింది. ప్రభుత్వం ఆదా చేసిన రూ.65,512.05 కోట్లలో కేవలం రూ.23,875.55 కోట్లు (36.4 శాతం) మాత్రమే సరండర్ చేసిందని పేర్కొంది. రాష్ట్రం చెల్లించాల్సిన మొత్తం అప్పులలో 59.26 శాతం అంతర్గత రుణాలేనని తెలియజేసింది. అంతకుముందు సంవత్సరంతో పోలిస్తే 2023-24లో అంతర్గత రుణం కింద నికర అప్పులు 13.51 శాతం (రూ.28,107.06 కోట్లు) పెరిగాయి.

2024 మార్చి 31 నాటికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి రూ.3,32,740.90 కోట్ల రుణం తీసుకున్నదని కాగ్ తెలిపింది. స్థూల ద్రవ్య లోటు రూ.10,092.05 కోట్లు పెరిగింది. మొత్తంమీద బీహార్ ద్రవ్య లోటు రూ.35,659.83 కోట్లకు చేరింది. ఇందులో ఎక్కువ భాగం మార్కెట్ రుణాలు, కేంద్రం నుంచి తీసుకున్న అప్పులే. గత ఐదు సంవత్సరాల కాలంలో తీసుకున్న రుణాలలో 68 శాతం పాత అప్పులు తీర్చడానికే వెచ్చించారు.

ఎస్ఐఆర్.. ప్రజాస్వామ్యంపై దాడి

- పార్లమెంట్‌లోనూ, బయట ప్రతిపక్షాల ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బీహార్‌లో ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సవరణకు వ్యతిరేకంగా ఐదో రోజు ప్రతిపక్షాలు గళమెత్తాయి. ఇందులో భాగంగా సోమవారం పార్లమెంటు సమావేశాల ప్రారంభం, వాయిదా తరువాత పెద్దయెత్తున ఇండియా బ్లాక్ ఎంపీలు నిరసనకు దిగారు. మకర ద్వారానికి ఎదురుగా చేపట్టిన ఈ ఆందోళనలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేష్ యాదవ్, సిపిఎం ఎంపిలు అమ్రారామ్, శివదాసన్, జాన్ బ్రిట్టాస్, టిఎంసి ఎంపిలు డెరిక్ ఓ బ్రెయిన్, సాగరికా ఘోష్, డిఎంకె ఎంపిలు కనిమొళి, ఎ.రాజాతో పాటు పలువురు ఇండియా బ్లాక్ ఎంపీలు పాల్గొన్నారు. బీహార్ ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 'ఎస్ఐఆర్-ప్రజాస్వామ్యంపై దాడి' అనే భారీ బ్యానర్‌ను, ఎస్ఐఆర్‌ను ఆపాలి అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. బీహార్ ఎన్నికలకు ముందు కుట్రపూరితంగా ఎస్ఐఆర్‌ను తీసుకొచ్చారని ప్రియాంకగాంధీ విమర్శించారు. ప్రజల అభిప్రాయం లేకుండా, ఓటర్లను మత, కుల ప్రాతిపదికన వడపోసే ఈ ప్రయత్నాన్ని ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసే కుట్ర అని అన్నారు.



పార్లమెంట్ మకర ద్వారం వద్ద అందోళన చేస్తున్న ప్రతిపక్ష పార్టీల సభ్యులు

ఉభయ సభల్లో వాయిదాల పర్వం

పార్లమెంటు ఉభయ సభల్లో వాయిదాల పర్వం కొనసాగుతోంది. రాజ్యసభ సోమవారం ఐదు నిముషాల పాటు పనిచేసి మంగళవారానికి వాయిదా పడింది.

సోమవారం ఉదయం 11గంటలకు ఉభయ సభలు సమావేశమయ్యాయి. బీహార్‌లో ఎస్ఐఆర్ పేరుతో ఇసి చేపట్టిన ఓటర్ల జాబితా సవరణపై ప్రతిపక్షాలు ఆందోళన చేపట్టాయి. లోక్‌సభను మధ్యాహ్నం 12 గంటల వరకూ వాయిదా వేస్తున్నట్లు స్పీకరు ఓం బిర్లా ప్రకటించారు. రాజ్యసభ ప్రారంభం కాగానే ప్రతిపక్ష కూటమి ఎంపీలు ఆందోళనకు దిగడంతో సభలో గందరగోళం ఏర్పడింది. దీంతో సభ మధ్యాహ్నానికి వాయిదా పడింది. ఇదే పరిస్థితులు పునరావృతం కావడంతో తిరిగి లోక్‌సభను మధ్యాహ్నం ఒంటి గంట వరకు, రాజ్యసభను మధ్యాహ్నం రెండు గంటల వరకు వాయిదా వేశారు. వాయిదాకు ముందు ప్రతిపక్ష సభ్యుల తీరుపై స్పీకరు ఓం బిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష సభ్యులు సభా కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'సభలో పోస్టర్లు ప్రదర్శించొద్దని, నినాదాలు చేయవద్దని మీ సభ్యులకు చెప్పండి' అని రాహుల్ గాంధీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు అంగీకరించి, ఇప్పుడు ఎందుకు ఆందోళన చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. మధ్యాహ్నం 2 గంటలకు సభలో సిందూర్‌పై చర్చ చేపట్టారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు క్రైస్తవుల అరెస్టుపై చర్చించాలి

దేశంలో క్రైస్తవులపై కొనసాగుతున్న హింసాత్మక ఘటనలను చర్చించాలని సిపిఎం ఎంపి వి.శివదాసన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన రాజ్యసభలో రూల్ 267 కింద నోటీసు ఇచ్చారు. అస్సిసీ సిస్టర్స్ ఆఫ్ మేరీ ఇమ్మాక్యులేట్ సభ్యులు సిస్టర్ ప్రీత మేరీ, సిస్టర్ వందన ఫ్రాన్సిస్‌లను నిరాధారమైన ఆరోపణల ఆధారంగా ఛత్తీస్‌గఢ్ పోలీసులు అరెస్టు చేయడం ఆందోళన కలిగిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా క్రైస్తవులు హింస, బెదిరింపులను ఎదుర్కొంటున్నారన్నారు. రాజ్యాంగ బద్ధంగా న్యాయం, సమానత్వాన్ని కాపాడాల్సిన సంస్థలు ప్రాథమిక మానవ హక్కులను ఉల్లంఘించే చర్యలకు పాల్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. క్రైస్తవ సమాజంపై పెరుగుతున్న దాడులు, వారిని లక్ష్యంగా చేసుకున్న చర్యలు దేశ లౌకిక నిర్మాణానికి తీవ్ర ముప్పుగా పరిణమించాయని ఆందోళన చెందారు. ఈ విషయంపై వెంటనే చర్చను చేపట్టాలన్నారు. అన్ని స్థాయిల్లో జవాబు దారీతనం ఉండేలా చూసుకోవాలని ఆయన కోరారు.

దేశం భద్రమేనా...?

- పార్లమెంటులో ప్రతిపక్షాలు

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

పహల్గాం, ఆపరేషన్ సిందూర్‌పై జరిగిన చర్చలో పాల్గొన్న ప్రతిపక్ష సభ్యులు దేశ భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. స్వతంత్ర ఎంపి పప్పు యాదవ్ మాట్లాడుతూ పెహల్గాం ఉగ్రదాడికి కారణమైన ఉగ్రవాదులను ప్రభుత్వం ఇంత వరకు ఎందుకు పట్టుకోలేదని ప్రశ్నించారు. నెల రోజులు దాటినా వాళ్లను పట్టుకోలేదంటే, అప్పుడు దేశం సురక్షితమైన చేతుల్లో లేదని అర్థం అవుతోందన్నారు. కాంగ్రెస్ ఎంపి మనీష్ తివారీ మాట్లాడుతూ పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ ఐక్యంగా ఉందని, మే 7 నుంచి 10వ తేదీ మధ్య జరిగిన ఆపరేషన్‌తో పాక్ ఉగ్రవాదాన్ని ఎంత వరకు కట్టడిచేయగలిగామని ఆయన ప్రశ్నించారు.

ఆపరేషన్ సిందూర్‌తో ఏం సాధించామో ప్రభుత్వం స్పష్టంగా చెప్పలేకపోయిందని కాంగ్రెస్ ఎంపి ఇమ్రాన్ మసూద్ అన్నారు. పెహల్గాం ఉగ్రదాడి తరువాత ప్రతిపక్షాలు ప్రభుత్వానికి అండగా నిలిచాయని, కానీ ప్రధాని మోడీ మాత్రం అఖిల పక్ష సమావేశాలకు కూడా హాజరుకాలేదన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాదనపై ప్రధాని మోడీ నోరు ఎందుకు విప్పలేదని సిపిఐ (ఎంఎల్) ఎంపి రాజా రామ్ సింగ్ అన్నారు. "మన పూర్వీకులు గాంధీ, భగత్‌సింగ్, అంబేద్కర్ ప్రారంభించిన భారతదేశం, సామ్రాజ్యవాద వ్యతిరేకత ఆధారంగా, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ప్రారంభమైంది. నేడు, మనం వాణిజ్య ఒప్పందం గురించి మాట్లాడుతున్నాం. ఈస్ట్ ఇండియా కంపెనీ లాగా, అమెరికా కూడా సుంకాలతో బెదిరించడంతోనో, మన వలస కార్మికులను జైలులో పెట్టడంతోనో, ఇండియా-పాకిస్తాన్ సంఘర్షణను తాను నిరోధించానని డొనాల్డ్ ట్రంప్ చెప్పుకోవడంతోనో ఇండియాని దోచుకుంటున్నట్లు స్పష్టం అయింది. డొనాల్డ్ ట్రంప్ చేసిన తప్పుడు వాదనల గురించి ప్రధాని మోడీ నోరు విప్పలేదు" అని ఆయన అన్నారు.

ప్రతిపక్షాలు మద్దతు ఇచ్చాయిః సుప్రియా సులే

ఆపరేషన్ సింధూర్ సందర్భంగా ప్రతిపక్షాలన్నీ ప్రధాని మోడీకి సంఘీభావం తెలిపాయని ఎన్‌సిపి ఎంపి సుప్రియా సులే అన్నారు. "ఇది గొడవలకు సమయం కాదని కాంగ్రెస్ చెప్పింది. ఏది జరిగినా ప్రధాని మోడీ ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తామని మొత్తం ప్రతిపక్షం చెప్పింది" అని ఆమె అన్నారు. భారత ఆర్మీ అధికారిణి కల్నల్ సోఫియా ఖురేషి, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, ఉగ్రవాద బాధితుడి భార్యపై జరిగిన దుర్మార్గపు ట్రోలింగ్‌ను సుప్రియా సూలే ఖండించారు.

నేడు రాజ్యసభలో చర్చ

సోమవారం రాత్రి 12 గంటల వరకు ఆపరేషన్ సింధూర్‌పై లోక్‌సభలో చర్చ జరిగింది. రాజ్యసభలో మంగళవారం రాజ్‌నాథ్ సింగ్ చర్చను ప్రారంభించనున్నారు. లోక్‌సభలో మంగళవారం అమిత్ షా తొలుత ప్రసంగించనున్నారు. రాత్రి ఏడు గంటలకు ప్రధాని మోడీ ఆపరేషన్ సింధూర్ చర్చపై ప్రసంగిచనున్నారు. ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే, విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్, వివిధ పార్టీల నేతలు చర్చలో పాల్గొంటారు.

రాష్ట్ర జడ్జిల్లో నలుగురికి శాశ్వత హోదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర హైకోర్టులో ప్రస్తుతం అదనపు జడ్జిలుగా సేవలందిస్తున్న నలుగురికి శాశ్వత న్యాయమూర్తి హోదా లభించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ నేతృత్వంలో సుప్రీంకోర్టు కొలీజియం సోమవారం జరిగిన సమావేశంలో ఈ సిఫార్సును ఆమోదించింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా ఉన్న జస్టిస్ హరినాథ్ నూనెపల్లి, జస్టిస్ కిరణ్మయి మండవ (కిరణ్మయి కనపర్తి), జస్టిస్ సుమతి జగడం, జస్టిస్ న్యాపతి విజయ్‌ను న్యాయమూర్తులుగా నియమించారు.

ఉగ్రవాదులు ఎలా వచ్చారు?

(మొదటి పేజీ తరువాయి)

ఒక ప్రకటన. సంయమనం ప్రకటన, దృఢ సంకల్పం ప్రకటన" అని ఆయన అన్నారు. వైసిపి ఎంపి వైఎస్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ ఇండియన్ ఆర్మీ చర్యలకు తమ మద్దతు, జమ్మూ కాశ్మీర్ ప్రజలకు సంఘీభావం తెలుపుతున్నామని అన్నారు.

అమెరికా అధ్యక్షుడంటే భయమా?

టిఎంసి ఎంపి కళ్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ పట్ల అమెరికా అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలు అవాస్తవమని ట్విట్టర్‌లో ఎందుకు పోస్టు చేయడం లేదని ప్రధాని మోడీని ప్రశ్నించారు. అమెరికా అధ్యక్షుడి ముందు మీరు నిలబడినప్పుడు మీ ఎత్తు 5 ఫీట్లకు తగ్గుతుందని, మీ ఛాతి 56 ఇంచుల నుంచి 36 ఇంచులకు కుంచించుకుపోతుందని ఎద్దేవా చేశారు. అమెరికా అధ్యక్షుడంటే మీరెందుకు అంత భయపడుతున్నారని ప్రశ్నించారు. ఆర్‌జెడి ఎంపి అభయ్ కుమార్ సిన్హా మాట్లాడుతూ కాశ్మీర్‌లో భద్రతకు ప్రభుత్వం ఇచ్చిన హామీ, కుంభమేళాలో భద్రత, సరైన నిర్వహణకు ఇచ్చిన హామీని పోలి ఉందని ఎద్దేవా చేశారు. కేంద్రం నీచ రాజకీయాలు చేస్తోందని, ప్రతిపక్షాలు, ప్రజల మాట వినడానికి నిరాకరిస్తోందని కాంగ్రెస్ ఎంపి ప్రణితి షిండే విమర్శించారు.

మన సైన్య సత్తాకు నిదర్శనం : రాజ్‌నాథ్ సింగ్

ఆపరేషన్ సిందూర్ మన సైన్య సత్తాకు నిదర్శనమని చర్చను ప్రారంభించిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. భవిష్యత్తులో పాక్ మళ్లీ దుస్సాహసానికి పాల్పడితే ఆపరేషన్ తిరిగి ప్రారంభిస్తామని చెప్పారు. కాల్పుల విరమణకు ఎవరి ఒత్తిడి లేదని కూడా ఆయన వివరణ ఇచ్చారు.

అమెరికా ప్రమేయం మాత్రం లేదు : జై శంకర్

భారత్-పాక్ మధ్య జరిగిన కాల్పుల విరమణలో అమెరికా ప్రమేయం ఎంత మాత్రం లేదని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తెలిపారు. కాల్పుల విరమణకు సంబంధించి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణలు జరగలేదని అన్నారు. లష్కరే తొయిబా ప్రాక్సీ అయిన ది రెసిస్టెంట్ ఫ్రంట్ (టిఆర్ఎఫ్) ఉగ్రవాద సంస్థగా అమెరికా ప్రకటించడం వెనుక భారత దౌత్యానికి క్రెడిట్ దక్కుతుందని ఆయన అన్నారు. ఈ సమయంలో ప్రతిపక్ష సభ్యులు జైశంకర్‌పై ప్రశ్నలు కురిపించారు. దీంతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్టాక్‌హోమ్‌లో అమెరికా, చైనా చర్చలు

స్టాక్‌హోమ్ : స్వీడన్ రాజధాని స్టాక్‌హోమ్‌లో అమెరికా, చైనా నాయకులు, అధికారులు సమావేశమై వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరుపుతున్నారు. సుంకాలు ప్రస్తుత స్థాయిలోనే ఉండే విధంగా చర్చలు జరుగుతున్నాయని తెలుస్తోంది. ఇరు దేశాల అధ్యక్షులు ఈ సంవత్సరం చివరలో సమావేశం కావాల్సి ఉంది. అప్పుడు వాణిజ్య ఒప్పందం ఖరారయ్యే అవకాశం ఉంది.

అమెరికా వాణిజ్య మంత్రి స్కాట్ బెస్సెంట్, చైనా వైస్ ప్రీమియర్ హీ లిఫెంగ్ సోమవారం చర్చలు మొదలు పెట్టారు. వీరిద్దరూ ఇలా సమావేశం కావడం ఈ ఏడాదిలో ఇది మూడోసారి. నాలుగు నెలల క్రితం అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చైనా వస్తువులపై 145 శాతం సుంకం విధించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి రెండు దేశాల నేతల మధ్య చర్చలు జరగలేదు. స్కాట్లాండ్ పర్యటనకు వెళ్లే ముందు ట్రంప్ విలేకరులతో ముచ్చటిస్తూ చైనాతో ఒప్పందం కుదుర్చుకునేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. కాగా రెండు దేశాల మధ్య ఇప్పటికే జెనీవా, లండన్‌లో రెండు విడతలుగా చర్చలు జరిగాయి.

లూలూకు భూములు కట్టబెట్టే జిఓ 137ను రద్దు చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

బడా కంపెనీల ప్రవేశంతో చిన్న, మధ్య తరగతి వ్యాపార రంగం ఇప్పటికే దెబ్బతిన్న విషయాన్ని ప్రకటనలో ప్రస్తావించారు. లులూ వంటి అంతర్జాతీయ కంపెనీలతో ఆ రంగం పూర్తిగా నాశనం అవుతుందని వివరించారు. బడా కంపెనీలకు రాయితీలు ఇస్తున్న పాలకులు చిన్న, మధ్య తరగతి వ్యాపారులపై పన్నులు పెంచుతున్నారని, వేధిస్తున్నారని, ఫలితంగా అనేక వ్యాపార సంస్థలు మూత బడుతున్నాయని, ఉపాధి దెబ్బతింటోందని పేర్కొన్నారు. ఈ తరుణంలో చిన్న మధ్యతరగతి వ్యాపారులను దెబ్బతీసే రీతిలో లులూమాల్‌కు కారు చౌకగా భూములు పందేరం చేయడం గర్హనీయమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి జిఓని రద్దు చేయాలని, ప్రభుత్వ ఆర్‌టిసి స్థలాలను కాపాడాలని, చిన్న మధ్య తరగతి వ్యాపారులను రక్షించాలని కోరారు.

ఎర్రకాల్వ మిగులు భూములను పేదలకు కేటాయించాలి

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.నాగమణి, టి.రామకృష్ణ మాట్లాడుతూ పేదలు సాగు చేస్తోన్న భూముల్లోని పంటలను భూస్వాములు పాడు చేశారని గుర్తు చేశారు. దీనిపై పేదలు హైకోర్టును ఆశ్రయించగా, ఈ భూములు పేదలకు చెందుతాయని కోర్టు తీర్పు ఇచ్చిందని, దీని అమలులో అధికారులు విఫలమయ్యారని తెలిపారు. భూస్వాములకు తొత్తులుగా అధికారులు మారి పేదలపై అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు.

హామీలను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం

టిడిపి కూటమి ప్రభుత్వం హామీలను గాలికొదిలేసి సుపరిపాలన అంటూ రాష్ట్ర ప్రజలను మోసగిస్తోందని వి.శ్రీనివాసరావు విమర్శించారు. జంగారెడ్డిగూడెంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రమంతా ఫ్రీ బస్ అని చెప్పి, ఇప్పుడు జిల్లాకే పరిమితం చేస్తున్నారని, అదైనా జరుగుతుందో లేదోనని అన్నారు. మహిళలకు ప్రతి నెలా రూ.1,500 ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చారని, దీనిని అమలు చేయాలంటే రాష్ట్రాన్ని అమ్మేయాలని మంత్రి వ్యాఖ్యానించడం దారుణమని, ఈ హామీ ఇచ్చేటప్పుడు ఆ విషయం తెలియదా? అని ప్రశ్నించారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతుండడం దారుణమన్నారు. ఆగస్టు మొదటి వారంలో స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగానూ, ప్రజా సమస్యలపైనా పెద్ద ఎత్తున ఆందోళనలు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

తప్పుదారి పట్టిస్తున్న రాష్ట్రపతి సూచన!

- తమిళనాడు గవర్నర్ కేసులో సుప్రీంలో వాదించిన కేరళ ప్రభుత్వం
- తన తీర్పుపైనే తనకు అప్పీలా ?
- ఇదంతా పెద్ద కుట్ర అంటూ వ్యాఖ్యలు

న్యూఢిల్లీ : తమిళనాడు గవర్నర్ కేసులో రాష్ట్రపతి సూచన కోర్టును తప్పుదారి పట్టించేలా ఉందని కేరళ ప్రభుత్వం వ్యాఖ్యానించింది. తమిళనాడు గవర్నర్ కేసులో సుప్రీంకోర్టు ఇప్పటికే ఒక తీర్పు ఇచ్చిందని, తాను ఇచ్చిన ఆ తీర్పుపైనే తిరిగి విచారించేలా చేయడానికి ఇది ఒక కుట్ర అని వ్యాఖ్యానించింది. అందువల్ల రాష్ట్రపతి సూచనను తోసిపుచ్చాలని కేరళ ప్రభుత్వం సోమవారం సుప్రీంకోర్టును కోరింది. రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులను క్లియర్ చేయడానికి రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించే అధికారం సుప్రీంకోర్టుకు ఉందా లేదా తేల్చమంటూ రాష్ట్రపతి 14 ప్రశ్నలు సంధించిన సంగతి తెలిసిందే.

సుప్రీంకోర్టు తన సొంత తీర్పులపై అప్పీలు చేసుకునేందుకు రాజ్యాంగం అనుమతించదు లేదా రాష్ట్రపతి ప్రస్తావన ద్వారా కోర్టులో అప్పీలు అధికార పరిధిని రాష్ట్రపతి తన ఆధీనంలోకి తీసుకోలేరని కేరళ ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రపతి చేసిన ప్రస్తావన తప్పుదారి పట్టించేదిగా వుందని, వాస్తవాలను తొక్కి పెట్టేదిగా ఉందని కేరళ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఒకవేళ సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకోకపోతే, రాజ్యాంగంలోని 143వ అధికరణలోని అడ్వైజరీ జ్యూరిస్‌డిక్షన్ కింద (సూచనలు చేయడానికి గల అధికార పరిధి) ఆ ప్రశ్నలను సుప్రీంకోర్టుకు కేవలం సూచించడమే చేయగలరని కేరళ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాదులు కెకె వేణుగోపాల్, సి.కె.శశి వాదించారు.

1993లో కావేరీ జల వివాదాల ట్రిబ్యునల్‌లో ఇచ్చిన సూచనను ఇందుకు న్యాయపరమైన ఉదాహరణగా ప్రభుత్వం ప్రస్తావించింది. ఏప్రిల్ 8న తెలంగాణ, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలు దాఖలు చేసిన కేసుల్లో రాజ్యాంగంలోని 200, 201 అధికరణల కింద గవర్నర్లు మరియు రాష్ట్రపతి అధికారాలు మూడు వేర్వేరు అధికారిక తీర్పులకు లోబడి ఉన్నాయని ప్రభుత్వం పేర్కొంది.

"ఒక చట్టపరమైన అంశంపై సుప్రీంకోర్టు తన అధికార పరిధిలో చట్టానికి లోబడి తన అభిప్రాయాన్ని ప్రకటించినప్పుడు, దానిపై సందేహం ఉందని చెప్పలేం లేదా అది నిర్ణయించబడని అంశమని కూడా చెప్పలేం. తద్వారా ఈ ప్రశ్న గురించి చట్ట పరిధిలో వాస్తవ వైఖరి ఏమిటో రాష్ట్రపతి తెలుసుకోవాలి. చట్టపరమైన అంశంపై ఈ న్యాయస్థానం తీసుకున్న నిర్ణయానికి మిగిలిన అన్ని కోర్టులు, అధికారులు కట్టుబడి వుండాల్సిందే." అని కేరళ ప్రభుత్వం పేర్కొంది. రాష్ట్రపతి తన ప్రస్తావనలో ఏ ప్రశ్నలనైతే లేవనెత్తారో వాటికి ఏప్రిల్ 8నే జస్టిస్ జెబి పార్థివాలా తన తీర్పులో సవివరంగా సమాధానమిచ్చారని కేరళ ప్రభుత్వం గుర్తు చేసింది. ఏప్రిల్ 8 నాటి తీర్పును కేంద్రం సవాలు చేయాలనుకుంటే, సుప్రీంకోర్టులో సమీక్షకు లేదా క్యురేటివ్ పిటిషన్‌కు దాఖలు చేసి ఉండాల్సిందని, అంతేకానీ ఇలా రాష్ట్రపతి ప్రస్తావన మార్గాన్ని ఎంచుకోరాదని కేరళ ప్రభుత్వం వాదించింది. ఇక్కడ ఈ తీర్పుని సమీక్షించాలని కేంద్రం కోరలేదని, దానిని స్థిరమైన చట్టంగా నిర్ధారించిందని పేర్కొంది.

'సృష్టి' అక్రమాలపై మానవ హక్కుల కమిషన్ సీరియస్

- ఆగస్టు 28లోగా నివేదిక సమర్పించాలి
- వైద్యారోగ్యశాఖ కార్యదర్శికి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సికింద్రాబాద్‌లోని యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ సెంటర్‌తో పాటు దానికి సంబంధించి హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం క్లినిక్‌లలో జరుగుతున్న అక్రమాలపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సీరియస్ అయ్యింది. ఈ మేరకు వివిధ పత్రికల్లో వచ్చిన వార్తలను సుమోటోగా స్వీకరించింది. ఇండియన్ స్పెర్మ్ టెక్ క్లినిక్‌లో అనుమతి లేకుండా వీర్యం సేకరణ రాకెట్ పట్ల ఆగ్రహం వ్యక్తం చేసింది. చట్టవిరుద్ధంగా సరోగసీ, శిశువుల అమ్మకం, అనుమతి లేని మెడికల్ ప్రొసీజర్లు పాటించడం సరోగసీ (రెగ్యులేషన్) యాక్ట్‌ను ఉల్లంఘించడమే అని పేర్కొంది. సదరు ఫెర్టిలిటీ సెంటర్ డాక్టర్ ఎ నమ్రత, ఆమె కుమారుడు జయంత్ కృష్ణ ఈ వ్యవహారాల్లో ఉన్నారని తెలిపింది. దీనిపై ఏం చర్యలు తీసుకున్నారు? వచ్చిన ఫిర్యాదుల స్టేటస్ ఏమిటి?, పిల్లలను ఇచ్చిన, తీసుకున్న ఇరువైపుల బాధితుల జాబితా, ఇందులో ఎవరైనా అధికారుల పాత్ర ఉంటే ఆ వివరాలు, ఇలాంటివి భవిష్యత్తులో జరగకుండా తీసుకున్న చర్యలపై ఆగస్టు 28న ఉదయం 11 గంటలలోపు నివేదిక సమర్పించాలని వైద్యారోగ్యశాఖ కార్యదర్శిని కమిషన్ ఆదేశించింది.

ఇజ్రాయిల్ దాష్టీకానికి 55మంది బలి

- ఆహార కేంద్రాల వద్ద కాల్పుల్లో 17 మంది మృతి
- స్వల్పంగా ఆంక్షల సడలింపు సముద్రంలో నీటి బొట్టంతన్న ఐక్యరాజ్య సమితి

డేర్ అల్ బాలాహ్ : ఇజ్రాయిల్ మారణహోమానికి సోమవారం మరో 55 మంది పాలస్తీనా వాసులు బలయ్యారు. వీరిలో ఆహార కేంద్రాల వద్ద జరిగిన కాల్పుల్లో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. గాజాలో మానవతా సంక్షోభం దుర్భరంగా మారిన నేపథ్యంలో, ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతుండటంతో ఇజ్రాయిల్ ఆహార సాయంపై అమలవుతున్న ఆంక్షలను ఆదివారం కొద్దిగా సడలించింది. గాజా నగరం, డేర్ అల్ బాలాహ్, మౌవసి ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ రోజుకు 10గంటల పాటు మిలటరీ ఆపరేషన్లకు విరామం ఇవ్వనున్నట్లు ఇజ్రాయిల్ ఆదివారం ప్రకటించింది. సాయం అందేందుకు సురక్షితమైన మార్గాలను కూడా కొన్నింటిని నిర్దేశించింది.

ఆహార కేంద్రాల వద్ద కాల్పుల్లో 17మంది మృతి


మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

గాజాలో ఆహారం అందించే కేంద్రాల వద్ద వేచివున్న పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ బలగాలు జరిపిన కాల్పుల్లో 17మంది మరణించారు. అనేకమంది గాయపడ్డారు. వీరిలో రాఫా నగరానికి ఉత్తరాన మోరాగ్ కారిడార్‌కు సమీపంలో జరిగిన దాడిలో మరణించిన ఐదుగురున్నారు. దీంతో మొత్తంగా మరణించినవారి సంఖ్య 55కి చేరింది. 80మందికి పైగా గాయపడ్డారు. తీవ్ర పోషకాహారం లోపంతో ఆదివారం ఒక చిన్నారిసహా 14మంది పాలస్తీనియన్లు మరణించారు. పాలస్తీనియన్ల సాగుభూములపై, ఆలీవ్ చెట్లపై ఇజ్రాయిల్ బలగాలు విరుచుకుపడ్డాయి. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లోని జెనిన్ నగరానికి సమీపంలో ఈ దాడులు చోటు చేసుకున్నాయి.

ఇజ్రాయిల్ చర్యలు సముద్రంలో నీటి బొట్టు!

పాలస్తీనా భూభాగంలో రోజురోజుకు ఉధృతమవుతున్న దుర్భిక్షాన్ని ఎదుర్కొనేందుకు ఇజ్రాయిల్ సడలించిన ఆంక్షలు సముద్రంలో నీటి బొట్టంత' అని ఐక్యరాజ్య సమితి మానవతా విభాగ చీఫ్ విమర్శించారు. ప్రాణాధార మందులు, అత్యవసరాలైన ఉత్పత్తుల సరఫరాపై తీవ్ర ఆంక్షలు అమలవుతుండగా, ఆహారం అందేందుకు అంటూ ఇజ్రాయిల్ సడలించిన ఆంక్షలు ఏ మాత్రమూ లెక్కలోకి రావని అన్నారు.

యుద్ధం ఆపండి : ట్రంప్‌కు ఈజిప్టు అధ్యక్షుడి విజ్ఞప్తి

గాజాలో యుద్ధం ఆపేందుకు చొరవ చూపాల్సిందిగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫతాహ్ అల్ సిసి బహిరంగంగా విజ్ఞప్తి చేశారు. టెలివిజన్‌లో ఆయన మాట్లాడుతూ సంవత్సరాల తరబడి దాడుల్లో మగ్గిపోతున్న పాలస్తీనియన్లకు ఉపశమనం కలిగించేలా తక్షణమే ఇజ్రాయిల్‌పై ఒత్తిడి తీసుకువచ్చి యుద్ధాన్ని ముగించాలని కోరారు. స్కాట్లాండ్‌లో పర్యటిస్తున్న ఆయన గాజా ప్రజలకు ఆహారం, భద్రత అవసరమని అన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం కుదిరే అవకాశముందని వ్యాఖ్యానించారు.

ట్రంప్ కొత్త గడువు.....

- పుతిన్‌పై మరోసారి నిరాశ
- కాల్పుల విరమణకు 12 రోజులే గడువు

లండన్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రష్యాపై తన అక్కసును మరోసారి వెల్లగక్కారు. యుకె పర్యటనలో ఉన్న ఆయన స్కాట్లాండ్‌లో మీడియాతో మాట్లాడుతు రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై అసంతృప్తిని వ్యక్తం చేసారు . " నేను తీవ్రంగా నిరాశచెందాను అందుకే కాల్పుల విరమణకు 50 రోజుల గడువును తగ్గిస్తున్నాను. 12 రోజులే సమయం ఇలోగా తగిన నిర్ణయం తీసుకుంటాను.ఇక వేచి ఉండటంలో అర్థం లేదని " ప్రకటించారు. అదే సమయంలో రష్యాతో వాణిజ్యం చేసే భాగస్వామ్య దేశాలపై అధిక సుంకాలు తప్పవన్నారు. రష్యా కాల్పుల విరమణ ప్రకటించక పోతే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. కఠిన ఆంక్షలు విధిస్తానని మరోసారి బెదిరించారు. ఇప్పటికే భారత్, చైనాతో సహా పలు దేశాలు రష్యాకి వ్యాపార భాగస్వాములుగా ఉన్నాయి. గతంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై భారత్ స్పందించింది. తమ దేశ ప్రయోజనాలే ముఖ్యమని ప్రకటించింది. అయితే యుకె, ఇయుతో ఒప్పందాలు కుదుర్చుకున్న సమయంలోనే ట్రంప్ ప్రకటన చేయడం గమనార్హం. మరోవైపు రష్యా డ్రోనులు ఆదివారం అర్థరాత్రి ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై దాడి చేసాయని, నివాస ప్రాంతాలే లక్ష్యంగా దాడులు జరిగాయని, అనేక మంది పౌరులు గాయపడ్డారని ఆదేశ అధ్యక్ష కార్యాలయం తెలిపింది. ట్రంప్ తాజా బెదిరింపులపై రష్యా స్పందించలేదు. అయితే రష్యా విదేశాంగ శాఖ బెదిరింపులు, అల్టిమేటంలు ఆమోదయోగ్యం కాదని, అంతర్జాతీయ వాణిజ్య చట్టాలను పాటించాలని గతంలోనే తెలిపింది.

ఇయు- అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం

- సుంకాలపై దిగివచ్చిన ట్రంప్
- 15 శాతం టారిఫ్‌లకు అంగీకారం

టర్న్‌బెర్రీ (స్కాట్లాండ్) : యూరోపియన్ యూనియన్‌తో ఎట్టకేలకు అమెరికా వాణిజ్య ఒప్పందం కుదుర్చుకుంది. పలు ఇయు ఉత్పత్తులపై 15 శాతం దిగుమతి సుంకం విధించింది. ఇయుపై 30 శాతం సుంకాలు విధిస్తానంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ గతంలో బెదిరించిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు దిగివచ్చి టారిఫ్‌ను 15 శాతానికి పరిమితం చేశారు. ఫలితంగా అమెరికా, ఇయు మధ్య వాణిజ్య యుద్ధ ప్రమాదం తప్పింది. ప్రపంచ వాణిజ్యంలో ఈ రెండు పక్షాల వాటా దాదాపు మూడో వంతు ఉన్న నేపథ్యంలో ఈ ఒప్పందం ప్రాధాన్యత సంతరించుకుంది. పశ్చిమ స్కాట్లాండ్‌లో ట్రంప్‌నకు చెందిన అత్యంత విలాసవంతమైన గోల్ఫ్ కోర్సులో ఆయనకు, యూరోపియన్ యూనియన్ అధ్యక్షుడు ఉర్సులా వన్ డర్ లెయాన్‌కు మధ్య ఆదివారం ఒప్పందం కుదిరింది. ఈ విషయాన్ని ఇరువురు నేతలు ప్రకటించారు. వాణిజ్య ఒప్పందంపై ఇరు పక్షాల మధ్య అనేక నెలలుగా చర్చలు జరుగుతున్నాయి. చివరికి ఎట్టకేలకు గోల్ఫ్ కోర్సులో గంట సేపు జరిగిన సంప్రదింపుల కారణంగా అంగీకారం కుదిరింది.


తాను కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాలలో ఇదే అతి పెద్దదని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికాలో 600 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టాలని ఇయు యోచించడంపై ఆయన



హర్షం వ్యక్తం చేశారు. ఈ పెట్టుబడులతో అమెరికా ఇంధన, సైనిక పరికరాల కొనుగోళ్లు నాటకీయంగా పెరుగుతాయి. గత వారం జపాన్‌తో కుదుర్చుకున్న 550 బిలియన్ డాలర్ల ఒప్పందంతో పోలిస్తే ఇదే పెద్దదని ట్రంప్ చెప్పారు. అమెరికా ఎగుమతుల విషయంలో అన్యాయంగా వ్యవహరించారని, ఇప్పుడు ఈ ఒప్పందంతో అట్లాంటిక్ సముద్రం సమీపంలో లేదా సరిహద్దున ఉన్న దేశాల మధ్య సంబంధాలు విస్తృతమవుతాయని తెలిపారు. కాగా ట్రంప్‌నతో చర్చించడం చాలా కష్టంతో కూడిన వ్యవహారమని, ఇంతకంటే ఎక్కువగా ఆ దేశం నుంచి పొందలేమని లెయాన్ వ్యాఖ్యానించారు. 'ప్రపంచంలో రెండు అతి పెద్ద ఆర్థిక వ్యవస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇది చాలా పెద్ద ఒప్పందం. భారీ ఒప్పందం. ఇది స్థిరత్వాన్ని కల్పిస్తుంది. అంచనాలకు అవకాశం ఇస్తుంది' అని ఆమె చెప్పారు.

పోషకాహారం అంటే శరీరానికి అవసరమైన పోషకాలను అందించే ఆహార పదార్థాల కలయిక. ఇది జీవనానికి అవసరమైన శక్తి, పెరుగుదల ఆరోగ్యానికి మద్దతును అందిస్తుంది. పోషకాహారం ద్వారా మనం తీసుకునే ఆహారం ద్వారా శరీరానికి అవసరమైన శక్తి లభిస్తుంది. ముఖ్యంగా పిల్లల పెరుగుదలకు పోషకాహారం చాలా అవసరం. పోషకాహారం లోపం ఉంటే వివిధ రకాల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. శరీరంలోని అవయవాలు, వ్యవస్థలు సరిగ్గా పనియేయటానికి పోషకాలు అవసరం. మాంసకృత్తులు, పిండిపదార్థాలు, కొవ్వులు, విటమిన్లు, ఖనిజాలు, నీరు వంటివి ఆరోగ్యానికి బాగా దోహదపడతాయి. అందుకే శృతిమించిన స్థాయిలో కేలరీలు లేదా ఒకే తరహా పోషకాన్ని అతిగా తీసుకోకుండా, వైవిధ్యభరితమైన ఆహారాన్ని తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

చీమలు



చీమలు చీమలు
అమ్మ చీమలు
చిట్టి పొట్టి చీమలు
ఎర్ర రంగు చీమలు
నల్ల రంగు చీమలు
ఆరు కాళ్ళ చీమలు
పుట్టలు పెట్టే చీమలు
చిటుక్కున కుట్టే చీమలు
వరుసగ వెళ్ళే చీమలు
క్రమశిక్షణ చూపు చీమలు
కష్టపడే చీమలు
పొదుపు చేసే చీమలు
మనకు ఆదర్శం చీమలు



- దారవేణి అశ్విత,
10వ తరగతి
జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల,
నర్సింహుల పల్లి,
పెద్దపల్లి జిల్లా.

కావాలి-కావాలి

వానలు కురవాలి - వాగులు పారాలి
చెరువులు నిండాలి - చేలే తడవాలి

మొలకలు లేవాలి - చివురులు తొడగాలి
పూవులు పూయాలి - పంటలు పండాలి

సాయం రావాలి - దానం చేయాలి
చదువులు సాగాలి - బతుకులు మారాలి

చిలుకలు పలకాలి - చీమలు బతకాలి
గోవులు పెరగాలి - జీవులు నిలవాలి

కలతలు తొలగాలి - కలుములు కూడాలి
మనసులు కలవాలి - మమతలు పంచాలి

ఆకలి తీరాలి - అందరు ఎదగాలి
ఆశలు మెరవాలి - దేశం గెలవాలి

- డా.పోతగాని సత్యనారాయణ,
ఖమ్మం,
91825 31202.

నేను గీసిన బొమ్మ





జె.మాధురి లక్ష్మి,
6వ తరగతి,
నిర్మల ఒలింపియాడ్,
ఒంగోలు.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పోషకాహారమే తీసుకుంటున్నారా..!



రోజు మొత్తంలో ఎంత బిజీగా ఉన్నా ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం కోసం ఎంతోకొంత సమయాన్ని కేటాయించాల్సిందే. ఆరోగ్యంగా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిందే. అనారోగ్యం భారినపడకుండా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలి. శరీరానికి తగినంత విశ్రాంతి ఉండాలి. ఒత్తిడి లేని జీవితాన్ని గడపాలి. ఏదీ అతిగా చేయకూడదు. తినకూడదు. తాగకూడదు. మనలో చాలామంది ఆకలి వేసినప్పుడు కడుపు నింపుకోవటానికి ఏది అందుబాటులో ఉంటే అది తినేస్తుంటాం. ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండేందుకు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. కొన్ని రకాల ఆహారాలను ప్రతిరోజూ తీసుకోవాలి. అలా చేస్తే ఆరోగ్యంగా ఉంటాం. ఆరోగ్యంగా ఉంటేనే మంచి నిద్ర పడుతుంది. అవసరమైన నిద్ర, సరైన ఆహారం ఇవే ఎక్కువ కాలం జీవించేలా చేస్తాయి. పోషకాహారం ఎందులో ఉందో తెలుసుకోవటం ఉత్తమం. కొన్ని రకాల ఆహారాల్లో ఎక్కువ పోషకాలుంటాయి. మరికొన్నింటిలో తక్కువగా ఉంటాయి. శరీరంలోని అవయవాలు, వ్యవస్థలు సరిగ్గా పనిచేయటానికి పోషకాలు అవసరం. పోషకాహారంలో ఉండే ముఖ్యమైన పోషకాలు అనేక రూపాల్లో దొరుకుతాయి.

కేలరీలు మించకుండా చూడాలి

శరీరానికి శక్తి నిచ్చే ఆహారాన్ని తీసుకోవటం మేలు. మోతాదుకు మించి తీసుకోకూడదు. అంటే సరిపడా కేలరీలు ఉన్న ఆహారాన్నే తీసుకోవాలి. ఎన్ని కేలరీలు అవసరమనేది తెలుసుకుని తీసుకోవటం మంచిది. ఎందుకంటే బరువు తక్కువగా ఉన్న వారు ఎక్కువ కేలరీలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. ఎక్కువ బరువు ఉన్న వారు తక్కువ కేలరీలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. ప్రస్తుత జీవన విధానంలో సాధారణ బరువు ఉండే వారికి ప్రతిరోజు 1600 నుంచి 1800 కేలరీలు ఉండే ఆహారం అవసరం అవుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అనునిత్యం తాజాపండ్లతోపాటు డ్రైఫ్రూట్స్, పెరుగు పదార్థాలను తీసుకుంటే శరీరానికి ఫైబర్, ప్రొటీన్లతోపాటు మంచి కేలరీలు అందుతాయని సూచిస్తున్నారు.

జంక్‌ఫుడ్ వద్దే వద్దు

శరీరంలో కేలరీల శాతం ఎక్కువగా ఉంటే వాటిని తగ్గించుకునేలా ఆహారాన్ని ఎంపిక చేసుకోవాలి. ఇలాంటి వారు పంచదార, స్వీట్లు, ఫ్రైఫుడ్, కూల్‌డ్రింకులు, కేకులు, ఐస్‌క్రీములు, పిజ్జాలు, బర్గర్లు, ఆల్కాహాల్ వంటివి తీసుకోకూడదు. చిన్న పిల్లలకు పాలిచ్చే తల్లులు, గర్భవతులకు పోషకాలు అధికంగా అవసరం. అందువల్ల వారి ఆహారంలో ఎక్కువ కేలరీలు ఉండేలా చూడాలి. వారు పాలు, పండ్లు, డ్రైఫ్రూట్స్ ఎక్కువగా తీసుకోవాలి. మధుమేహం ఉన్న వారికి సరిపడా కేలరీలు ఉన్న ఆహారమే ఇవ్వాలి. టీబీ ఉన్న వారు అత్యధిక కేలరీలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. ఎవ్వరికి వారు తాము చేసే పనిని బట్టి కూడా కేలరీల అవసరం మారుతూ ఉంటుంది. ఎక్కువగా పనిచేసే వారు ప్రతిరోజూ 2200 కేలరీల ఆహారాన్ని తీసుకోవచ్చు.

సముపాళ్లల్లో అందుతున్నాయా?

ప్రతిఒక్కరూ తమ శరీరానికి సరిపడా శక్తి కావాలంటే తినే భోజనంలో పిండి పదార్థాలు, ప్రొటీన్లు, కొవ్వులు, విటమిన్లు, ఖనిజాలు, నీరు సముపాళ్లలో ఉండేలా చూసుకోవాలి. అతిగా వద్దు. ఏదైనా సరిపడా తీసుకోవటం ఉత్తమం. రోజూ తినే అన్నం, చపాతీలను ఏదో ఒక పప్పుతో కలిపి తీసుకుంటే మంచిది. పిండి పదార్థాలకు ప్రొటీన్‌ను జతచేసినట్లే అవుతుంది.

మాంసాహారమూ మంచిదే...

శరీరానికి కావాల్సిన కేలరీలు మాంసాహారంలో అధిక మొత్తంలో ఉంటాయి. వీటిలో ఎక్కువగా ఉండే కొవ్వులు శరీరంలోకి చేరతాయి. ఇలా కొవ్వు శరీరంలోకి పేరుకుపోవటం అంత మంచిదికాదు. అందువల్ల వారానికి ఒకసారో...లేదా రెండుసార్లో తినాలి. శరీరానికి కావాల్సిన ప్రొటీన్లు, ఎ,డి, ఇ విటమిన్లు, కొవ్వులు ఉండే కోడిగుడ్లను ఆహారంలో భాగంగా చేసుకోవటం మేలు. బ్రెడ్ కూడా అదనపు బలం కోసం తోడ్పడుతుంది. ఎప్పుడో జ్వరం వచ్చినప్పుడే కాకుండా దీన్నిరోజూ ఆహారంలో చేసుకోవటం కూడా మంచిదే. ప్రతి బ్రెడ్ స్లైస్‌లో 69 కేలరీలు ఉంటాయి.

మొలకెత్తే గింజలతోనూ మేలు

తాజా పండ్లతోపాటుగా మొలకెత్తిన గింజలు తిన్నా శరీరానికి అదనపు శక్తి చేకూరుతుంది. శాకాహారం తినేవారిలో బీ12 లోపం ఎక్కువగా ఉంటుంది. అందువల్ల వారు ఉసిరి, క్యారెట్, ఖర్జూరం వంటి డ్రైఫ్రూట్స్‌ను తీసుకుంటే రకరకాల పోషకాలు శరీరానికి లభిస్తాయి.

వాల్‌నట్స్ మంచివే...

ప్రతిరోజూ సాయంత్రం పూట ఏదో ఒక పండును తినటం ఎంతైనా మంచిదే. ఆకలి తీరకపోతే చిప్స్, బిస్కెట్లు, కేకులు, మిర్చీ బజ్జీలు, ఉప్పు కలిపిన పదార్థాలు కొందరు తింటుంటారు. అయితే ఇలాంటి వాటికి బదులుగా బాదంపప్పు, పిస్తాపప్పు, జీడిపప్పు, వాల్‌నట్స్ లాంటివి తీసుకుంటే ఆరోగ్యానికి చాలా మంచిది. ఇవే కాకుండా పెరుగుతో చేసిన పదార్థాలు, మజ్జిగ లాంటివి తీసుకుంటే శరీరానికి ప్రొటీన్లు, మంచి కొవ్వులు లభించి అదనపు శక్తిని ఇస్తాయి. యాపిల్ పండుతోపాటు మరికొన్ని వాల్‌నట్స్ వంటివి తీసుకుంటే ఆకలితోపాటు ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.

శక్తినందించే సీజనల్ ఫ్రూట్స్

ఆయా సీజన్లలో వచ్చే తాజాపండ్లు తినడం ఎంతోమేలు. ప్రస్తుతం మామిడి, నేరేడు, పనస వంటి పండ్లు విరివిగా లభిస్తున్నాయి. ప్రతిఒక్కరూ ఉదయమో,సాయంత్రమో ఏదో ఒక సమయంలో రోజులో ఒకటో రెండో పండ్లు తీసుకోవటం ఆరోగ్యపరంగా ఎంతో మేలు చేస్తుంది. అవి శరీరానికి శక్తిని అందిస్తాయి. మార్కెట్లో అనేక రకాల పండ్లు అందుబాటులో ఉంటున్నాయి. పండ్లలో అనేక రకాల పోషకాలు ఉంటాయి. వీటితోపాటు విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు దండిగా లభిస్తాయి. మామిడి, బొప్పాయి, అరటి వంటి లేత పసుపు రంగు ఉండే పండ్లలో విటమిన్ ఎ ఎక్కువగా ఉంటుంది. దీని ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. బత్తాయి,నారింజ వంటి పండ్లతో మంచి ఆరోగ్యం మెరుగుదల అవుతుంది.



యోధుడికి చిన్నారి ఘన నివాళి..

కొన్నిరోజుల క్రితం కేరళ వామపక్ష తొలితరం యోధుడు కామ్రేడ్ వి.ఎస్ అచ్యుతానందన్ కన్నుమూశారు. ఆయన అంతిమయాత్రకు లక్షలాది మంది తరలివచ్చారు. గంటల తరబడి సాగిన ఆ యాత్రలో పున్నప్ర వద్ద 6 ఏళ్ల చిన్నారి, కామ్రేడ్‌ని ఉద్దేశించి నినదించిన నినాదాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అంతెత్తున ఉన్న టెర్రస్‌పై కూర్చొని పిడికిలి ఎత్తుతూ ఆ చిన్నారి ఏం అందంటే..

యోధుడా.. ఓ యోధుడా..
ఎవరు చెప్పారు నువ్వు వెళ్లిపోయావు అని..
లేదు లేదు.. నువ్వు చనిపోలేదు..
నువ్వు మా రక్తంలో ఉన్నావు..
ఓ పోరాట పుత్రుడా ..
ధైర్యవంతుడా..
నువ్వు ఎప్పటికీ ధైర్యవంతుడివే..
నీ వారసులం మేం..
నీ ఆశయాలను ముందుకు తీసుకెళ్తాం..
లాల్ సలామ్.. లాల్ సలామ్..


గొంతు చించుకుని, బిగ్గరగా నినదించిన ఆ చిన్నారి పేరు అయిరా బి హమిత. పున్నప్రలో నివసిస్తోంది. 1వ తరగతి చదువుతోంది. కామ్రేడ్ అంతిమయాత్ర తన ఇంటిమీదుగా వెళ్లేటప్పుడు ఆ చిన్నారి టెర్రస్‌పైకెక్కి గట్టిగట్టిగా ఈ నినాదాలు చేసింది. ఆ పోరాట యోధుడికి చిన్నారి అర్పించిన ఈ ఘన నివాళికి తనపై సోషల్ మీడియాలో ప్రశంసల జల్లు కురుస్తోంది.




'కలాం' పోస్టర్ విడుదల

భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జీవితం ఆధారంగా ఓ సినిమా తెరకెక్కుతోంది. 'కలాం' పేరుతో తెరకెక్కే ఈ బయోపిక్‌కు ఓం రౌత్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో ధనుష్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, టీ-సిరీస్ బ్యానర్‌పై అభిషేక్ అగర్వాల్, అనిల్ సుంకర, భూషణ్ కుమార్, క్రిషన్ కుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రామేశ్వరం నుంచి రాష్ట్రపతి భవన్ వరకు సాగిన కలాం స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని ఈ సినిమాలో ఆవిష్కరించబోతున్నారు. తాజాగా ఈ చిత్రం నుండి చిత్రబృందం పోస్టర్‌ని విడుదల చేసింది. సోమవారం ధనుష్ పుట్టినరోజు సందర్భంగా ఈ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. త్వరలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభిస్తున్నట్లు కూడా మేకర్స్ తెలిపారు.

దుల్కర్ 'కాంత' టీజర్ విడుదల



దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే, సముద్రఖని ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం 'కాంత'. సెల్వమణి సెల్వరాజ్ దర్శకుడు. దుల్కర్‌తో కలిసి హీరో రానా తదితరులు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రమోషన్స్‌లో భాగంగా సోమవారం దుల్కర్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. సెప్టెంబరు 12న ఈ సినిమా విడుదల కానుంది.



ఓటీటీలో క్రిష్ 'అరేబియా కడలి'

సత్యదేవ్ హీరోగా నటించిన 'అరేబియా కడలి' వెబ్ సిరీస్ ఆగస్టు 8న ప్రపంచవ్యాప్తంగా స్ట్రీమింగ్ కానుంది. ఈ సిరీస్‌ని క్రిష్ జాగర్లమూడి, చింతకింది శ్రీనివాసరావు రూపొందించారు. ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై వై. రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లమూడి నిర్మించారు. వి.వి. సూర్య కుమార్ దర్శకత్వ బాధ్యతలు వహించారు. సత్యదేవ్, ఆనంది ప్రధాన పాత్రల్లో నటించగా, నాజర్, రఘు బాబు, దలీప్ తాహిల్, పూనమ్ బజ్వా, ప్రభావతి, హర్ష్ రోషన్, ప్రత్యూష సాధు, కోట జయరాం తదితరులు ఇతర పాత్రలు పోషించారు. ఈ సిరీస్ ప్రైమ్ వీడియోలో భారతదేశంతో పాటు 240కి పైగా దేశాలు, వివిధ ప్రాంతాల్లో విడుదల కానుంది.


'యముడు' పాటలు విడుదల

జగదీష్ ఆమంచి కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన సినిమా 'యముడు' 'ధర్మో రక్షతి రక్షిత:' అనేది ఉప శీర్షిక. ఇందులో శ్రావణి శెట్టి కథానాయిక. తాజాగా ఈ మూవీ ఆడియో లాంచ్ వేడుకను మేకర్స్ నిర్వహించారు. ఇందులోని పాటలను ప్రముఖ నిర్మాత బెక్కెం వేణుతో పాటు ప్రియాంక, మల్లిక విడుదల చేశారు. ఈ సందర్భంగా బెక్కెం వేణు మాట్లాడుతూ 'ప్రస్తుతం ఎక్కడ చూసినా కుట్రలు, కుతంత్రాలు, హత్యలు, అక్రమ సంబంధాలకు సంబంధించిన వార్తలే కనిపిస్తున్నాయి. ఆ పాయింట్స్‌తోనే ఈ చిత్రాన్ని తీశాం. అందరినీ ఆకట్టుకునేలా మా చిత్రం ఉంటుంది' అని అన్నారు. ఈ సినిమా తమకు మంచి గుర్తింపు తెచ్చి పెడుతుందనే ఆశాభావాన్ని శ్రీమల్లిక, శ్రావణి శెట్టి వ్యక్తం చేశారు.



'అర్జున్ చక్రవర్తి' టీజర్ విడుదల

విజయరామరాజు టైటిల్ రోల్ పోషించిన స్పోర్ట్స్ డ్రామా 'అర్జున్ చక్రవర్తి'. విక్రాంత్ రుద్ర దర్శకత్వం వహించిన ఈ సినిమాని నిర్మాత శ్రీని గుబ్బల నిర్మించారు. తాజాగా ఈ చిత్రం నుండి హను రాఘవపూడి టీజర్‌ని విడుదలచేశారు. ఓ కబడ్డీ ఆటగాడి నిజ జీవితాన్ని ఆధారంగా తీసుకొని ఈ చిత్రాన్ని రూపొందించారు. టీజర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో విజయరామరాజు మాట్లాడారు. 'టీజర్ చూసిన ప్రతి ఒక్కరూ చాలా అద్భుతంగా ఉందని చెబుతున్నారు. ఇది చాలా ఆనందాన్నిచ్చింది. ఈ సినిమాకి పనిచేసిన ప్రతి ఒక్కరూ చాలా అద్భుతమైన వర్క్ చేశారు. మ్యూజిక్. విజువల్స్ ఇవన్నీ కూడా నెక్స్ట్ లెవెల్‌లో ఉంటాయి. హీరోయిన్ సిజ్జా ఈ సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేసింది' అన్నారు.



విజయ్ దేవరకొండ ఫ్యాన్స్ మీట్



విజయ్‌దేవరకొండ నటించిన కొత్త సినిమా 'కింగ్‌డమ్' ఈనెల 31 విడుదల సందర్భంగా విజయ్ తన ఫ్యాన్స్‌ని కలుసుకున్నారు. సారథి స్టూడియోలో ఈ కార్యక్రమం జరిగింది. ఫ్యాన్స్‌మీట్‌లో ఎక్కువమంది కాలేజీ విద్యార్థులే పాల్గొన్నారు. అక్కడికి వచ్చిన తన ఫ్యాన్స్ అందరితో ఫోటోలు దిగారు. 'జెర్సీ' మూవీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. పోలీస్ ఆఫీసర్‌గా విజయ్‌దేవరకొండ నటించారు. ఆయన నటించిన ఈ సినిమా సీక్వెల్ కూడా రానుంది.

మెడిసిన్ చదవాలనుకొని

చదరంగం వైపు అడుగులు

19ఏళ్లకే ఫిడే మహిళల ప్రపంచ కప్ ఛాంపియన్‌గా నిలిచిన దివ్య దేశ్‌ముఖ్ సొంత ఊరు మహారాష్ట్రలోని నాగ్‌పూర్. ఆమె తల్లిదండ్రులు జితేంద్ర దేశ్‌ముఖ్, నమ్రతా దేశ్‌ముఖ్ ఇద్దరూ డాక్టర్లే. దీంతో తాను పెద్దయ్యాక వైద్యురాలిగా స్థిరపడాలనకుంది. అనుకోకుండా చదరంగం వైపు ఆమె అడుగులు పడ్డాయి. భవాన్స్ భగవాన్‌దాస్ పురోహిత్ విద్యా మందిర్‌లో దివ్య జీవితంలో టర్నింగ్ పాయింట్. అక్కడే ఆమె చెస్ మీద ఆసక్తి పెంచుకుంది. చిన్న వయసు నుంచే అద్భుత విజయాలను నమోదు చేసుకుంటూ.. ఏడేళ్లకే నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో విజయంతో అందరి దృష్టిలో పడింది. 2021లో ఉమెన్ గ్రాండ్‌మాస్టర్ టైటిల్ గెలుపొందిన ఆమె.. అదే ఏడాది ఇంటర్నేషనల్ మాస్టర్స్ విజేతగా నిలిచింది. 2022లో ఇండియన్ చెస్ ఛాంపియన్‌షిప్ టైటిల్ కైవసం చేసుకున్న దివ్య.. బోర్డు ముందు ప్రశాంతంగా ఉంటూనే వ్యూహాత్మక ఆటతో ప్రత్యర్థుల పాలిట సింహస్వప్నంలా మారింది. ఈ ఏడాది 'ఫిడే చెస్ ఒలింపియాడ్'లో భారత బృందం విజయంలో కీలక పాత్ర పోషించిందీ యంగ్‌స్టర్. ఫిడే మహిళల వరల్డ్ కప్‌లో తన హవా కొనసాగించిన ఈ యువకెరటం తొలి సెమీస్‌లో దివ్య దేశ్‌ముఖ్ 1.5-0.5పాయింట్ల తేడాతో జోంగ్యాయి తాన్(చైనా)పై గెలిచి ఫైనల్‌కు దూసుకెళ్లింది. టైటిల్ పోరులో రెండుసార్లు ర్యాపిడ్ చెస్ ఛాంపియన్ కోనేరు హంపిని మట్టికరిపించింది. ఈ క్రమంలోనే భారత్‌నుంచి జీఎం హోదా సాధించిన నాల్గో మహిళా గ్రాండ్‌మాస్టర్‌గా దివ్య దేశ్‌ముఖ్ నిలిచింది. అలాగే మనదేశం నుంచి 88వ గ్రాండ్‌మాస్టర్ ట్యాగ్ సొంతం చేసుకుంది. - స్పోర్ట్స్ డెస్క్



'ఆ నలుగురు' రెండ్రోజులు ఆడేశారు

142ఓవర్ల పాటు క్రీజ్‌లో ఉన్న బ్యాటర్లు • ముగ్గురు సెంచరీలు, ఒకరు అర్ధసెంచరీ

మాంచెస్టర్: నాల్గో టెస్ట్ డ్రా ముగించడంతో 'ఆ నలుగురు' కీలకపాత్ర పోషించారు. ఇంగ్లండ్ కంటే 311 పరుగులు వెనుకబడి, రెండ్రోజుల ఆట మిగిలి ఉండగా.. ఓటమి ఖాయం అనుకున్న దశలో 'ఆ నలుగురు' బ్యాటర్లు అద్భుతం చేశారు. తొలి ఓవర్లోనే సాయి సుదర్శన్, జైస్వాల్ డకౌటై వెనుదిరిగినా.. ఏమాత్రం చెక్కుచెదరని విశ్వాసంతో రెండ్రోజులపాటు క్రీజ్‌లో నిలదొక్కుకొని ఆడారు. ఆ నలుగురు బ్యాటర్లు ఏకంగా 142 ఓవర్లపాటు క్రీజ్‌లో నిలిచి టెస్ట్ మ్యాచ్‌ను డ్రాగా ముగించడంలో కీలకపాత్ర పోషించారు. వారు మరెవరో కాదు.. ఒకరు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కాగా.. మరొకరు కెఎల్ రాహుల్. వీరికి తోడు ఆల్‌రౌండర్లు జడేజా, సుందర్. వీరిలో గిల్, జడేజా, సుందర్ సెంచరీలతో రాణించగా.. కెఎల్ రాహుల్ అర్ధసెంచరీతో మెరిసాడు. ఆ నలుగురి పోరాట స్ఫూర్తితోనే భారతజట్టు ఇంగ్లండ్‌తో జరిగిన నాల్గో టెస్ట్‌ను డ్రాగా ముగించగలిగింది. ఈ క్రమంలో వారి పోరాట స్ఫూర్తికి మాజీ క్రికెటర్లు అభినందనలు తెలుపుతున్నారు.

బెన్ స్టోక్స్ ఆఫర్‌ను తిరస్కరించిన జడేజా..

నాల్గో టెస్టులో హై డ్రామా చోటుచేసుకుంది. ఆ మ్యాచ్ డ్రా అయినా.. ఆఖరి రోజు చివరి 15 ఓవర్ల ముందు ఇంగ్లండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ ఇచ్చిన ఆఫర్‌ను జడేజా సున్నితంగా తిరస్కరించాడు. ఇక డ్రా అనివార్యం అని తెలిసిన సయమంలో.. బెన్ స్టోక్స్ హ్యాండ్‌షేక్ ఇచ్చే ప్రయత్నం చేశాడు. కానీ ఆ సమయంలో జడేజా 89, సుందర్ 80 పరుగులతో బ్యాటింగ్ చేస్తున్నారు. స్టోక్స్ చేసిన ఆఫర్‌ను జడేజా అంగీకరించలేదు. సెంచరీకి చేరువలో ఉన్న భారత క్రికెటర్లు.. ముందుగానే డ్రాను అంగీకరించేందుకు ఇష్టపడలేదు. డ్రా కోసం హ్యాండ్‌షేక్ ఇచ్చేందుకు భారత క్రికెటర్లు ఎందుకు నిరాకరించారో స్టోక్స్‌కు అర్థం కాలేదు. దీంతో ఫీల్డ్ అంపైర్ల దృష్టికి ఈ విషయాన్ని స్టోక్స్ తీసుకెళ్లగా.. బ్యాటర్లు అంగీకరిస్తేనే మ్యాచ్‌ను నిలిపివేస్తామని తెలిపారు. దాంతో స్టోక్స్ భారత క్రికెటర్లను వేధించే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో జడేజాపై స్టోక్స్ కామెంట్ చేశాడు. 'హ్యారీ బ్రూక్ బౌలింగ్‌లో సెంచరీ కొట్టాలనుకుంటున్నావా' అని జడేజాపై వ్యంగ్యంగా కామెంట్ చేశాడు స్టోక్స్. దానికి జడేజా బదులిస్తూ తానేమీ చేయలేనన్నాడు. రూల్స్ ప్రకారం భారత బ్యాటర్లు ఇంకా గంట సేపు బ్యాటింగ్ చేసేందుకు అవకాశం ఉందని తెలిపాడు. ఈ క్రమంలో హ్యారీ బ్రూక్‌తో బౌలింగ్ చేయించాడు స్టోక్స్. బ్రూక్ బౌలింగ్‌లో సిక్సర్ కొట్టిన జడేజా టెస్టుల్లో మూడవ సెంచరీ పూర్తి చేసుకోగా.. వాషింగ్టన్ సుందర్ కెరీర్‌లో తొలి సెంచరీ పూర్తి చేసుకున్నాడు. వీరిద్దరి సెంచరీలు పూర్తయ్యాక ఇంగ్లండ్ క్రికెటర్లకు షేక్‌హ్యాండ్ మన బ్యాటర్లు.. దీంతో మ్యాచ్ డ్రా అయ్యింది. 'ఆల్ ది బెస్ట్' జడేజా, సుందర్.



కెఎల్ రాహుల్-శుభ్‌మన్ గిల్ వాషింగ్టన్ సుందర్-రవీంద్ర జడేజా



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68